# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 1 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 28 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## కారుకు బేడీలు



2

## 94 ఏండ్ల వయస్సులో సినిమా దర్శకత్వం

రికార్డులకెక్కనున్న సింగీతం శ్రీనివాసరావు



2

## 11 గంటలకు బడ్జెట్

### పార్లమెంటులో పెట్టనున్న మంత్రి నిర్మలాసీతారామన్




**హైదరాబాద్, జనవరి 31:** ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలను నేడు ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెం టుకు సమర్పిస్తారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఆదివారం రోజున బడ్జెట్ ను సమర్పిస్తుండడం ఒక విశేషం. కాగా, ఒక మహిళా ఆర్థిక మంత్రి వరుసగా ఒకే ప్రధాని నేతృత్వంలో సమర్పించనున్న తొమ్మిదవ కేంద్ర బడ్జెట్ కావడం మరో విశేషం. ఈ బడ్జెపై దేశవ్యాప్తంగా ప్రజలు, వ్యాపార వర్గాలు, మధ్య తరగతి వేతనదారుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని ముందుంచుకుని ఆర్థిక సంస్కరణలు, కస్టమ్స్ డ్యూటీ మార్పులు, రుణ తగ్గింపు, మౌలిక సదుపాయాలు, సామాజిక సంక్షేమం వంటి అంశాలపై ఈ బడ్జెట్లో మరింత దృష్టి సారించే అవకాశం ఉంది. ఆదాయపు పన్ను రాయితీలు, రక్షణ, వ్యవసాయం, ఆర్థిక వృద్ధి వంటి రంగాల్లో ప్రజలు, వ్యాపారవేత్తలు ఆశలు పెట్టుకున్నారు. రాజ్యాంగపు ఆర్టికల్ 112 ప్రకారం.. ఏటా ఉభయ సభల ముందూ సమర్పించే ఈ ఆర్థిక ప్రకటనలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆదాయాలు, ఖర్చుల అంచనాలు, పన్ను ప్రతిపాదనలు, వ్యయ ప్రాధాన్యాలు, సంస్కరణలు, అభివృద్ధి చర్యలు వివరిస్తారు.

## మహారాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్

2

# అన్ని స్థానాలనూ గెలవాల్సిందే

## అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం కూడదు

### పార్టీ బలహీనంగా ఉన్నచోట ప్రత్యేక దృష్టి పెట్టాలె

### మున్సిపల్ ఎన్నికలపై అమెరికా నుంచి జూమ్ ద్వారా సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, జనవరి 31 (మనం బ్యూరో):** మున్సిపల్ ఎన్నికలలో అన్ని స్థానాలలో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలనీ, అభ్యర్థుల ఎంపికలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు, బీఆర్ఎస్, బీజేపీ

...మిగతా 2లో



2

హార్వర్డ్ 'లీడర్ స్టూడెంట్స్'తో సీఎం

## అభివృద్ధి నమూనాలపై చర్చలు

నాయకత్వం, విజయానికి సంబంధించిన అంశాలపై కూడా..

మాతృదేశంతో అనుబంధం పెంచుకోవాలని విద్యార్థులకు పిలుపు

అమెరికా పర్యటన ముగించుకుని నేడు హైదరాబాద్‌కు

# అభివృద్ధికి బీఆర్ఎస్ నేతలు మోకాలడ్డుతున్నరు

### జాతీయ సగటుకన్నా రాష్ట్రంలో ద్రవ్యోల్బణం తక్కువ • మా పారదర్శక, ప్రగతిశీలక పాలనకు ఎకనామిక్స్ సర్వే కితాబిచ్చిందన్న మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 31 (మనం బ్యూరో):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ మోకాలడ్డుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందనీ, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుబడిందనీ, పెట్టుబడులు రావడం లేదంటూ అసత్యాలను వండి వార్చుతున్నారని పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమా



వేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంలో భావోద్వేగాలకు తావుండవచ్చు కానీ, గణాంకాలు ఎప్పుడూ అబద్దాలు చెప్పవని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సాధిస్తున్న పురోగతికి, ఆర్థిక వ్యవస్థ పనితీరుకు, పారదర్శక పాలనకు తాజాగా కేంద్రం విడుదల చేసిన ఎకనామిక్స్ సర్వే 2025-26 నిదర్శనమని పేర్కొన్నారు. 2023-24లో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ గత రెండేళ్లలో

...మిగతా 2లో

# బిడ్డల్లారా.. మల్లొస్తం

• వనప్రవేశం చేసిన గిరిజన దేవతలు

• ముగిసిన సమ్మక్క, సారలమ్మ మహాజాతర

**మేడారం, జనవరి 31:** మూడు రోజులుగా భక్తుల కొంగుబంగారంగా కొనసాగిన గిరిజన మహా జాతర ముగిసింది. సమ్మక్క, సారలమ్మలు గద్దెల నుంచి బయలుదేరి తిరిగి వన ప్రవేశం చేశారు. తల్లులారా మళ్లొస్తం.. అంటూ భక్తులు కూడా తమ ఇండ్లకు బయలుదేరారు. రెండు రోజులపాటు గద్దెలపై కొలువుదీరిన తల్లులకు భక్తులు మొక్కులు చెల్లించి వారి సన్నిధిలో ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యుల భక్తి పూర్వకంగా గడిపారు. శివసత్తుల పూనకాలు.. భక్తుల సంగీత సంరంభాలు ఆడవి ప్రాంతాన్ని మోతెక్కించాయి. దేవతలు వనంలోకి, భక్తులు ఇళ్లకు మరలడంతో జాతర పరిసర ప్రాంతాలు మొత్తం మూగబోతున్నాయి.

జాతర వార్తలు.. విశేషాలు.. 11వ పేజీలో..



# ప్రతీ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయమే

బీజేపీ ఎంపీలు నిధులు కేటాయించేలా చొరవ తీసుకోవాలె

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడొద్దు

మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, జనవరి 31 (మనం బ్యూరో):** కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నదని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ బడ్జెట్‌లో

...మిగతా 2లో

# సిట్‌తో యుద్ధం... సారు సిద్ధం

## విచారణకు గులాబీ బాస్ సుముఖం

కేసీఆర్‌ను ప్రశ్నించేందుకు సిట్ కసరత్తు

పక్కా ఆధారాలతో సిట్ ప్రశ్నావళి

నేడు నందినగర్‌లో విచారణ!

ట్యాపింగ్ కేసు పొలిటికల్ టర్నింగ్

అన్ని కోణాలలో ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు

సార్‌తో విచారణ సమాప్తమయ్యేనా?



**హైదరాబాద్,జనవరి 31(మనం,ప్రత్యేకప్రతినిధి):** రోజు రోజుకూ మలుపులు తిరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం చివరిదశకు చేరుకుంది. ఈ కేసులో కొందరు పోలీసు అధికారులు జైలు పాలుకాగా మరికొందరు రాజకీయ నాయకులు సిట్ విచారణను ఎదుర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ ప్రశ్నించనుంది. ఈ క్రమంలో

...మిగతా 2లో

## ఏందిది?.. గింత చిల్లరగా చేస్తరా?

3

## రూ.11,460 కోట్లు జీహెచ్‌ఎంసీ బడ్జెట్‌కు ఆమోదం

### 10వ తేదీతో ముగియనున్న పాలక మండలి పదవీకాలం

### కౌన్సిల్‌కు కార్పొరేటర్ల భావోద్వేగ వీడ్కోలు

**హైదరాబాద్, జనవరి 31:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలక మండలి పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం ఆఖరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వివిధ పార్టీల కార్పొరేటర్ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేసీఆర్ హయాంలో జీహెచ్‌ఎంసీ అప్పుల పాలైందని, అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళన చేశారు. అయితే, మేయర్ గద్వాల విజయలక్ష్మి నచ్చచెప్పడంతో ఇరు పార్టీల కార్పొరేటర్లు సర్దుమణిగారు. అనంతరం

...మిగతా 2లో

## బంగాళాఖాతంలో మాడ్రన్ మిస్సైల్ టెస్టులు!

### నోటమ్ జారీ చేసిన భారత్

**ఢిల్లీ, జనవరి 31:** బంగాళాఖాతంపై భారత్ నోటమ్ జారీ చేసింది. ఫిబ్రవరి 5-6 తేదీల్లో బంగాళాఖాతంపై 3,190 కిలోమీటర్ల పరిధిలో విమానాలను అనుమతించబోమంటూ వివిధ విమానయాన సంస్థలకు నోటీసులు (నోటమ్) ఇచ్చింది. గతంలో 2,530 కిలోమీటర్లు ఉన్న నోటమ్ పరిమితిని సుమారు 3,190 కిలోమీటర్లకు పెంచినట్లు తెలుస్తోంది. క్షిపణి పరీక్షల కోసం భారత్ ఈ నోటీసులు జారీ చేసినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సముద్ర ఆధారిత క్షిపణి పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో బంగాళాఖాతం గగనతలంలో ఎటువంటి పౌర విమానాలు ఎగరడానికి అనుమతి ఉండదని తెలిపాయి. అయితే క్షిపణుల ప్రయోగంపై భారత ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా ఆపరేషన్ సిందూర్ తర్వాత పెద్ద మొత్తంలో ఆయుధాలను సమకూర్చుకుంటున్న భారత్.. స్వదేశీ క్షిపణులను విరివిగా పరీక్షిస్తోన్న విషయం తెలిసిందే.

## చిన్నారుల్లో 'చారు'మందహాసం

రాష్ట్రంలో ఆపరేషన్ స్మైల్ సక్సెస్

5,582 మంది చిన్నారులకు విముక్తి

1,480 కేసులు నమోదు

1,483 మంది నిందితులను అరెస్ట్

అదనపు డీజీపీ చారుసిన్హా వెల్లడి



2



కేసీఆర్ విచారణ

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ జారీ చేసిన నోటీసులపై కేటీఆర్ తనదైన శైలీలో మండిపడ్డారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం ముందు ఇంటి గోడకు నోటీసులు అతికించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 'గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందారు' అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. సిట్ అధికారులకు కేసీఆర్ స్వయంగా తన చిరునామాను అందించారని

...మిగతా 2లో



# అప్పులు అడగాలంటే సిగ్గేస్తుంది

### పాక్ ప్రధాని షరీఫ్

**ఇస్లామాబాద్, జనవరి 31:** పాకిస్తాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీనినుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తో కలిసి నేను రహస్యంగా మిత్ర దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాము. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండు చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు. అయితే రుణాలు ఇచ్చే విషయంలో చాలా దేశాలు తమను నిరాశ పరచలేదన్నారు. పరిస్థితులతో సంబంధం

...మిగతా 2లో



# సోషల్ మీడియా.. చిన్నారుల మెదళ్లను తినేస్తుంది

### నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్

**ఢిల్లీ, జనవరి 31:** యువత సోషల్ మీడియా విపరీత వాడకంపై ఇటీవలి ఆర్థిక సర్వే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ డిజిటల్ వ్యవసం ఆర్థిక దుష్పరిణామాలకు దారితీస్తుందని, వయసుపరంగా నియంత్రించాల్సిన అవసరం ఉందన్న సూచనలపై నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ ఏకీభవించారు. చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుందన్న ఆయన.. స్కూళ్లు, కాలేజీల్లో వీటి వాడకాన్ని నిషేధించాలన్నారు. 'సోషల్ మీడియాలో వయోపరిమితి అవసరమని ఆర్థిక సర్వే సూచనతో వందశాతం ఏకీభవిస్తున్నా. ఇది చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఉత్పాదకతను, ఏకాగ్రతను తగ్గిస్తుంది. దీని ఫలితంగా దీర్ఘకాలంలో ఆన్లైన్లో ఉంటూ, వాస్తవిక ప్రపంచంలో కష్టపడి పనిచేయలేని తరం ఏర్పడుతుంది. ఇలా మనం వికసిత్ భారత్ను నిర్మించలేం. నిజానికి.. స్కూళ్లు, కాలేజీల్లో దీన్ని పూర్తిగా నిషేధించాలి' అని అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు.

#### ఆర్థిక సర్వే ఏం చెప్పింది..?

భారత్లో యువత సామాజిక మాధ్యమాల వినియోగం తీరుపై ఆర్థిక సర్వే తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేసింది. దేశంలో ఈ డిజిటల్ వ్యసనం తీవ్ర ఆర్థిక పరిణామాలకు

...మిగతా 2లో

## అన్నిస్థానాలనూ గెలవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డు, డివిజన్ గెలుపు ముఖ్యమనీ, రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలన్నారు. గతంలో గ్రామ పంచాయతీలలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ఎక్కువ స్థానాలు సాధించిన చోట ఆ రెండు పార్టీలకు మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి గెలిచే అవకాశం ఇవ్వొద్దని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# హార్వర్డ్‌లో ప్రతినిధి బృందాలతో సీఎం రేవంత్ భేటీ

**హైదరాబాద్, జనవరి 31 (మనం బ్యూరో):** సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని ఆదివారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. గత వారం దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సుకు హాజరైన సీఎం అక్కడ పలు అంతర్జాతీయ సంస్థలకు చెందిన ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. ఫోరంలో తెలంగాణ పెవిలియన్‌ను ఆవిష్కరించి పెట్టుబడులకు సంబంధించి చర్చలు జరిపారు. ఆ తరువాత అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో గత నెల 25 నుంచి 30 వరకు లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ పేరిట నిర్వహించిన తరగతులకు హాజరయ్యారు. తన అధికారిక కార్యక్రమాల చివరి రోజైన శనివారం సీఎం హార్వర్డ్ యూనివర్సిటీలో వివిధ ప్రతినిధి బృందాలతో భేటీ అయ్యారు.



వివిధ పాఠశాలల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో పాటు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కొలంబియా విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్యా సంస్థల విద్యార్థులు, అలుమ్నితోనూ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో నాయకత్వం, విజయానికి సంబంధించిన అంశాలు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి నమూనాలు, సుస్థిరత, పర్యావరణ సవాళ్లు, రైతులు, మహిళలు, యువతకు సంక్షేమ విధానాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై తన దృక్పథాన్ని మార్పు దిశగా నాయకత్వం వహించడంలో ఉన్న సవాళ్లతో పాటు దీర్ఘకాలిక విజన్‌ను వివరించారు. సమగ్ర వృద్ధి, భాగస్వామ్యం, శక్తిమంతీకరణ అభివృద్ధికి ఈ విజన్ కల్పించే అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థుల బృందం తమకు నాయకత్వం గురించి బోధించాలని కోరగా అందుకు హార్వర్డ్ ప్రొఫెసర్లే అర్హులనీ, ఈ విషయంలో తాను మోసపూరిత ప్రొఫెసర్ పాత్రను పోషించదల్చుకోలేదని వ్యాఖ్యానించారు. పరస్పర సంభాషణ, అనుభవాలు పంచుకోవడం, పరస్పర అధ్యయనం ఆధారంగా జరిగే చర్చలకు తాను ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దేశ భవిష్యత్తుకు తెలంగాణ, హైదరాబాద్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మాతృదేశంతో అనుసంధానం పెంచుకుని పనిచేయాలనీ తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి అని ఈ సందర్భంగా విద్యార్థులకు పిలుపునిచ్చారు. సీఎం పిలుపుపై సానుకూలంగా స్పందించిన విద్యార్థులు తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగడంలో తమ శక్తి సామర్థ్యాలను, నైపుణ్యాన్ని వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేసేందుకు కట్టుబడి ఉన్నట్టు ఈ సందర్భంగా హార్వర్డ్ వర్సిటీ ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు.

## కారుకు బేడీలు

**జబల్పూర్, జనవరి 31:** డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన పోలీసులు మద్యం సేవించి కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి కారు స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షల తర్వాత అతడ్ని పంపివేశారు. అయితే, పోలీస్ స్టేషన్లో ఉంచిన ఆ కారుకు బేడీలు వేశారు. మధ్యప్రదేశ్లోని జబల్పూర్లో ఈ సంఘటన జరిగింది. దామోహ్ నాకా ప్రాంతానికి చెందిన ప్రథమ్ కుమార్ మద్యం సేవించి కారు నడిపాడు. డ్రంక్ అండ్ డ్రైవ్లో పోలీసులు అతడి కారును స్వాధీనం చేసుకున్నారు. వైద్యపరీక్షల తర్వాత ప్రథమ్ కుమార్ను వదిలేసి, కారుకు మాత్రం బేడీలు వేశాలరు.

# ప్రతీ బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయమే

(మొదటి పేజీ తరువాయి)

అయినా రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు చొరవ తీసుకుని ఎక్కువ నిధులు విడుదలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి. రాష్ట్రంపై ప్రధాని మోడీ చిన్న చూపు చూస్తున్నరు. తెలంగాణ పుట్టుకనే పీఎం అవమానించారని పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలనీ, ట్రిబుల్ ఆర్, మెట్రో, పెండింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి వెంటనే నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారంగా మాట్లాడింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్రంలో సయోధ్య కోరుకుంటోంది, బడ్జెట్‌లో మా ప్రతిపాదనలకు కేంద్రం అంగీకరించాల్సిందేనన్నారు. తెలంగాణ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడాలి. ఆదివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# మహారాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్



**ముంబై, జనవరి 31:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. దీనితో ఆ రాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర రికార్డులకెక్కారు. ముంబయిలోని లోక్ భవన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. మహారాష్ట్ర బారామతిలో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ పరిణామంతో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన సతీమణి సునేత్రను పార్టీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఉప ముఖ్యమంత్రిగా ఆమె నేడు ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, అజిత్ పవార్ నిర్వహించిన ఆర్థికశాఖ మినహా ఎక్సైజ్, క్రీడా మంత్రిత్వ శాఖలను సునేత్రకే కట్టబెడతారని వార్తలు వెలువడుతున్నాయి.

## అప్పులు అడగాలంటే సిగ్గైతుంది

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా పాకిస్తాన్ కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా వంటి మిత్ర దేశాలన్నింటికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడంపై షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఆర్థికసాయం అందించిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉందన్నారు. మిత్ర దేశాల నుంచి అప్పులు కోరడంపై పాక్ ప్రధాని నిరాశ వ్యక్తంచేయడం ఇదేం తొలిసారి కాదు.



## అభివృద్ధికి బీఆర్ఎస్ నేతలు మోకాలడ్డుతున్నరు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం మెరుగైన పనితీరును కనబరిచిందన్నారు. ద్రవ్యోల్బణం జాతీయ సగటు 4.63 శాతం ఉంటే తెలంగాణలో కేవలం 3.67 శాతంగా ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జాతీయ సగటు 1.72 శాతంగా ఉంటే తెలంగాణలో 0.20 శాతంగా ఉందని ఈ సర్వే తేల్చి చెప్పిందని స్పష్టం చేశారు. వార్షిక వృద్ధిలో తెలంగాణ దూసుకుపోతుంటే రాష్ట్రం వెనుకబడిందంటూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

మేము సంపదను సృష్టిస్తున్నాం, ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాం. భావితరాల భవిష్యత్తు కోసం బాటలు వేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## కేసీఆర్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ గుర్తుచేశారు. అయినప్పటికీ ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించడం పైశాచిక చర్యేనని మండిపడ్డారు. ఇది అహంకారం కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారు ఉంటున్న ఇంటికే వెళ్లి విచారించాలని నిబంధనలు చెబుతున్నాయని, ఈ నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు..

ఉద్యమనేత, తెలంగాణ బీష్మడు, మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని, బీఆర్ఎస్ నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఆదివారం నాడు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలు చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గ, పట్టణ, మున్సిపాల్‌తో పాటు ప్రతి గ్రామంలో బైక్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు తెలపాలని, ప్రభుత్వం దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని, చౌరాస్తాలు, కూడళ్లలో సర్కార్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. అట్లాగే.. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు శాంతియుతంగా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

# రూ.11,460 కోట్ల జీహెచ్ఎంసీ బడ్జెట్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

2026-27 బడ్జెట్ కు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది.

**బడ్జెట్ వివరాలు:**

జీహెచ్ఎంసీకి వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయం : రూ.6,441కోట్లు
జీహెచ్ఎంసీ ఖర్చు : రూ.4,057 కోట్లు
రెవెన్యూ మిగులు : రూ.2,384 కోట్లు
జీహెచ్ఎంసీ రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లు
కొత్తగా విలీనమైన మున్సిపాలిటీల కోసం కేటాయింపులు: రూ.2,260 కోట్లు
విలీనమైన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ : రూ.1,860 కోట్లు

## సోషల్ మీడియా.. చిన్నారుల మెదళ్లను తినేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

దారితీస్తుందని హెచ్చరించింది. అనేక అంశాలు నేర్చుకునేందుకు, ఉద్యోగానికి, పౌర భాగస్వామ్యాన్ని పెంచడంలో సోషల్ మీడియా దోహదపడుతున్నప్పటికీ.. తీవ్ర వాడకం వల్ల ఆర్థిక, సామాజిక నష్టాలు తప్పవని స్పష్టం చేసింది. దేశ యువతలో మానసిక ఆరోగ్య సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందంటూ.. ఇందుకు సంబంధించిన దేశీయ, అంతర్జాతీయ అధ్యయనాలను ప్రస్తావించింది.

# నగరంలో కాల్పుల కలకలం

**తుపాకితో కల్పులు...రూ. 6 లక్షలు చోరీ**

**హైదరాబాద్,జనవరి 31(మనం,ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్ నగరంలోని కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో శనివారం ఉదయం కాల్పులు కలకలం రేపాయి. ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద ఏటీఎంలో డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తిపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపి.. రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం 7 గంటలకు రషీద్ అనే వ్యక్తి బ్యాంక్ ఏటీఎంలో రూ.6లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు బ్యాంక్ స్ట్రీట్‌కు వచ్చాడు. రషీద్ డబ్బులతో రావడం గమనించిన కొందరు దుండగులు అతడిని వెంబడించారు. అది గమనించి రషీద్ పారిపోతుండటంతో అతనిపై కాల్పులు జరిపి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో రషీద్ కాలికి గాయమైంది. దీనిపై సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. రషీద్‌ను ఆస్పత్రికి తరలించిన పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు. విచారణలో భాగంగా ఘటనాస్థలిలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు.

**ప్రత్యేక బృందాలు :**

కాల్పులకు తెగబడిన నిందితుల కోసం 5 బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు.

# చిన్నారుల్లో 'చారు'మందహాసం

**హైదరాబాద్, జనవరి 31(మనం, ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఆరువేల మంది చిన్నారుల జీవితాలలో రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ చారుసిన్హా వెలుగులు నింపారు. ఈక్రమంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు లక్ష్యంగా నెల రోజుల పాటు చేపట్టిన 'ఆపరేషన్ స్మైల్ విజయవంతమైంది. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 5,582 మంది చిన్నారులకు విముక్తి కల్పించినట్లు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ చారుసిన్హా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకత్వంలో జనవరి 1 నుంచి 31 వరకు కొనసాగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 121 సబ్ డివిజనల్ పోలీసు బృందాలు పాల్గొన్నాయని, ఇందులో మొత్తం 605 మంది పోలీసు సిబ్బంది పనిచేశారని ఆమె వివరించారు. ఈ ఆపరేషన్‌లో మహిళా శిశు సంక్షేమ, కార్మిక, ఆరోగ్య శాఖలతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో వ్యవహరించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు డిసెంబరు 29న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల కార్మిక నిరోధక చట్టాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, అనంతరం రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు, టీ స్టాళ్ల వంటి ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టామన్నారు.

**15 రాష్ట్రాల చిన్నారులు:**

ఆపరేషన్ స్మైల్ -12 ద్వారా 15 రాష్ట్రాలకు చెందిన బాల,బాలికలను రక్షించినట్లు చారుసిన్హా వెల్లడించారు. వీరిలో 5,108 మంది బాలురు, 474 మంది బాలికలు ఉన్నారని, వీరిలో 2,292 మంది బిహార్, ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సహా సుమారు 15 రాష్ట్రాలకు చెందిన వారని పొరుగు దేశమైన నేపాల్‌కు చెందిన 43 మంది చిన్నారులను కూడా రక్షించినట్లు ఆమె తెలిపారు. కాగా వారిలో 4,567 మంది బాల కార్మికులుగా, 486 మంది వీధి బాలలుగా, 38 మంది భిక్షాటన చేస్తూ, మరో 491 మంది ఇతర పనుల్లో మగ్గుతూ గుర్తించబడ్డారని పేర్కొన్నారు. చిన్నారులతో పనులు చేయిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించామని, ఈ క్రమంలో 1,480 ఎఫ్ఐఆర్‌లును నమోదు చేసి 1,483 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె వివరించారు. అలాగే కార్మిక శాఖ ద్వారా 1,363 తనిఖీ నివేదికలు జారీ చేసి, కనీస వేతనాల చట్టం కింద నిందితులకు రూ. 41.78 లక్షల జరిమానా విధించామన్నారు.

**తల్లిదండ్రులకు అప్పగింత:**

ఆపరేషన్ స్మైల్‌లో దాదాపు 4,978 మంది చిన్నారులను వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని, ఆశ్రయం లేని 604 మందిని రక్షణ గృహాలకు తరలించినట్లు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ చారుసిన్హా తెలిపారు. అదేవిధంగా వలస కార్మికుల పిల్లల కోసం 29 అర్బన్ బ్రిడ్జ్ స్కూళ్లలో 2,375 మందిని చేర్పించామని వివరించారు. రాష్ట్రంలో బాలల అక్రమ రవాణా, వెట్టిచాకిరీని నిర్మూలించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ అంకితభావంతో శ్రమిస్తుందని ఈ సందర్భంగా చారుసిన్హా పునరుద్ఘాటించారు.

# సిట్‌తో యుద్ధం... సారు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కేసీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో సిట్ విచారణ చేయనుంది. ఇంతకాలం ఈ కేసులో ఖాకీలను ప్రశ్నించిన సిట్ ఇటీవల ఖద్దరు నేతలు హరీష్‌రావు, కేటీఆర్,నవీన్‌రావులను విచారించి వారి వాంగ్మూలాలు రికార్డు చేసింది. తాజాగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బడా నేతల మెడకు చుట్టుకుంటోంది. సిట్ దర్యాప్తులో వెలుగు చూస్తున్న కొత్తకొత్త అంశాలతో ఈ కేసు రాజకీయ ప్రముఖులకు ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసులో కీలక నిందితులు గులాబీ బాస్ ఆదేశాలను శిరసావహించామని వెల్లడించిన విషయం విదితమే. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సైతం తానూ కేసీఆర్ బాధితుడినేనని కోర్టులో అఫిడవిట్ సైతం దాఖలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి నుంచి సొంత పార్టీ నేతల వరకు ట్యాపింగ్ ఆయుధం ప్రయోగించినట్లు సిట్ సైతం కీలక ఆధారాలు సేకరించింది. ఒక దశలో ట్యాపింగ్ వ్యవహారంలో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి నేతల వరకు బాధితులున్నట్లు తేలింది. ఈ కేసులో అన్ని లింకులపై అన్ని కోణాల్లో కేసీఆర్‌ను దర్యాప్తు చేసి నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు సిట్ అధికారులు సూటి ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రూపొందించినట్లు సమాచారం.

**ఆపరేషన్ రేవంత్:**

అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డిని ఎవరెవరు కలుస్తున్నారు, మాట్లాడుతున్నాడన్న విషయాలను ఫోన్‌ట్యాపింగ్ చేయాలని కేసీఆర్ తమకు ఆదేశాలిచ్చారని ఈ కేసులో కీలక నిందితుడు ప్రణీత్‌రావు ఇచ్చిన వాంగ్మూలం కేసీఆర్ ముందుంచి ప్రశ్నించనున్నట్లు తెలియవచ్చింది. బీఆర్ఎస్ ముఖ్యనేత ఇచ్చిన ఆదేశాలతోనే అప్పటి ప్రతిపక్షనేత రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని సిట్ పోలీసులు సైతం రిపోర్టులో వివరించారు. సదరు బీఆర్ఎస్ నేత మేసేజ్ ద్వారా పంపిన నంబర్లకు సంబంధించి ఫోన్ ట్యాపింగ్, వాట్సప్ చాటింగ్‌లను ప్రణీత్ ట్యాపింగ్ చేసి సదరు నేతకు పంపిన అంశాలపై దర్యాప్తు సాగించనున్నారు. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి ఎవరెవరిని కలుస్తున్నారు? అలాగే ఆయన సోదరులను ఎవరు? ఎక్కడ కలుస్తున్నారు? అన్న సమాచారాన్ని ప్రణీత్‌రావు బీఆర్ఎస్ పెద్దలకు అందించిన వైనంపై ఆరా తీయనున్నారు. అలాగే ప్రతిపక్ష నేతలకు డబ్బులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రణీత్‌రావు చేరవేసిన విషయాలపైనా ప్రశ్నల వర్షం కురిపించనున్నారు.

**మునుగోడులో ప్రతీకారంపై:**

మునుగోడు ఉప ఎన్నికలలో బీఆర్ఎస్ నేత ప్రతీకారం తీర్చుకునే యత్నం చేశారన్న అంశాలపై సిట్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అప్పట్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన క్రమంలో మునుగోడు ఉపఎన్నికల్లో ఆయనను ఓడించాలని కేసీఆర్ భావించారని రాధాకిషన్‌రావు ఇచ్చిన వాంగ్మూలంలోని పలు అంశాలపై సిట్ విచారణ చేపట్టనుంది. దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచినందున మునుగోడులో ఎలాగైనా బీజేపీని ఓడించి ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో కేసీఆర్ ఉన్నట్టు ఫోన్ ట్యాపింగ్ కేసులోని నిందితులు సిట్ విచారణలో వెల్లడించిన విషయాలపై కేసీఆర్‌ను విచారించనున్నట్లు తెలియవచ్చింది. ఈ సమయంలోనే పైలెట్ రోహిత్‌రెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేర్చుకోవాలని అగ్రనేతలను సంప్రదించినట్టు ఫోన్ ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని, బీజేపీ చెక్ పెట్టేందుకు వారిపై సర్వైలెన్స్ పెట్టాలని ఎస్ఐబీకి అందిన ఆదేశాలపైనా విచారించే అవకాశం ఉందని సిట్ వర్గాలు చెబుతున్నాయి.

**ఎంఎల్‌ఏల కొనుగోలు:**

ఫోన్ ట్యాపింగ్ ఆయుధంతో ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను కాపాడేందుకు కేసీఆర్ తీవ్రంగా యత్నించినట్లు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో వెల్లడించిన అంశాలపై సిట్ కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించనుంది. ముఖ్యంగా ఎంఎల్ఏల కొనుగోలు కేసుపై ప్రత్యేక దర్యాప్తు వేసి బీజేపీ అగ్రనేత బీఎల్ సంతోష్‌ను అరెస్టు చేసి కవిత అరెస్ట్ కాకుండా బీజేపీ అగ్ర నేతలతో కేసీఆర్ చర్చలు జరుపుదామని భావించిన వ్యవహారంపై సిట్ విచారణ చేపట్టనుంది. ఎంఎల్ఏల కొనుగోలు కేసు ఆపరేషన్ మొత్తం బాధ్యతను సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులకు అప్పగించిన తతంగంపై సిట్ విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. బీజేపీ అగ్రనేతల ఫోన్లను ప్రణీతీరావు బృందం ట్యాప్ చేసిందని, ఆ ట్యాప్ చేసిన ఒక ఆడియో టేపును కేసీఆర్ పంపినట్టు సిట్ అనుమానిస్తోంది. అదేవిధంగా బీజేపీ నేత లందరి ఫోన్ నంబర్లను ట్రాప్ చేయాలని గులాబీ బాస్ ఆదేశించిన వైనంపై దర్యాప్తు సాగనున్నట్లు తెలుస్తోంది. వెరసి 2022 నవంబర్ లోని ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం, బీజేపీ కీలక నేతల ఫోన్లతో పాటు రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రులు నడ్డా తదితరుల ఫోన్లను ట్యాపింగ్‌పై సిట్ కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించనుంది.

**పొలిటికల్ టర్నింగ్!**

ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాల కోసం సిట్ అధికారులు వివిధ హోదాలలో ఉన్న 100 మంది పోలీసులను ఇప్పటికే ప్రశ్నించారు. ఇందులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, మాజీ ఏఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు తదితరులు ముఖ్య పాత్ర పోషించినట్లు తేల్చారు. తాజాగా అప్పటి రాష్ట్ర రాజకీయాలో పదేళ్లపాటు చక్రం తిప్పిన మాజీ ఎంఎల్సీని సిట్ పోలీసులు ప్రశ్నించి కీలక సమాచారం సేకరించారు. సదరు పోలీసులు, నేతలు ఇచ్చిన వాంగ్మూలంలో పదేపదే గులాబీ బాస్ పేరు ప్రస్తావించినట్లు సిట్ గుర్తించింది. ముఖ్యంగా 2023 ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రత్యర్థులతో పాటు రియాల్టర్ల, ప్రముఖ వ్యాపారుల ఫోన్లను ఆయన ట్యాపింగ్ చేయించినట్లు ఆరోపణలపైనా కేసీఆర్‌ను సూటిగా విచారించనున్నారు. మాజీ మంత్రి, ఓ ఎంఎల్సీ ట్యాపింగ్ యంత్రాలు సమకూర్చడంతో సహకరించారన్న అంశంపై ప్రత్యేక విచారణ చేపడుతున్నారు.

అలాగే ఫోన్ ట్యాపింగ్‌లో కేంద్ర హోంశాఖ అనుమతులు ఎంతమేరకు పాటించారు, ఎంత మేరకు ఉల్లంఘించారు అన్న కోణంలోనూ సిట్ వర్గాలు ఆరా తీయనున్నాయి.

**ఇంటి దొంగలపై:**

బీఆర్ఎస్ పార్టీలో కొందరి నేతల ఫోన్లపై ట్యాపింగ్ నిఘా ఉంచినట్లు వచ్చిన ఆరోపణలపైనా సిట్ విచారణ చేపట్టనుంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో విభేదాలున్న శంబీపూర్ రాజుపై నిఘా పెట్టామని, అలాగే జానారెడ్డి కుమారుడు రఘువీర్ రెడ్డి, వంశీకృష్ణ, కవ్వంపల్లి సత్య నారాయణల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఈ కేసులో కీలక నిందితులు వారి వాంగ్మూలంలో వెల్లడించారు. అలాగే కడియం శ్రీహరి, రాజయ్య విభేదాలపై నిఘా ఉంచినట్లు వెల్లడించారు. అలాగే పట్నం మహేందర్‌రెడ్డి దంపతుల ఫోన్లనూ ట్యాపింగ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సిట్ విచారించనుంది. అలాగే అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న, ఈటల, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ ఫోన్లతో పాటు గవర్నర్ బంగ్లా ఫోన్‌లను ట్యాప్ చేసిన వైనంపై ప్రశ్నించనున్నారు.

# 94 ఏండ్ల వయస్సులో సినిమా దర్శకత్వం

## రికార్డులకెక్కనున్న సింగీతం శ్రీనివాసరావు

**హైదరాబాద్, జనవరి 31:** వైవిధ్యంగా సినిమాలు తీయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.. ప్రయోగాత్మక చిత్రాలకే కేరాఫ్ అడ్రస్.. మాటలే లేకుండా మూవీ తీసిన సినీ రుషి. ఆయనే సింగీతం శ్రీనివాసరావు. సుదీర్ఘ విరామం తర్వాత 94ఏళ్ల వయసులో మళ్లీ మెగా ఫోన్ పట్టారు. ఆయన దర్శకత్వంలో వెజయంతీ మూవీస్ బ్యానర్‌పై కొత్త చిత్రం రూపొందుతోంది. ఇటీవల పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ మూవీని ప్రకటిస్తూ చిత్ర నిర్మాణ సంస్థ ఓ వీడియోను పంచుకుంది. ఆయన ప్రతిభా పాటవాలను గుర్తు చేసుకుంటూ హీరోలు, దర్శకులు చెప్పిన మాటలు వీడియోలో వినిపించాయి. ఇది సింగీతం శ్రీనివాసరావు 61వ సినిమా కావడం విశేషం.



# శంషాబాద్‌లో రూ.9 కోట్ల డ్రగ్స్ పట్టివేత



**హైదరాబాద్,జనవరి 31(మనం,ప్రత్యేకప్రతినిధి):** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.9.5 కోట్ల విలువైన 27 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని ఎయిర్‌పోర్ట్ అధికారులు సీజ్ చేశారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుల బ్యాగులో డ్రగ్స్ గుర్తించిన డీఆర్ఐ అధికారులు ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. కాగా శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం విదేశీ గంజాయిని డీఆర్ఐ అధికారులు పక్కా సమాచారం మేరకు పట్టుకున్నారు. వీరి నుంచి గంజాయి తీసుకునేందుకు వచ్చిన మరో ముగ్గురి అరెస్టు చేశారు.హైడ్రోపోనిక్ గంజాయి అనేది మట్టి లేకుండా ప్రత్యేక ప్రయోగశాలల్లో పెంచే గంజాయి రకమని, ద్రవరూప పోషకాలు నేరుగా మొక్కల వేళ్లకు అందిస్తారని డీఆర్ఐ అధికారులు వివరించారు. ఈ మొక్కలు కృత్రిమ ఉష్ణోగ్రత, వెలుతురు నియంత్రణతో వేగంగా పెరుగుతాయని, సాధారణ గంజాయితో పోలిస్తే మత్తు శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. కొన్ని దేశాల్లో గంజాయి సాగుపై నిషేధం లేకపోవడం వల్ల స్మగ్లింగ్ ముఠాలు దీన్ని ఆసరాగా తీసుకుని భారత్‌కు తరలిస్తున్నాయంటున్నారు. ఈ గంజాయి ధర ఒక్క కిలోకు రూ. కోటి వరకు పలుకుతోండటంతో మహిళలను క్యారియర్లుగా ఉపయోగించి గంజాయిని రవాణా చేస్తున్నారని డీఆర్ఐ అధికారులు తెలిపారు.

# ఏందిది?.. గింత చిల్లరగా చేస్తరా?



## నా గౌరవానికి భంగం కలిగించిండ్రు?
## ఇంటి గోడపై నోటీసు(లా?)లు అతికించడమా?
## చట్ట ప్రకారం నోటీసులిఇవ్వలే
## అయినా.. వస్తాను
## జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ రాశారు. విచారణకు హాజరయ్యేందుకు తనకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. నంది నగర్‌లోని తన ఇంటికి నోటీసు అంటించడం ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని ఆయన పేర్కొన్నారు. బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని అన్నారు. ఫిబ్రవరి 1 (ఆదివారం)మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధమని తెలిపారు. నందినగర్‌లో తన నివాసం గోడపై నోటీసు అతికించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని తన లేఖలో పేర్కొన్నారు. 65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దనే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. అయితే, తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని, నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చోట విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోందని అన్నారు.

ఇక, హరీశ్ రావుకు నోటీసుల విషయంలో పోలీసులు రెండు నాల్కల ధోరణి పాటిస్తున్నారని ఆ లేఖలో విమర్శించారు. పోలీసుల తీరు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని కేసీఆర్ అన్నారు. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని కేసీఆర్ స్పష్టం చేశారు. అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చని, కానీ, ఓ బాధ్యతాయుత పౌరుడిగా విచారణకు హాజరవుతానని అన్నారు. భవిష్యత్తులో నోటీసులన్నింటినీ ఎర్రవల్లిలోని తన చిరునామాకే పంపించాలని పోలీసులకు ఆయన సూచించారు. పొరుగు రాష్ట్రం ఏపీ హైకోర్టులోని 'వీడీ మూర్తి' కేసు తీర్పును లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు.

పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు వస్తారా? రారా? అన్న ఊహగానాలకు కేసీఆర్ తెర దించారు. ఇక, ఫైనల్‌గా నందినగర్ నివాసంలోనే కేసీఆర్‌ను సిట్ విచారించనుంది.

# రైలు కిందపడి ముగ్గురు ఆత్మహత్య

## మృతులు తల్లి,కూతురు,కుమారుడిగా గుర్తింపు



**హైదరాబాద్,జనవరి 31(మనం,ప్రత్యేకప్రతినిధి):** హైదరాబాద్ నగర శివారులోని చర్లపల్లిలో రైలు కిందపడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. చర్లపల్లి- ఘట్కేసర్ రైల్వే స్టేషన్ మధ్య శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై మృతదేహాలను గుర్తించిన గూడ్స్ రైలు లోకోపైలట్ సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కాగా, మృతులను బోడుప్పల్ ప్రాంతానికి చెందిన పిన్నింటి విజయశాంతి(38), కూతురు చేతన రెడ్డి, కుమారుడు విశాల్ రెడ్డిగా గుర్తించారు. చేతన ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, విశాల్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నట్లు పోలీసుల విచారణలో వెలుగుచూసింది. విజయశాంతి ఇద్దరు పిల్లలతో కలిసి బోడుప్పల్ ఉంటుండగా.. ఆమె భర్త సురేందర్ రెడ్డి నెల్లూరులో ఉంటున్నాడని పోలీసులు తెలిపారు.

విజయశాంతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా ఆమె భర్త సురేందర్ రెడ్డి నెల్లూరులోని సిరామిక్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు గల కారణాలపై వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత



**రాజన్న సిరిసిల్ల, జనవరి 31(మనం ప్రతినిధి):-** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో సుమారు 2000 మంది ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో మెగా ర్యాలీ నిర్వహించడం జరిగినది. జిల్లా రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవం జనవరి ఒకటవ తారీఖు నుండి 31 తారీకు వరకు జరిపిన కార్యక్రమాలలో చివరి రోజున పట్టణంలోని వివిధ పాఠశాల నుంచి సుమారు 2000 మంది విద్యార్థులతో బతుకమ్మ ఘాట్ నుండి పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు రోడ్డు భద్రతకు సంబంధించి ప్ల కార్డులు పట్టుకొని రోడ్డు భద్రత గురించి నినాదిస్తూ హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం వలన కలుగు ప్రాముఖ్యతలు వివరిస్తూ భారీ ర్యాలీ తీయడం జరిగింది. జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మద్యం సేవించి వాహనం నడపరాదని మొబైల్ మాట్లాడుతూ వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో నడపరాదని కారు ఇతర వాహనాలు నడిపించే వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని ఓవర్ స్పీడ్ గా వెళ్లవద్దని తెలిపారు అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఈ దేశ భవిష్యత్తు పిల్లలేదని రేపు రాబోయే తరంలో మీరంతా రోడ్డు ప్రమాదాలు జరగని రోడ్డు ఉండాలని తెలియజేస్తూ భావితరాలకు మీరే ఆదర్శం అని తెలిపారు. గత కొంతకాలంగా ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే చనిపోవడం జరుగుతుందని తెలిపారు. డి.ఎస్.పి మాట్లాడుతూ ర్యాలీ కి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి రోడ్డు మాది భవిష్యత్తు మాది అనే నినాదం ఇచ్చినట్లు అనిపించిందన్నారు. ఇలాంటి అవేర్నెస్ ప్రోగ్రాం ద్వారా అందరికీ తెలియజేసే బాధ్యత మీపై ఉంటుందని తెలిపారు.ర్యాలీ అనంతరం విద్యార్థులతో రోడ్డు పైన ఉన్న వాహనదారులతో రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తామని రవాణా శాఖ మోటార్ వాహనముల తనిఖీ అధికారి ప్రతిజ్ఞ చేపించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి రవాణా శాఖ అధికారి వి. లక్ష్మణ్ సహాయక మోటారు వాహనంల తనిఖీ అధికారి రజని,పృథ్వీరాజ్ వర్మ, సిబ్బంది రమ్య, సౌమ్య, ప్రశాంత్,ఎల్లేష్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పి చంద్రయ్య,డిఎస్పి నాగేంద్ర చారి,సీఐ కృష్ణ, పట్టణ ఎస్ఐలు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధన పాటించాలి

- **జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**



**షాద్ నగర్, జనవరి 31(మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికలలో బాగంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో సరిత తో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్క్రూటిని ప్రక్రియను పరిశించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం స్క్రూటిని ప్రక్రియ కొనసాగుతుందని ఎవరైనా నామినేషన్ ఉపసంహరించుకోవాలని అనుకుంటే 3 వ తారీకు రోజున చేసుకోవచ్చని అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటించి గుర్తులు కేటాయిస్తామని అన్నారు.రంగారెడ్డి జిల్లాలో ఆరు మున్సిపల్ కేంద్రాలు ఉన్నాయని,మొత్తం 126 వార్డులు ఉన్నాయని తెలిపారు..ఎన్నికలు నిబంధనలకు లోబడే అభ్యర్థులు తమ ప్రచారాలను కొనసాగించాలని ,ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు... ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత,ఆర్డీవో సరిత, ఎమ్మార్వో నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేకి వినతి



**రంగారెడ్డి జనవరి 31 (మనం న్యూస్):** మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి ,డివిజన్ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ,డివిజన్ కుమ్మర సంక్షేమ సంఘం నాయకులు, సంఘం పెద్దలతో కలిసి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నీ వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా కుమ్మర సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి , స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని వారు ఎమ్మెల్యే ని కోరారు.వెంటనే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి కార్యక్రమాలు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరస్వతీ నగర్ కాలనీలో ట్రంక్ లైన్ కోసం తవ్విన రోడ్లను ప్యాచ్ వర్క్ లాగా కాకుండా,పూర్తిగా వేసేలా ఆదేశించాలని డివిజన్ భారస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాలనీవాసులు నర్రి వెంకన్న,రామాచారి,రంగారెడ్డి కలిసి ఎమ్మెల్యే ని

# కుటుంబానికి పూర్తి సమయం కేటాయించాలి



**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల, జనవరి31(మనం ప్రతినిధి):** ఉద్యోగ విరమణ పొందిన చంద్ర ప్రకాశ్ తమ పూర్తి సమయాన్ని కుటుంబానికి కేటాయించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. 41 ఏండ్ల పాటు పౌర సరఫరాల శాఖలో జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా సేవలు అందించిన చంద్ర ప్రకాశ్ శనివారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, వారు అందించిన సేవలను కొనియాడారు.

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా చంద్ర ప్రకాశ్ ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వానికి సేవలు అందించారని పేర్కొన్నారు. ఇటీవల ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో తుఫాన్ వచ్చిన సమయంలో డీసీఎస్ఓ, డీఎంగా విశేష సేవలు అందించి, విజయవంతంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేశారని గుర్తు చేశారు. ఆయన శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని, పూర్తి సమయం వారి కుటుంబానికి అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జిల్లా అధికారులు రవీందర్ రెడ్డి, శ్రీనివాసాచారి, అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.



# కరాటేలో అంతర్జాతీయంగా బంగారు పథకాలు సాధించాడు

**రంగారెడ్డి జనవరి 31 (మనం న్యూస్):** విశాఖపట్నం లో కరాటే ఇండియా ఆర్గనైజేషన్ లో భాగమైన యునైటెడ్ షోటోఖాన్ కరాటే డూ ఇండియా , మహిర షోటోఖాన్ కరాటే డూ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం నందు నిర్వహించిన 9వ ఆల్ స్టైల్స్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్షిప్ 2026 నందు 4 దేశాల మార్షల్ ఆరట్స్ క్రీడాకారులు పాల్గొన్నారు . ఈ పోటీలలో నల్లగొండ జిల్లా మద్దిరాల మండలం, ముకుందాపుర గ్రామానికి చెందిన మీసాల ఎల్లేష్ ,మమత కుమారుడు

మీసాల జతీష్ కటాస్ విభాగంలో బంగారు పతకం , కుమితే విభాగంలో మరో బంగారు పతకాలను సాధించాడు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో విద్యను అభ్యసిస్తూ చిన్నప్పటి నుండి క్రీడలలో చురుగ్గా రాణిస్తూ పాల్గొన్న ప్రతి అంతర్జాతీయ పోటీలలో బంగారు పథకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావడం గర్వకారణం అని కోచ్ మాస్టర్ మహేష్ నాయక్ పలువురు కొనియాడారు .

# నాలా పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

## నాలా పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి: మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి.



**రంగారెడ్డి జనవరి 31 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ విజయపురి కాలనీలోని నాలా పనులలో నాణ్యతలో రాజీ పడకుండా, రాబోయే వర్షాకాలంలోపు పూర్తిచేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. శనివారము కాలనీవాసులు, అధికారులతో కలిసి నాలా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖ మంత్రి గా ఉన్నప్పుడు విజయపురి కాలనిలో నాలా వల్ల మురుగు నీరు, వర్షపు నీరు తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అసోసియేషన్ సభ్యులు తన దృష్టికి తీసుకురాగా 2022 సంవత్సరం లో రూ. 6 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆ కేటాయించిన నిధుల పనులను ఇప్పుడు జరుగుతున్నాయని తెలిపారు.

రాబోయే వర్షాకాలం లోపల పనులు పూర్తి చేసి కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రస్తుతం నాలా లోని సిల్ట్ ను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కంచర్ల శేఖర్, సాజిద్, శ్యాంసుందర్ గుప్తా,వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్,రహీం, లోకసాని కొండల్ రెడ్డి,రామ్ నర్సింహా గౌడ్ ,ముచింతల జగన్, రమేష్ కురుమ, దీపక్, సరూర్నగర్ సర్కిల్ డిసి శ్రీనివాస్, జిహెచ్ఎంసి సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు..



**షాద్ నగర్, జనవరి 31(మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని చటాన్ పల్లి రైల్వే గేట్ వద్ద శనివారం పోలీసులు భారీగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. షాద్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఈ తనికీలు నిర్వహించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో డబ్బులు, మద్యం తరలించకుండా ఉండేందుకు ఈ తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా వాహనాల లైసెన్సులు, ఇతరత్రా పత్రాలను తనిఖీ చెసారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# బడంగ్ పేటలో గద్దర్ జయంతి వేడుకలు



**రంగారెడ్డి జనవరి 31 (మనం న్యూస్):** కవి,అమరుడు గద్దర్ 78 వ జయంతి బడంగ్ పేట్ లో సీనియర్ జర్నలిస్ట్ చందర్, గట్టు మైపాల్, గట్టు బాల కృష్ణ, భాగ్యరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. బడంగ్ పేట్ ప్రధాన కూడ లి లో గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. . ఈ కార్యక్రమానికి గ్రేటర్ హైదరాబాద్ మాల జేఏసీ చైర్మన్ బేర బాల కిషన్ (బాలన్న) ముఖ్య అతిథిగా హాజరై గద్దర్ చిత్రటానికి పూల మాల వేసి జోహార్ లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ బానిసలారా లేండిరా, ఈ బాంచెన్ బతుకులు వద్దు రా, అంటూ పల్లె పల్లెన గద్దర్ అన్న ఆటపాట మాట ద్వారా ప్రజలను చైతన్యం చేసిన గొప్ప నాయకుడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సోర్నగంటి విజయ్, ఆంజనేయులు, ప్రమోద్, జయంత, ఇందిరా,శివ, ఇ పరమేష్, డి రాములు, శ్రీకాంత్, రాజ్ కుమార్,దానెల్, బీమ్ రాజ్, అరుణ్ ఉన్నారు.



# నేరెళ్ల శారదని మర్యాదపూర్వకంగా కలిసిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

**రంగారెడ్డి జనవరి 31 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కె పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలోని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి స్వగృహానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ళ శారదని మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్టీఆర్ నగర్ డివిజన్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు రేణుక, రామా, మాధవి, స్వరూప, మంజుల, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఓసిల హక్కుల సాధనకై చలో ఢిల్లీ

- **సన్నాహక సభ పోస్టర్ ఆవిష్కరణ**



**రంగారెడ్డి జనవరి 31 (మనం న్యూస్)** ఓసీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, ఫిబ్రవరి 23వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓసీల హక్కుల సాధనకై చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఓసీ జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త పిలుపునిచ్చారు. శనివారము హైదరాబాదులోని రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ కుల సంఘాల నాయకులతో ఓసి జెఏసి ఆధ్వర్యంలో సన్నాహక సభ , పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ గుప్త మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఫిబ్రవరి 23న జరిగే జంతర్ మంతర్ నిరసన సభకు పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఓసి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినటువంటి ఓసి జేఏసీ పక్షాన 12 డిమాండ్ల పరిష్కారానికి నిరసన కార్యక్రమాన్ని అన్ని కుల సంఘాల నాయకులతో కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓసి జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి గుప్త మాట్లాడుతూ

ఈ డబ్ల్యూ ఎస్ జాతీయ స్థాయి కమిషన్ ను ఏర్పాటు చేయాలి. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని 5 సంవత్సరాల కాలపరిమితి కలిగి ఉండాలి. ఆదాయపరిమితి 10 లక్షలు పెంచాలి. విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల వయోపరిమితి పెంచాలి. ఈడబ్ల్యూఎస్ బ్యాక్ లాగ్ పోస్టులను ఈడబ్ల్యూఎస్ వారితోనే భర్తీ చేయాలి. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఫీజు రాయితీ కల్పించాలి. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు ఈడబ్ల్యూఎస్ వర్గాలకు అమలు చేయాలి. అన్ని సామాజిక వర్గాలకు క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలి. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు అన్ని రాష్ట్రాలలో సంపూర్ణంగా అమలు చేయాలి. ప్రస్తుతం 50 శాతం పెంచకుండా ఓసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. రైతు పండించిన పంటలకు రైతే ధర నిర్ణయించేందుకు చట్టం తేవాలి. రైతులకు రైతు బీమా వయోపరిమితే 70 సంవత్సరాలు వరకు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓసి జెసి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్లు దాచేపల్లి సీతారాం, అల్లాడి వీరభద్రయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ పొద్దుటూరి వేణు, ఓసి జేఏసీ రాష్ట్ర నాయకులు రాములోని రామనాథం, పసునూరి శ్రీనివాస్, కోటగిరి మహేష్, ఏవి రావు, గుడు గుండ్ల మహేష్ గుప్తా పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

## పగ

అది ఏమైనాగాని
పగన్నది మదిలో ఒకటుంటే
పామున్న ఇంటిలో కాపురమున్నట్లే
ప్రతీకారం ఎదలో కలవరపెట్టిందా

నీ సమాధిని నువ్వు నిర్మించుకున్నట్లే!
నాకు తెలుసు
నీవెన్ని నిద్రలేని రాత్రులను
దిగమింగుతున్నావో

ఎన్ని భద్రతల మధ్య ఉన్నా
చుక్కలు లెక్కబెడుతున్న దృశ్యం
ఉదయం నీ ముఖం పట్టిస్తున్నది
ఎన్ని కలలు కన్నావో

నీ సుఖాన్ని బలిపెట్టి
నీకళ్ళకు అధికారం గంతలు కట్టి
అందరు నిన్ను ఊరేగిస్తుంటే
నీ లోపలి మనిషి ఒడ్డున పడ్డ చేప పిల్లనే!

నిన్ను ఇప్పుడెవరూ కాపాడలేరు
నీవు పెట్టిన ఆశలకు భ్రమపడ్డవాళ్ళు
ఏదో ఒక రోజున నిన్ను జనం సాక్షిగా
ఎత్తి కుదేస్తేగాని మైకం వదలదు

నోటిదురుసుతనం సాగినంతకాలమే
కాలం చూస్తూ ఉండగనే గడిచిపోతది
మాటల్ని చరిత్ర గుర్తుపెట్టుకుంటది
వినయం లేనిచోట జ్ఞానం నిలువదు!

అధికారం సంపద అంగబలం
సమూహంగా వచ్చి అట్లనే నిష్క్రమించేవి
శాశ్వతమనుకున్నావో
కాల పరీక్షకు నిలవాల్సిందే!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# పోరు బిడ్డలు సమ్మక్క సారలమ్మలు

మేడారం ఆదివాసీ యుద్ధభూమి, ఆదివాసీల పోరు గద్దె మేడారం. ఏ పురాణాలు.. ఏ చరిత్ర కొనియాడని త్యాగ మూర్తులు ఈ వీరవనితలు సమ్మక్క సారలమ్మలు. ఆదివాసీలు తమ గుండెల్లో గుడి కట్టుకొని పూజిస్తున్న వీరవనితలు. తన జాతి కోసం నమ్ముకున్న విలువల కోసం ఆదివాసీ స్వయం పాలన కోసం తమ ప్రాణాలను త్యజించి మరణం తరువాత కూడ జనం గుండెల్లో బతకవచ్చు అని నిరూపించిన పోరు వనితలు ఈ సమ్మక్క సారలమ్మలు. కాకతీయుల పాలనపై కత్తులు దూసిన ఆదివాసీలు ఈ సమ్మక్క సారలమ్మలు. పరాయి పాలన నుంచి స్వేచ్ఛయుతపాలన కోసం సమ్మక్క సారలమ్మలు పగడిద్దరాజులు కాకతీయుల సైన్యంతో పోరాడి ఆత్మత్యాగాలు చేశారు. ఇంతటి చారిత్రక సంస్కృతిక సాయుధ పోరాట చరిత్ర ఆదివాసీల మనోభావాలకు విలువ ఇవ్వలేదు. ఆదివాసీల చరిత్రను చరిత్రగా లిఖించలేదు.

పాలకులు కూడ పట్టించుకోలేదు. తెలంగాణలో ములుగు జిల్లాలో జరిగే మేడారం జాతర ప్రతి రెండెండ్లకొకసారి జరుగు తుంది. అది పోరుబిడ్డలు జాతర ఎవరూ అవునన్న కాదన్న సమ్మక్క సారాలమ్మ పగడిద్దరాజుల సంస్మరణ వేడుక. సమ్మక్క సారాలమ్మలుగా కొలవబడుతున్న ఆదివాసీ ముద్దు బిడ్డలు వారు. ఆదివాసీ తెగలో పుట్టిన ఉద్యమ దివిటీలు. సమ న్యాయం కోరుకున్న వీరవనితలు. ఆదివాసీ సంస్కృతికి సంప్రాదాయలకు దిక్సూచి ఈ జాతర. ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక మేడారం. గిరిజనేతర ఆధిపత్య సంస్కృతికి వ్యతిరేకంగా ఈ మేడారం జాతర జరుగుతుంది. ఆదివాసీ అస్థిత్వానికి ఆయుధం ఆదివాసీ ఉద్యమాలకు ఊపిరి ఈ మేడారం జాతర. ఆదివాసీ అస్థిత్వం కోసం ఆదివాసీ స్వయంపాలన కోసం కాకతీయులపై కత్తులు దూసి కదనరంగంలో అమరులైనా ఆదివాసీ ముద్దు బిడ్డలు ఈ సమ్మక్క సారక్క జంపన్న పగడిద్దరాజులు. వారిని స్మరిస్తూ ఆదివాసీ సంప్రాదాయాల ప్రకారం ప్రతిరెండు సంవత్సరాల కొకసారిమేడారం పోరునేలపై జాతర పోరునేలపై జాతర రూపంలో వారిని అతిపవిత్రంగా కొలుస్తారు.స్మరిస్తారు. ఈ జాతర మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతిరూపంగా ఉంటుంది. కాకతీయ రాజు రుద్రదేవుడురాజ్య కాంక్షతో మేడారం పై దండెత్తాడు. వీరి మధ్య జరిగిన భీకరపోరులో పగడిద్దరాజు సమ్మక్క సారాలమ్మ గోవిందరాజులు వీరమరణం చెందారు. జంపన్న సంపెంగ వాగులో దూకి చనిపోయాడు. సమ్మక్క విరోచిత పోరాటం దాటికి తట్టుకోలేని శత్రువులు వెనక నుండి బల్లెంతో పొడిచారు. తీవ్రగాయలతో శత్రువులను హతమారుస్తు మేడారానికి తూర్పు దిశగా చిలకలగుట్ట వైపు సాగుతుసమ్మక్క అదృశ్యం అయింది. సమ్మక్క జాడ తెలియదు. ఆ తరువాత చిలకలగుట్టవద్ద పసుపు కుంకుమ బరిణేలతో ప్రత్యక్ష్యమైందని



ఒక నమ్మక్కం. సమ్మక్క, సారలమ్మలు దేవతలు కారు. ఈ నేల మీద మనలాగనే రక్తమాంసాలతో జీవించిన మనుషులు. వాళ్లు ఈ జంపన్న వాగు నీళ్లు తాగారు. ఈ అడవిలో ఆకులు అలములు తిన్నారు. ఈ జంపన్నవాగు ఒడ్డున్నే కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని సైన్యంతో వీరోచితంగా పోరాడారు.

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర స్థల పురాణాన్ని (స్థల పురాణం అనేది కూడ పాలకవర్గాలు తయారు చేసే అతిశయోక్తుల, అభూత కల్పనల కథ) నిశితంగా పరిశీలిస్తే, ఈ దేశంలో భూస్వామ్య, రాచరికవర్గాలు, మైదాన ప్రాంత రాజవంశాలు ఆదివాసుల మీద సాగించిన దమనకాండలను గుర్తు చేసుకుంటే ఈ కోయబిడ్డల కథను, చరిత్రను పునర్నిర్మించవచ్చు. సమ్మక్కను, సారలమ్మను ఎట్లా చూడాలో అర్థం చేసుకోవచ్చు.

తమమీద పోరాడిన జాతులను, తాము అణగదొక్కిన జాతులను మ్యూజియంలో ప్రదర్శన వస్తువులుగా చూపడం ప్రపంచవ్యాప్తంగా అన్ని పాలక వర్గాలూ అనుసరించే నీతే. చరిత్రలో వెనక్కుపోయిన కొద్దీ ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలుగా కనబడతాయి. కాని సమీపగతంలోని వీరుల గురించి ఇట్లా ప్రవర్తించడం అంతగా సాధ్యంకాదు. అందుకే ఆ వీరులను పొగిడి, మర్యాదస్తులుగా మార్చేస్తారు. ఆ వీరులు బతికి ఉండి పోరాటాలు నడిపిన రోజులలో వారిని అణచివేసిన వాళ్లే, వారిని చంపిన వాళ్లే ఆ వీరులను కీర్తించడం మొదలు పెడతారు. భగత్‌సింగ్‌కు, అల్లూరి సీతారామరాజుకు, చివరికి శ్రీకాకుళం విప్లవోద్యమ నాయకులు సత్యం, కైలాసంలకు కూడ ఇటువంటి 'పొగడ్తలు' అందాయి.

ఈ సంస్మరణ ఏడు వందల సంవత్సరాల కిందటి సమ్మక్క, సారలమ్మల పోరాట స్ఫూర్తిది మాత్రమే కాదు. మూడు దశాబ్దాలుగా ఈ గోదావరి తీరంలోనే నిర్మాణమవుతున్న విప్లవోద్యమ యోధుల సంస్మరణ కూడ. ఆ యోధులలో మనలో నుంచే పోరాటంలో ప్రవేశించి ప్రాణత్యాగం చేసిన అడవి బిడ్డలున్నారు. ఈ నేలమీద మనిషిని మనిషి దోపిడీ చేయడానికి వీలు లేని సమాజాన్ని కలగంటూ ఆ కల కోసం ప్రాణత్యాగం చేసిన ఈ ప్రాంత కష్టజీవుల బిడ్డలున్నారు. నిజంగా తరతరాలుగా సమ్మక్కను, సారలమ్మను కొలవడంలో పీడిత ప్రజలందరమూ ఐక్యంగా ఉన్నాం. వాళ్లు పీడిత ప్రజా పోరాటయోధులు. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న వీరులను కూడా సంస్మరించుకుంటూ, ఈ సంస్మరణను వక్రీకరిస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులను ఓడిద్దాం.

ఏదో ఒక పేరుతో ఆదివాసీలను అడవినుండి వెళ్ళగొట్టలానే కుట్రలు కుతంత్రాలతో పాలకులు పొమ్మనకుండా పొగ పెడుతున్నారు. ఇక్కడజాతర విషయంలో గిరిజనేతర పార్టీలు అనేక అడ్డంకులు సృష్టిస్తూ ఆధిపత్యం చెలాయిస్తు మేడారాన్ని కబ్జా చేయాలనే కుతంత్రానికి తెర లేపుతున్నారు. మేడారానికి అంతర్జాతీయ ఖ్యాతి రానుండటంతో జాతరపై కార్పోరేట్ కన్ను పడింది. అసలు మేడారం జాతర నేపథ్యాన్ని సమ్మక్క స్వయం పాలన సాయుధపోరాట చరిత్రను పుస్తక రూపంలో పాఠ్యాంశంగా పెట్టాల్సిన అవసరం ఉందని ఆదివాసీ మేధావులు అంటున్నారు. మరీ ముఖ్యంగా వీరనారీమణుల్ని దేవతలుగా ప్రచారం చేయడంతో ప్రజల్ని అంధవిశ్వాసాల్లో ముంచి ఎదగకుండా చేస్తోంది. అది చాలా ప్రమాదం!

కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్రుడిపై సమరం సాగించిన సమ్మక్క రాణి సారలక్క రాణి, మేడరాజుల చరిత్రని అంతం చేసి వారిని కేవలం దేవతలుగా, దేవుళ్లుగా, ఉత్సవ విగ్రహాలుగా బెల్లంసారా,కల్లు, కోళ్ళు,యాటల్ని సమర్పించుకొనే, ముడుపులు ఇచ్చుకొనే దేవతలుగా మార్చి జాతర చేసుకొనేటట్లు చేసి ఆదివాసుల చరిత్రను పాతరేసారు.

ఆదివాసులు తమ స్వయం పాలన సాయుధ పోరాట చరిత్రనూ తెలుసుకోవాలి. కాకతీయ రాజుల వారసుల్ని ఓడించటం - తిరిగి తమ ఆదివాసీ స్వయం పాలనను స్థాపించుకోవటం అదే తమ స్వధర్మ యుద్ధం కావాలి నేడు. అప్పుడు మాత్రమే ఈ మేడారం జాతరలో సమ్మక్క సారలమ్మ రాణిల సమర గాథను అక్షరబద్ధం చేసి, దానిని రాతిశాసనాలపై చెక్కించటం సాధ్యమవుతుంది. అది చరిత్రగా ఈ భూమి ఉన్నంత కాలం ఉంటుంది. మనం రాసుకునేంత వరకు ఈ పాలకులు మన చరిత్రను శాసనబద్ధం చేయరు. ఆదివాసీలు ఆధిపత్య సంస్కృతులను సవాల్ చేస్తు ప్రత్యామ్నాయ సంస్కృతులన రూపొందించుకునే క్రమానికి స్థానిక ఆదివాసీ సమాజం ఎదిగింది. అందుకే ప్రకృతికి తప్ప మరో మనిషి ముందు సాగిలపడే సంస్కృతి ఆదివాసీ సమాజంలో లేదు. పాలకులవర్గాలు పెత్తనం పెరిగిపోతే సమ్మక్క సారలమ్మలు కోయజాతికి దూరం అవుతారు. సమ్మక్క సారలమ్మలను హిందు దేవతలుగా గుర్తించే కుట్ర జరుగుతుంది. ఆదివాసీలు ఎంతతో భక్తిశ్రద్ధలతో జరిపే మేడారం జాతరను కబ్జా చేయాలని లంబాడీలు గిరిజనేతర శక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఆదివాసీలు రిజర్వేషన్‌లో పాటుగా ఆదివాసీల సంస్కృతిని సైతం కబలించాలనే కుట్రలకు తెర లేపుతున్నారు. కాకతీయులపై కత్తులు దూసి కదన రంగంలో అమరులైనా సమ్మక్క సారలమ్మ విప్లవ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని గిరిజనేతర సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి మేడారం జాతరను కాపాడుకోవాలి. మేడారం జాతరపై పాలకుల ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలి.

**- వూకె రామకృష్ణ దొర**
9866073866

# ఈ సారైనా బడ్జెట్ మేలు చేస్తుందా?



ఇల్లు కడితే పునాది గట్టిగా ఉండాలి అంటారు. దేశాన్ని నడిపే ఆర్థిక పునాది బడ్జెట్. కానీ నేటి బడ్జెట్లు పునాదులు బలమైన నిర్మాణం కోసం కాకుండా పై అంతస్తులు అలంకరించడమే లక్ష్యంగా మారాయి. కేంద్ర బడ్జెట్ అనేది కేవలం ఆదాయ వ్యయాల లెక్కల సమాహారం కాదు. అది ఒక దేశం తన ప్రజల పట్ల చూపించే నిబద్ధతకు అద్దం. ఒక ప్రభుత్వం ఏ వర్గాన్ని, ఏ రంగాన్ని కేంద్రంగా పెట్టుకుని పాలన చేస్తోందో, ఏ సమస్యలను జాతీయ ప్రాధాన్యంగా భావిస్తోందో, ఏ బాధలను నిర్లక్ష్యం చేస్తోందో బడ్జెట్ పేజీలలో స్పష్టంగా కనిపిస్తుంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌పై దేశవ్యాప్తంగా అంచనాలు పెరిగాయి. దేశం ప్రస్తుతం ఉన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభాల సమాహారం. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ఆరోగ్య విద్య రంగాల పతనం, రాష్ట్రాల ఆర్థిక స్వాయత్తతపై దాడులు ఇవన్నీ బడ్జెట్కి ముందు ప్రజల మనసులో తిరిగే ప్రశ్నలు. కేంద్ర బడ్జెట్ 2026-27పై దేశమంతా దృష్టి పెట్టడానికి కారణం ఇది ఆర్థిక ప్రకటన కాదు బాధల్లో ఉన్న ప్రజలకు బడ్జెట్ సంఖ్యలు ఓదార్పునిస్తాయి. కానీ ఆ సంఖ్యల వెనుక ప్రజల కన్నీళ్లు కనిపించకపోతే అది ఆర్థిక పాలన కాదు అది లెక్కల దౌర్జన్యం.

2025-26 కేంద్ర బడ్జెట్‌ను ప్రభుత్వం వికసిత భారత్‌గా ప్రచారం చేసింది. మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఎకానమీ, రైల్వేలు, రహదారులు, రక్షణ రంగం వంటి అంశాలపై భారీ కేటాయింపులు చేశామని చెప్పుకుంది.

ఆ బడ్జెట్ ప్రజల జీవి తాల్లో ఎంత మార్పు తీసుకొచ్చింది? నిరుద్యోగ యువతకు ఎంత మంది ఉద్యోగాలు వచ్చాయి? రైతుల ఆదాయం ఎంత పెరిగింది?చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎంత బలపడ్డాయి? ఈ ప్రశ్న లకు సమాధానాలు




ఆశించిన స్థాయిలో లేవు. జీడిపి వృద్ధి శాతం చెప్పుకునే ప్రభుత్వానికి, ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న వాస్తవం చూసాం. ప్రభుత్వం ప్రతి వేదికపై భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. భారత్ ప్రపంచంలో వేగంగా అభి వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని చెపుతుంది. స్టాక్ మార్కెట్ బలంగా ఉంది. కార్పొరేట్ లాభాలు బలంగా ఉన్నాయి.

కొద్ది మంది సంపద బలంగా ఉంది. గ్రామీణ భారతం కొనుగోలు శక్తి తగ్గింది. మధ్య తరగతి ఈఎంఐ ల మధ్య నలిగిపోతోంది. 2025-26లో ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉందని అధికారిక గణాంకాలు చెప్పినప్పటికి. వంటనూనె, బియ్యం, పప్పులు, కూరగాయలు, పాల ఉత్పత్తులు అన్నీ సామాన్యుడికి అందని ధరలకు చేరాయి. బడ్జెట్‌లో సబ్సిడీల తగ్గింపు, ఇంధన పన్నులపై స్పష్టత లేకపోవడం ద్రవ్యో ల్బణాన్ని మరింత పెంచింది. 2026-27 బడ్జె ట్‌పై ప్రజల ఆశ కనీసం నిత్యావసరాలపై పన్నుల భారం తగ్గించాలి. కానీ ప్రభుత్వం ఆదాయ లోటును పూడ్చుకోవడానికి పరోక్ష పన్నుల మీదే ఆధారపడితే, ఈ ఆశ నెరవేరే అవకాశం ఎంత? ఉద్యోగ కల్పన అనే పదం అనేకసార్లు వినిపిం చింది. స్టార్టప్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్, ముద్ర రుణాలు వంటి పథకాలు ప్రస్తావించబడ్డాయి.

వాస్తవంగా ప్రభుత్వ రంగ నియామకాలు తగ్గాయి. భద్రత లేని కాంట్రాక్ట్ విధానం, ప్రైవేట్ రంగంలో అస్థిర ఉద్యోగాలు పెరిగాయి. రైతు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అంటూనే 2025-26 బడ్జెట్లో వ్యవసాయానికి పెద్దగా ఒరిగిందేమి లేదు. ఎరువుల కొరత మరియు ధరలు పెరిగాయి. రైతు ఆదాయం రెట్టింపు అనే లక్ష్యం మాటలకే పరిమితమై కార్పొరేట్ అనుకూల విధానాల మధ్య రైతు నిలువలేకపోతున్నాడు.గత బడ్జెట్లో ఆదాయపు పన్ను స్లాబ్‌లపై కొంత సడలింపు ఇచ్చినట్టు ప్రభుత్వం చెప్పుకుంది. కానీ పెరిగిన GST, ఇంధన పన్నులు, విద్య ఆరోగ్య ఖర్చులు మధ్యతరగతి మీద భారంగా మారాయి. పన్ను చెల్లింపుదారుడిగా మధ్యతరగతి ప్రభుత్వానికి అవసరం. కానీ సంక్షేమ పథకాల ఫలితాల్లో మాత్రం ఈ వర్గం ఎప్పుడూ పక్కకు నెట్టబడుతుంది. గత బడ్జెట్‌లో విద్య ఆరోగ్య రంగాలకు కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవు. ప్రభుత్వ పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు నిధుల కొరతతో నలిగిపోతున్నాయి.

ప్రైవేటీకరణ వేగంగా సాగుతోంది. సంపాదించే సగం మొత్తం కార్పొరేట్ అస్పత్రులకే ఆరోగ్యం కొరకు చెల్లిస్తున్న ప్రజలను దృష్టిలో పెట్టుకొని 2026-27 బడ్జెనైనా విద్య, ఆరోగ్యాన్ని మౌలిక హక్కుగా చూసి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలి. గత బడ్జెట్లో కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే వాటా, జీఎస్టీ పరిహారం అంశాల్లో అస్పష్టత కనిపించింది. కేంద్రం ఆర్థిక అధికారా లను కేంద్రీకరిస్తోంది అనే విమర్శలు పెరిగాయి. కాబట్టి ఈ ఆర్థిక బడ్జెట్ ఎలా ఉండబోతుందోనని రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయి.గత బడ్జెట్లో పెట్టుబడులు వస్తాయని కార్పొరేట్ పన్నులపై సడలింపులు కొనసాగాయి. కానీ ఆ పెట్టుబడులు అనుకున్నంత ఉద్యోగాలు సృష్టించలేదు? కాబట్టి కార్పొరేట్ పన్నుల రాయితీలే కాక అట్టడుగు, మధ్యతరగతి ప్రజల అవసరతలను గుర్తించాలి. ప్రజలు బడ్జెట్ను తమ జీవితం మెరుగుపడే సాధనంగా చూస్తారు. కాబట్టి పాలకులు ఏనుగుకు ఆహారం, చీమకు ఉపవాసం అన్నట్లు రాజకీయ వ్యూహంగా చూడకుండా 2026-27 బడ్జెట్లో మధ్యతరగతి కి అనుకూలంగా, వేతన జీవులకు పన్ను పరిమితులు పెంచి, జీవన వ్యయాలకు తగ్గట్టుగా ప్రజల వాస్తవ అవసరాలను గుర్తిం చేదిగా, సామాజిక న్యాయాన్ని కేంద్రంగా చేసుకొని బడ్జెట్ కేటాయింపులు ఉంటే ప్రజల మన్ననలు పొంది చరిత్రలో నిలిచేదిగా ఉండాలని కోరు కుందాం.

**- దుప్పటి. మొగిలి**
8466827118

# ..వారికి సింహస్వప్నం 'రాయ్'



'మీ మీద, మీ సామర్థ్యం మీద నమ్మకం ఉంచండి. సమాజంలో మార్పు తెచ్చే సత్తా మీలో ఉంది. అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించండి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ సంక్షేమం కోసం పాటుపడండి' అని ఒక పెద్దాయన స్వాతంత్ర్య సమరంలో అప్పటి ప్రజలకు పిలుపునిచ్చారు. 'నాపై పడిన ప్రతి దెబ్బ బ్రిటిష్ సామ్రాజ్యవాద శవపేటికలో ఒక్కో మేకు వంటిది. నేను జీవించి ఉంటానో లేదో తెలియదు కానీ, నా తర్వాత నా ఆత్మ స్వేచ్ఛ కోసం మరిన్ని త్యాగాలు చేయమని మిమ్మల్ని ప్రోత్సహిస్తూనే ఉంటుంది' అని అన్నారు. జాతీయవాద భావానికి తనదైన ముద్రను, కొత్త అర్థాన్ని ఇచ్చి జాతీయోద్యమాన్ని మలుపు తిప్పారు. 'దేశభక్తి అంటే స్వేచ్ఛ, న్యాయం పట్ల అపారమైన ప్రేమ, ఆత్మగౌరవం కలిగి ఉండటమే' అని ఆయన చాటిచెప్పారు. ఆయనే అతివాద ఉద్యమానికి ఊపిరి పోయడానికి తమ ప్రాణాలనే బలిపెట్టిన 'లాల్-బాల్-పాల్' త్రయంలో ఒకరైన లాలా లాజపతిరాయ్.

లాలా లాజపతిరాయ్ 1865 జనవరి 28న పంజాబ్‌లోని 'ధుడికే' గ్రామంలో రాధా కిషన్, గులాబ్ దేవి దంపతులకు జన్మించారు. పాఠశాల స్థాయి నుంచే చదవడం, రాయడం, ప్రసంగించడంపై మక్కువ పెంచుకున్నారు. పాఠ్యేతర అంశాల్లో ఆసక్తి చూపుతూ చిన్ననాడే నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు.

1886లో హిసార్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, చురామణితో కలిసి హిసార్ బార్ కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఆర్యసమాజ్ జిల్లా శాఖను కూడా స్థాపించారు. భారతదేశ రాజకీయ విధానాన్ని రూపొందించడానికి జర్నలిజాన్ని ఒక సాధనంగా ఎంచుకున్నారు. 'ది ట్రిబ్యూన్'తో సహా అనేక పత్రికలకు రెగ్యులర్ కంట్రిబ్యూటర్‌గా ఉండేవారు. 1905లో కాంగ్రెస్ కమిటీ ఆయన అంకితభావాన్ని గుర్తించి, భారత ప్రజల రాజకీయ సమస్యలను బ్రిటిష్ వారి ముందు ఉంచేందుకు ప్రతినిధిగా ఎంపిక చేసింది. గోపాలకృష్ణ గోఖలేతో కలిసి ఇంగ్లాండ్‌లో రాజకీయ ప్రచారం నిర్వహించి, అప్పటి నిరంకుశ ప్రభుత్వ దురాచారాలను బ్రిటిషర్ల దృష్టికి తీసుకువెళ్లారు.

1920 కలకత్తా ప్రత్యేక సెషన్‌లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కుల వ్యవస్థ, స్త్రీల స్థితిగతులు, అంటరానితనం వంటి అంశాలపై హిందూ సమాజం అంతర్గత పోరాటం చేయాలని ఆకాంక్షించారు. కుల, లింగ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ వేదాలను చదవాలని విశ్వసించారు.

జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తర్వాత బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ తీర్మానాన్ని ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ ఆమోదించింది. 1921లో అరెస్టయి ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించారు. రాయ్ రాజకీయ వేత్త, సామాజిక కార్యకర్త, రచయిత, పరోపకారి. 1896, 1899-1900 కరువులు, 1905 భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు అలుపెరగని సేవ చేశారు. అణగారిన వర్గాల కోసం, అనాథ పిల్లల కోసం నిధులను సేకరించి పాఠశాలలు, అనాథాశ్రమాలు నిర్మించారు. సంఘసంస్కర్తగా అంటరానితనం నిర్మూలనకు ఆర్యసమాజ్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇచ్చారు. గాంధీజీ స్థాపించిన 'హరిజన సేవక్ సంఘ్'లో చేరి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. రచయితగా మజ్జినీ, గరీబాల్డి, శివాజీ, స్వామి దయానంద్ వంటి వారి జీవిత చరిత్రలను రాసి ముద్రించారు. పంజాబ్‌ప్రజలలోఅమితమైన ఆదరణ పొందారు. ఇది గిట్టని బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను విప్లవకారుడిగా ముద్ర వేసింది. అహింసా యు త నిరసన ప్రదర్శనకు రాయ్ నాయకత్వం వహించారు. పోలీస్ అధికారి జేమ్స్ స్కాట్ స్వయంగా రాయ్‌పై దాడి చేశారు. ఆ గాయాల నుండి కోలుకోలేక 1928 నవంబర్ 17న పరమపదించారు.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# సూరజ్‌కుండ్‌లో అంతర్జాతీయ హస్తకళల ప్రదర్శన



1987లో ఘనంగా ప్రారంభమైన భారత హస్తకళల ప్రదర్శన మేళా నేడు 39వ పర్యాయం 31 జనవరి నుంచి 15 ఫిబ్రవరి 2026 వరకు ఒక పక్షం పాటు పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాదు సమీపాల సూరజ్‌కుండ్ ప్రాంతంలో ప్రతి ఏట ఫిబ్రవరిలో నిర్వహించే పక్షకాలపు అంతర్జాతీయ స్థాయి క్రాఫ్ట్స్ మేళాలో వైవిధ్యభరిత భారతీయ ప్రజలతో పాటు 45 - 50 దేశాల హస్తకళలు, కళాకారులు, అధికారులు పాల్గొనడంతో పాటు 15 రోజుల పాటు మిలియన్ల కొద్దీ ప్రజలు పాల్గొని తమ నైపుణ్యాలకు తగు గుర్తింపును, కళారూపాల అమ్మకాలు జరుగుతాయి. ఈ మేళాలో హస్తకళల వస్తు ప్రదర్శనలతో పాటుగా వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన కళాకారులుతో కలిసి అంతర్జాతీయ కళాకారులు కూడా తమ తమ సాంప్రదాయ సాంస్కృతిక కళలను భారీ వేదికల మీదుగా ప్రదర్శించడం, వివిధ రకాల వంటలను పరిచయం చేయడం, వినోద కార్యక్రమాలు, సాహసక్రీడలు, నవ్య వాహన అనుభవాలు చూపరులను ఆకర్షిస్తూ పెద్ద ఎత్తున పలు కార్సక్రమాలు కొనసాగుతాయి.

**భారతీయ హస్త కళారూపాల ప్రదర్శన**

నేటి ఆధునిక డిజిటన్ యుగంలో చవకగా వస్త్రాలను యంత్రాల సహాయంతో తయారు చేస్తూ మార్కెట్లోకి విసురుతున్న వేళ సాంప్రదాయ హస్తకళాకారులు తయారు చేస్తున్న వస్తువులకు గిరాకీ తగ్గడంతో భారతీయ హస్తకళాకారుల కుటుంబాలు ఆకలి కేకలతో అలవటిస్తున్నాయి. దీనికి ఒక విరుగుడు ప్రయత్నంగా గ్రామీణ సంప్రదాయ కళారూపాలు, హస్తకళల అందమైన వస్తువులను బయటి ప్రపంచానికి పరిచయం చేయడం, విక్రయాలు జరగడంతో మధ్యవర్తులు



లేకుండా నేరుగా హస్తకళాకారులకు ఆర్థిక లబ్ధి జరిగే విధంగా సూరజ్‌కుండ్ మేళా నిర్వహించడం జరుగుతుంది. దాదాపు 50 ఎకరాల సువిశాల ప్రాంగణంలో వెయ్యికి పైగా దుకాణాలు లేదా స్టాల్స్‌తో ఏర్పాటు చేస్తున్న సూరజ్‌కుండ్ హస్తకళల మేళాలో వస్త్రాలు, పేయింటింగ్స్, కర్ర వస్తువులు, మట్టి పాత్రలు లేదా కళారూపాలు, శిల్ప కళారూపాలు, వెదురుతో చేసిన వస్తువులు లాంటి మరెన్నో వస్తువుల ప్రదర్శనలకు వేదిక కానుంది ఈ సూరజ్‌కుండ్.

**సూరజ్‌కుండ్ మేళా-2026 విశేషాలు**

సూరజ్‌కుండ్ మేళా అథారిటీ, హర్యానా రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వ టూరిజమ్, టెక్స్‌టైల్స్, కల్చర్, విదేశాంగ మంత్రిత్వశాఖల సౌజన్యంతో నిర్వహించే సూరజ్‌కుండ్ అంతర్జాతీయ క్రాఫ్ట్స్ మేళా - 2026లో యూపీ, మేఘాలయా రాష్ట్రాల ఇతివృత్తాలతో తోపుల ఉత్పత్తులు, కళాకారుల కేంద్ర బిందువుగా సాంస్కృతిక, హస్తకళల, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ ప్రదర్శనశాలను సందర్శించిన వారికి అరుదైన హస్తకళల వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, పేయింటింగ్స్ లాంటివి తిలకించడం, కొనడం, కళాకారులతో మాట్లాడడం, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించడం, హస్త కళాకారుల నైపుణ్యాలను నేరుగా చూడడం కొనసాగుతుంది. 2026 సూరజ్‌కుండ్ మేళాను పర్యావరణహిత ఏర్పాట్లతో చురుకుగా జరిగాయి.

వ్యర్థాలను తగ్గించడం, హరితసంచుల వాడకం, శుభ్రత పాటించడం, పర్యావరణ సుస్థిర విధానాలను అవలంబించడం కూడా జరుగుతూ కార్బన్ ఉద్గారాలను పూర్తిగా తగ్గించేలా ప్రయత్నాలు చేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన సువిశాల భారతంలో దాగిన హస్తకళాకారులను ప్రోత్సహించడానికి సూరజ్‌కుండ్ మేళాకు హాజరై వివిధ కళా రూపాలను కొని, పేద కళాకారులను ఆదుకుందాం, వారి ముఖాల్లో ఆనంద తాండవాలను చూద్దాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# పార్టీ నిర్ణయం మేరకు అందరూ నడుచుకోవాలి

- పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే ఎంతటి వారైనా సహించేది లేదు
- కొత్త,పాత అనే తేడా లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలి
- జగిత్యాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి
- టిపిసిసి ఉపాధ్యక్షుడు బల్మూరి వెంకట్

**జగిత్యాల జనవరి 31( మనం ప్రతినిధి ):** పార్టీ నిర్ణయాల మేరకే అందరూ నడుచుకోవాలని పార్టీ లైన్ తప్పితే ఎంతటి సీనియర్ అయినా పార్టీ ఉపేక్షించదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బల్మూరి వెంకట్ అన్నారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మధ్య ఏర్పడ్డ అంతర్గత విభేదాల నేపథ్యంలో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఆద్వర్యం లో మోతే రోడ్డు పార్టీ కార్యాలయం లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నిర్ణయాల మేరకు అందరూ నడుచుకోవాల్సిందేనని సూచించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ కష్ట కాలంలో హుజురాబాద్ ఎమ్మెల్యేగా నేను పోటీ చేశానని, ఆ రోజే నేను బలి పశువును అవుతానని తెలిసి కూడా పోటీలో ఉన్నానన్నారు. పార్టీ కోసం బలి కావడం కూడా నేను అదృష్టంగానే భావించానని, ఆ రోజు పార్టీ పక్షాన నిలబడి కొట్లాటడం వల్లే నన్ను ఎమ్మెల్సీ పదవి వరించిందన్నారు. పార్టీలో అందరికీ ఒకేసారి అవకాశాలు రాకపోవచ్చని, అంతమాత్రాన నిరుత్సాహానికి గురికా వద్దన్నారు. పార్టీ నిర్ణయం తీసుకోనంతవరకు మనం ఏదైనా చెప్పవచ్చని, ఒకసారి పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత పార్టీ లైన్ మేరకే నడుచుకోవాలి తప్పా వ్యతిరేకంగా పోతామంటే కుదరదని అన్నారు. ఒక్కోసారి పార్టీ నిర్ణయం నచ్చకపోతే ఆ విషయంలో నాలుగు గోడల మధ్య మాట్లాడాలి తప్పా, బయటకొచ్చి ఏది పడితే అది మాట్లాడరాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల పైచిలుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారని, వారి భవిష్యత్తు గురించి పార్టీ ఆలోచిస్తుందన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల జనం మన వైపు



చూస్తున్నారని, ఈ నేపథ్యంలో ఒకరిద్దరు వ్యక్తులు పార్టీకి మేమే పెద్ద అని చెప్పుకుంటూ పార్టీకి నష్టం కలిగిస్తామంటే పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు. పార్టీలోకి వచ్చిన కొత్తవారు, పాతవారు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగి పార్టీని మరింత పటిష్టం చేయాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగించేలా తమ దగ్గరివాడని ఇండిపెండెంట్ గా లేక మరే విధంగానైనా ప్రోత్సహిస్తే ఎట్టి పరిస్థితుల్లో వారిని ఉపేక్షించేది లేదన్నారు. వారి వెనుక ఎంత పెద్ద వాళ్ళు ఉన్న చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక సారి సల పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత వ్యక్తి నచ్చనట్లయితే ఆ వ్యక్తి పేరు చెప్పకున్నా పర్వాలేదు కానీ మన గుర్తు చెప్పి ఓటు వేయించాలని కోరారు. జగిత్యాల లో ఏర్పడ్డ అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు ఇటు సంజయ్ కుమార్ తో అటు జీవన్ రెడ్డితో మాట్లాడాలని పార్టీ నాపై బాధ్యత పెట్టిందని వివరించారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలన్నదే మన అందరి అభిమతమని, ఆ దిశగా అందరు కృషి చేయాలని అన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య కొట్లాటను రెండు ప్రాంతాల మధ్య కొట్లాటగా విభజించి పాలించే ప్రయత్నం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం పడుతుందన్నారు. మీడియా చూపే ఒకటి రెండు విషయాలు చూడటానికి బాగుంటుంది కానీ, దానివల్ల ఆ తర్వాత ఎంతో నష్టం ఉంటుందన్నారు. అలాంటప్పుడు ఆ వ్యక్తికి ఆ నష్టాన్ని భర్తీ చేసే పరిస్థితి కూడా ఉండకపోవచ్చన్నారు. ఇద్దరి మధ్య అంతరం ఉన్నప్పుడు ఒకరి మాటలు ఒకరికి చెప్పకుండా వారిద్దరిని కలిపే ప్రయత్నం కార్యకర్తలే చేయాలన్నారు. పార్టీకి నష్టం జరిగితే నష్టపోయేది కార్యకర్తలేనని, మన కళ్ళను మనమే పొడుచుకోవద్దని, కత్తితో మన గొంతును మనమే కోసుకునే ప్రయత్నం చేయవద్దన్నారు. పట్టణంలోని అన్ని వార్డులను మనమే గెలుచుకొని మునిసిపల్ చైర్మన్ పీఠంపై మన వ్యక్తిని కూర్చోబెట్టుకుందామని పిలుపునిచ్చారు. జగిత్యాల అంటే కాంగ్రెస్ అడ్డా అని మరోసారి నిరూపించుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మొదటి నుంచి కాంగ్రెస్ తో అనుబంధం ఉందని అన్నారు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఎదురవుతాయని వాటిని అధిగమించేందుకు కృషి చేయాలి తప్పా పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడవద్దన్నారు. ఏది ఏమైనా పార్టీయే సుప్రీమ్ అని, ఎంత సీనియర్ అయినా, జూనియర్ అయినా పార్టీ నిర్ణయం మేరకే నడుచుకోవాలన్నారు. పార్టీ తీర్పే అంతిమ తీర్పు అని, ఆ తీర్పును అందరూ శిరసావహించాల్సిందేనని చెప్పారు. పడవలో ఒక పక్క కూర్చుని మరో పక్క రాయితో కొట్టి ముంచాలని చూస్తే ముందు ఆపక్క మునిగి ఆ తర్వాత మన పక్క కూడా పడవ మునిగి పోతుందనే సత్యాన్ని గ్రహించాలని అన్నారు. పార్టీకి నష్టం చేయాలని ఎవరైనా చూస్తే నాలాంటి కార్యకర్తలు ఊరుకోరన్నారు. ఎక్కడ ఎవరు గెలిచే అవకాశం ఉంటే అక్కడ వారిని నిలబెట్టాలని, అవకాశం రానివారికి నామినేటెడ్ లో అవకాశం కల్పించాలన్నారు. కార్యకర్తలంతా ఒక్కటిగా ఉండాలని, లేకుంటే రేపు నష్టపోయేది మనమేనని వెంకట్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గట్టు సతీష్ మాజీ లైబ్రరీ ఛైర్మన్ డా.చంద్ర శేఖర్ గౌడ్ మాజీ ఏ ఎమ్ ఓ ఛైర్మెన్ కొలుగురి దామోదర్ రావు, సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్,బాలే శంకర్,క్యాదసు నాగయ్యా,చెట్పల్లి సుధాకర్,అబ్దుల్ ఖాదర్ ముజాహిద్,పట్టణ ముఖ్య నాయకులు,యూత్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్

- మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్

**జగిత్యాల, జనవరి 31( మనం ప్రతినిధి ):** హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రివిజన్ శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుండి ఖచ్చితమైన వివరాలు సేకరించాలని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఫీల్ విజిట్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను నిర్ధారించి, శాతం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లు ను వెంటనే నియమించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు, తప్పు లింకింగ్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల



సౌలభ్యం కొరకు బుక్ ఎ కాల్ (Book a Call) సదుపాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకమని, అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 69. 94 శాతం జరిగిందని తెలిపారు.

100 శాతం పూర్తయ్యేలా అధికారులందరు సమన్వయం తో పని చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ ను మరింత వేగవంతం చేస్తూ అలాగే మ్యాపింగ్ లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, తప్పు ఎంట్రీ లు జరగకుండా ప్రతి ఓటరు మ్యాప్ అయ్యేవిధంగా ప్రతి ఇంటినుండి ఖచ్చితమైన మరియు నిర్దిష్టమైన వివరాలు సేకరించేలా అన్ని స్థాయి ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్. లత, జగిత్యాల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, శ్రీనివాస్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు హకీమ్, తహసీల్దార్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# శతాధిక వృద్ధురాలు కడవేర్ల వీరమ్మ మృతి

**ఎలిగేడు, జనవరి 31 (మనం న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్ మండలంలోని సుల్తానాపూర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కడవేర్ల వీరమ్మ (107) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వీరమ్మ శుక్రవారం రాత్రి ఆమే స్వగృహంలో కన్నుమూశారు. వీరమ్మ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. 107 సంవత్సరాలు జీవించిన వీరమ్మకు దాదాపు వంద మందికి పైగా మనుమళ్లు, మనుమరాళ్లు, ముని మనుమళ్లు, ముని మనుమరాళ్లు, కుటుంబసభ్యులతో కలిపి వీరమ్మ కు బలగం ఉంది. ఈ సందర్భంగా ఆమె కుమారులు కడవేర్ల వెంకటయ్య, కడవేర్ల వైకుంటం, అల్లుడు పర్శ శంకరయ్య, మనుమళ్లు కడవేర్ల రవీందర్ , కడవేర్ల లింగమూర్తి, రామ్మూర్తి, శంకర్ , సతీష్, శ్రీనివాస్, కామని సురేష్, ఆడెపు శంకర్, సామల రాజేంద్ర ప్రసాద్ , ఇప్పకాయల చంద్రమౌళి, సిరిపురం రాఘవులు, గున్నాల కనకయ్య లతో పాటు పలువురు కుటుంబ



సభ్యులు వీరమ్మ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సమ్మక్క-సారక్క అమ్మవార్లు ఆశీర్వాదం ఇవ్వాలి

- నియతృత్వ రాక్షస పాలనకు రామగుండం ప్రజలు చరమగీతం పాడాలి
- సకల జనులను అమ్మవార్లు చల్లగా చూడాలి
- రామగుండం కార్పోరేషన్ మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురాలి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**గోదావరిఖని, జనవరి 31 (మనం న్యూస్):** వన దేవతల పోరాట స్పూర్తితోనే కేసిఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని, యావత్తూ తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతరలో మాజీ ఎమ్మెల్యే శనివారం అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతర కమిటి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... తొలి సిఎం కేసీఆర్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా వర్ధిలారన్నారు. రెండేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప చేసిందేమి లేదని, అబద్ధపు హామిలిచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ కే దక్కుతుందన్నారు. రామగుండం నియోజకవర్గంలో రాక్షస పాలన సాగుతోందని, అభివృద్ధి సాకుతో విధ్వంసం సృష్టించారని, చిరు వ్యాపారులు దుకాణాలు కుల్చి వారి జీవితాలను రోడ్డుపై పడేశారన్నారు. రెండు సంవత్సరాల కాలంగా అభివృద్ధి సాకుతో కుల్చవేతలు కమీషన్ల కోసం పాలకులు పనిచేస్తున్నరని ఇక్కడ జరిగిన అభివృద్ధి శున్యం అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల కష్టాలు ఇబ్బందులు తొలగాంటే ఇక్కడ బిఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠం గెలువాల్సిన అవసరం ఉందన్నారు. కార్పోరేషన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు గెలిపించి దుర్మారపు పాలనకు చరమగీతం పాడాలన్నారు. రామగుండం నియోజకవర్గంలోని సకల జనులందరికి సమ్మక్క సారలమ్మ అమ్మవార్ల ఆశీస్సులుండాలనీ ప్రజలందరు సుఖ సంతోషాలతో వర్ధిలాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కూడా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జంతు సంక్షేమ పక్షోత్సవం వేడుకలు

**జగిత్యాల జనవరి 31( మనం ప్రతినిధి):** జంతు సంక్షేమ పక్షోత్సవం కార్యక్రమం లో భాగంగా స్కేఖి పాఠశాల పురానిపేట జగిత్యాల లో జరిగిన కార్యక్రమం అదనపు కలెక్టర్ రెవెన్యూ బి. ఎస్. లత గారు మరియు జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రకాష్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 14 నుండి జనవరి 31 వరకు జంతు సంక్షేమ పక్షోత్సవం ను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ బి. ఎస్.లత మాట్లాడుతూ ఈ పక్షోత్సవం ప్రధాన లక్ష్యం జంతువుల పట్ల మానవీయ దృక్పథాన్ని పెంపొందించడం, జంతు సంక్షేమం, ఆరోగ్యం, సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం అని ఈ కార్యక్రంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశువులకు తగిన ఆహారం, నీరు, నివాసం కల్పించడం, వ్యాధుల నివారణ, టీకాల ప్రాధాన్యత, జంతువులపై హింసను నివారించడం వంటి అంశాలపై మాట్లాడారు. పక్షోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన మరియు



చిత్రలేఖన పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించి నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి. ప్రకాష్ వివరించారు. జంతువులు మన జీవన భాగస్వాములని, వాటి సంరక్షణ ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొంటూ, ఈ జంతు సంక్షేమ పక్షోత్సవ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు కోరారు. ఈ కార్య క్రమంలో సహాయ సంచాలకులు, డాక్టర్ మదన్ మోహన్ గారు, పశు వైద్య అధికారి డాక్టర్ నరేష్ గడ్డం, డాక్టర్ వాసు పావని, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తిరుపతి, రామ కృష్ణ, చంద్ర శేఖర్, ఎల్ ఎస్ ఏ రవీందర్ కార్యాలయ సహాయకులు రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల దరఖాస్తుల హర్డ్ కాపీలను వెంటనే సమర్పించాలి

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి

**పెద్దపల్లి, జనవరి 31 (మనం ప్రతినిధి):** బీసి , ఈబీసీ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తుల హర్డ్ కాపీలను వెంటనే సమర్పించాలని పెద్దపల్లి జిల్లా అభివృద్ధి అధికారి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ , ఈ.బి.సి విద్యార్థులకు సంబంధించి ఉపకార వేతనం (ఎం.టి.ఎఫ్) నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. కావున 2023-24, 2024-25, 2025-26 విద్యా సంవత్సరం సంబంధించి జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల విద్యార్థుల యొక్క స్కాలర్షిప్ దరఖాస్తులు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయం నందు హర్డ్ కాపీలను వెంటనే సమర్పించాలని రంగారెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

# ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ,జనవరి31(మనం న్యూస్):**ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరుకొన్నారు..వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ఆంజనేయ స్వామి ఈవో నాగారపు శ్రీనివాస్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు..ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. వారు మాట్లాడుతూ శ్రీనివాస్ గత 36 సంవత్సరాల నుంచి దేవాదాయ శాఖలో పంచలంచెలుగా పనిచేస్తూ ఈఓ స్థాయికి ఎదిగారని అన్నారు..రిటైర్మెంట్ అయినారు ప్రతి ఉద్యోగి ఉద్యోగ కాలంలో చేసిన మంచి పనులు పేరు ప్రతిష్టలు నిలబెడతాయి అని అన్నారు.. నాగారం శ్రీనివాస్ ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధి పరచడంలో విశేష కృషి చేశారని,రిటైర్మెంట్ తర్వాత కూడా వారి సేవలో అవసరమైనచో సూచనలు



సలహాలు మిగతా సిబ్బందికి అందించాలని సూచించారు.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానాన్ని టెంపుల్ సిటీ గా అభివృద్ధి చేస్తున్నాం అన్నారు.. గతంలో దేవస్థాన ఛైర్మన్గా పనిచేసిన సందర్భంగా నాంపల్లి దేవస్థానాన్ని,మామిడిపల్లి సీత రామ చంద్ర స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేశానని ప్రస్తుతం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు..శ్రీనివాస్ జీవితం శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు..

# కలమడుగు లో ప్రారంభమైన జాతర

**జన్నారం జనవరి 31(మనం న్యూస్)**జన్నారం మండలం లోని కలమడుగు గ్రామంలోని నరణారాయన స్వామి దేవాలయంలో జాతర శనివారం ప్రారంభం అయింది. ఇది దేశంలోనే రెండవ పురాతన ఆలయం కావడం వేములవాడ చాళుక్యులు కాలంలో నిర్మించిన ఆలయం కావడం తో దేనికి ప్రత్యేకత వుంది.శనివారం ఆడపడుచులు కుంకుమ పూజలు నిర్వహించారు.ఆదివారం గీత హవనము ధంపతులచే అన్న ప్రసాద ఉత్తరం కార్యక్రమం



వుంటుంది.సోమవారం రెండు తేదీన రథోత్సవం కార్యక్రమం అగ్గి మల్లన్న బోనాలు అగ్ని గుండాలు కార్యక్రమాలు వుంటాయి అని ఆలయ అధికారులు తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జాతరను విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రిటైర్మెంట్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



- టి జి యు ఎస్ జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు డిమాండ్.

**కోరుట్ల జనవరి 31 (మనం న్యూస్)** రిటైర్మెంట్ పొందుతున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని, డీఏ, పీఆర్సీ, అలాగే రిటైర్మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని టీ జీ యు ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరుట్ల మండలంలో జడ్ పి హెచ్ ఎస్ ఏకిన్ పూర్ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుడు జుంబర్తి శంకర్ పదవీవిరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఏళ్ల తరబడి విద్యారంగానికి సేవలందించిన ఉపాధ్యాయులు పదవీవిరమణ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనడం దురదృష్టకరమన్నారు. పెండింగ్లో ఉన్న డీఏ, పీఆర్సీ అమలు, ఇతర రిటైర్మెంట్ బకాయిలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చెల్లించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులు మార్గం రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సేవలు సమాజానికి అమూల్యమైనవని, రిటైర్మెంట్ అనంతరం కూడా గౌరవప్రదమైన జీవనం సాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాల విద్యాధికారులు నరేశం, శ్రీనివాస్, లక్ష్మి నారాయణలు,సోదర ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్,రాష్ట్ర నాయకులు బోనగిరి దేవయ్య, సిరిపురం రాజేష్, దీపక్ లు పాల్గొని పదవీవిరమణ పొందుతున్న శంకర్ ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



- టెట్ రద్దుకై చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

**జగిత్యాల జనవరి 31(మనం న్యూస్)** సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలనిపి ఆర్ టీ యు టీ ఎస్ ఉపాధ్యాయ సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐజాక్టో పిలుపు మేరకు పిఆర్టియు టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5 న సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ 'చలో ఢిల్లీ' పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనందరావు, అమర్నాథ్ రెడ్డిలు మాట్లాడుతూ విద్య హక్కు చట్టం 2009 లోని సెక్షన్ 23 ను సవరించి 2010 కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇట్టి ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు ఎ వి న్ రాజు,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాసిత్, రాష్ట్ర కార్యదర్శి అనూజ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీదేవి, బాధ్యులు హరీష్, ఆత్మ చరణ్ రావు, అనిల్ రావు, శ్రీనివాస్, రాజశేఖర్, గంగారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

- బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకుంటే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు
- ఆపరేషన్ స్మైల్ లో 133 మంది బాల కార్మికుల విముక్తి
- ఆపరేషన్ స్మైల్ ను విజయవంతంగా నిర్వహించిన బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జనవరి 31 మనంప్రతినిధిః బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా గడిచిన నెల రోజులుగా 01.01.2026 నుండి 31.01.2026 వరకు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే ఆపరేషన్ స్త్మల్ అని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలలో బాల కార్మిక వ్యవస్థ ఒకటని అన్నారు. 5 నుండి 14 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు కార్మికులుగా పనిచేస్తే వారిని బాల కార్మికులుగా పరిగణిస్తారని, బాలలను కార్మికులుగా నియమించడం వారి ప్రాథమిక హక్కుకు భంగం కలిగించినట్లేనని అన్నారు. వ్యవసాయం, గనులు, తయారీ, నిర్మాణ రంగం, పరిశ్రమలు, కర్మాగారాలు, హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, బిక్షాటన తదితర రంగాలలో బాలలు కార్మికులుగా పనిచేస్తున్నారని, బాలలు కార్మికులుగా కొనసాగడం వల్ల వారు భవిష్యత్తులో ఉన్నతమైన జీవితం గడపే అవకాశాలు కోల్పోతారని, సరైన విద్య లేకపోవడం వలన ఉపాధి అవకాశాలు దూరమవుతాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాలలో రాణించాలంటే విద్యతో పాటు సరైన పోషకాహారం, ఆటలలో చురుకుదనం, తోటి విద్యార్థులతో పోటీపడే సామర్థ్యం అవసరమని అన్నారు. బాల కార్మికులుగా మారడం వలన సరైన మార్గదర్శనం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహకారం లేక పలువురు బాలలు నేరాల వైపు మళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు, చిన్నారులే దేశ ప్రగతికి పునాది అని, అభివృద్ధిలో పరుగులు పెడుతున్న ఈ హైటెక్ యుగంలో కూడా బాల కార్మిక వ్యవస్థ చిన్నారుల బాల్యాన్ని నాశనం చేస్తోందని అన్నారు. బాల కార్మికులు లేని, ఆరోగ్యవంతమైన పిల్లలతో కూడిన దేశమే అభివృద్ధిలో ముందుంటుందని అన్నారు. , బాల కార్మిక వ్యవస్థకు ప్రధాన కారణాలుగా పేదరికం, నిరక్షరాస్యత, తక్కువ ఆదాయం, కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితుల్లో అనేక కుటుంబాలు తమ పిల్లలను పనుల్లోకి నెట్టివేస్తున్నాయని, చిన్నారులు చిన్న చిన్న చేతులతో బతుకుబండిని లాగుతూ, అనారోగ్యాలకు గురవుతున్నారు అన్నారు. బాల కార్మిక వ్యవస్థ అనే కబంధ హస్తాల నుంచి చిన్నారులను విముక్తి చేయాలనే లక్ష్యంతో 2014 నుండి ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్త్మల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను పోలీస్ శాఖ పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా బాలలను పనిస్థలాల నుంచి రక్షించి, పాఠశాలలో చేర్చడం, తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చుతూ బాధిత చిన్నారులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైనా బాల కార్మికులు కనిపించినా, లేదా ఎక్కడైనా బాలలు పని చేస్తున్నట్లు సమాచారం ఉన్నా చైల్డ్లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా అత్యవసర నెంబర్ 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ప్రజలను కోరారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలను వెట్టిచాకిరికి గురి చేయడం, బలవంతంగా బిక్షాటన చేయించడం, పశువుల కాపరులుగా, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు తదితర ప్రదేశాల్లో పని చేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఈ విధమైన చర్యలకు పాల్పడిన వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఈ సంవత్సరం ఆపరేషన్ స్త్మల్ లో భాగంగా బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 93 కేసులు నమోదు చేసి, 122 మంది బాలలు, 11 మంది బాలికలు మొత్తం - 133 మంది బాల కార్మికులను రక్షించి విముక్తి కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వివిధ శాఖలకు చెందిన అధికారి, సిబ్బందిని జిల్లా ఎస్పీ హృదయపూర్వకంగా అభినందించారు

# సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం



చేవెళ్ల, జనవరి 31(మనం న్యూస్): చన్వెల్లి గ్రామంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పురన్ దాస్, ఎస్త్రు వనం శిరీష, గ్రామ సర్పంచి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ దీపక్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు అత్యంత అవసరమని అన్నారు. మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవడంతో పాటు క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా మరింత కృషి చేసి విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో దోహదపడిందని గ్రామ పెద్దలు తెలిపారు.

# సూపర్వైజర్లు, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




సంగారెడ్డి, జనవరి 31 మనం ప్రతినిధిః ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్వోలు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధియే నా లక్ష్యం



చేవెళ్ల, జనవరి 31 (మనం న్యూస్) : 14వ వార్డు అభివృద్ధియే నా లక్ష్యమని వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మద్దెల శ్రీనివాస్ అన్నారు. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని 14వ వార్డు పరిధిలో ఇంటింటా ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వార్డులో ఏ సమస్యలు లేకుండా వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. తనను ఆశీర్వదించి మీ అమూల్యమైన ఓటును వేసి కౌన్సిలర్ గా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్-విలయతాబాద్ వరద కాలువ నుంచి అక్రమ మట్టి తరలింపు

- గ్రామస్తుల ఆందోళన
- తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్



మేడిపల్లి జనవరి 30 (మనం న్యూస్) మేడిపల్లి మండలం కొండాపూర్-విలయతాబాద్ వరద కాలువ నుంచి కొందరు అక్రమార్కులు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న కారణంగా గ్రామ రహదారులు ధ్వంసమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల కళ్లుగప్పి ప్రతిరోజూ రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు అక్రమ మట్టి తరలింపు కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాల వల్ల భవిష్యత్తులో నూతన గృహ నిర్మాణాలకు అవసరమైన మట్టికి కొరత ఏర్పడి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని, సహజ వనరులు కనుమరుగు అయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ అక్రమ మట్టి తరలింపుపై తహసీల్దార్కు రాతపూర్వక ఫిర్యాదు అందజేశామని, అలాగే జిల్లా కలెక్టర్, సంబంధిత పోలీస్ శాఖ, గ్రామపంచాయతీకి కూడా ఫిర్యాదు ప్రతులు అందజేశామని గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోకపోతే గ్రామ ప్రజలంతా కలిసి శాంతియుత ఉద్యమానికి దిగుతామని గ్రామస్తులు హెచ్చరించారు. మరోసారి తహసీల్దార్ కు ఫిర్యాదు చేస్తూ అధికారులు వెంటనే స్పందించి అక్రమ మట్టి తరలింపును అరికట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎద్దండి భూమయ్య, పిట్టల నారాయణ, చెరుకూరి రాజేశం, ఎదులాపురం దుబ్బ రాజేశం, మునుగోరి హనుమంతు, బొల్లారపు బాబు, డప్పు ప్రేమ్ కుమార్, యదులాపురం రాజారాం, డప్పు భూమయ్య లు ఉన్నారు.

# ఐఐటీహెచ్ ఎక్స్పోజర్ విజిట్కు వెళ్లిన పారిశుద్ధ్య కార్మికుల పిల్లలు



సంగారెడ్డి జనవరి 31 మనం ప్రతినిధిః జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పిల్లల జీవితాల్లో ఆశల దీపం వెలిగించే వినూత్న కార్యక్రమానికి తొలిసారి శ్రీకారం చుట్టింది. శనివారం దేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో ఒకటైన ఐఐటీ హైదరాబాద్ కు పారిశుద్ధ్య కార్మికుల పిల్లల ను ఎక్స్పొజర్ విజిట్ జీహెచ్ఎంసీ తీసుకెళ్ళింది.ప్రతి సర్కిల్ నుంచి ముగ్గురు చొప్పున సుమారు 180 మందిని 6 బస్సు ల ద్వారా ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ సందర్శనకు జీహెచ్ఎంసీ అధికారులు తీసుకెళ్లనున్నారు.ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఈ విజిట్ కొనసాగుంది.ఈ విజిట్ ద్వారా ఐఐటీ అధ్యాపకులు, విద్యార్థులతో పరస్పర చర్య, అకడమిక్ భవనాలు, గ్రంథాలయాలు, ఇన్నోవేషన్ సెంటర్ల సందర్శన, ప్రేరణాత్మక సమావేశాల ద్వారా ఈ పిల్లలకు ఒక ప్రపంచ స్థాయి విద్యా వాతావరణాన్ని జీహెచ్ఎంసీ పరిచయం చేయనుంది. చాలా మంది పిల్లలు తొలిసారి ప్రపంచ స్థాయి విద్యా సంస్థను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఐఐటీ హైదరాబాద్లోని ఈ-సెల్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ నిర్వహిస్తుంది. రవాణా, భోజనం, భద్రత, మార్గదర్శక సహాయం వంటి అన్ని ఏర్పాట్లు ప్రత్యేకంగా చేపట్టి, ప్రతి పిల్లవాడికి ఆత్మవిశ్వాసం కలిగించేలా జిహెచ్ఎంసి చర్యలు తీసుకుంటుంది. జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పిల్లల ను ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ ఎక్స్పొజర్ విజిట్ కు తీసుకెళుతుండడం పట్ల జిహెచ్ఎంసిని పలువురు ప్రశంసిస్తున్నారు.

# డిప్యూటీ సూపరింటెండెంట్ కు ఘనంగా వీడ్కోలు



గోదావరిఖని, జనవరి 31 (మనం న్యూస్): సింగరేణి సంస్థ రామగుండం ఏరియా వన్ జిఎం కార్యలయం పర్సనల్ డిపార్ట్ మెంట్ నందు డిప్యూటి సూపరిండెంట్ గా వివిధ గనులు, డిపార్ట్ మెంట్ లలో 37 ఏళ్లు విధులు నిర్వహించిన అనంతరం తిప్పర్తి నాగేశ్వరచారి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం రామగుండం ఏరియా వన్ జిఎం కార్యాలయంలో జిఎం డి లలిత్ కుమార్ తిప్పర్తి నాగేశ్వరచారి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి పదవి విరమణ అనేది అని వార్యమని అన్నారు. చారి చేసిన సేవలను కొనియాడారు. నాగేశ్వరచారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడవాలని అన్నారు. పదవీ విరమణ అనంతరం నాగేశ్వరచారి సుఖసంతోషాలతో ఉండాలని సహచర ఉద్యోగులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి, పద్మ, క్రాంతి కుమార్, శ్రావణ్ కుమార్, హనుమంత రావు, మోహనరావు, సురేష్, దేవచారి, రమేష్, సంతోష్, అనిత, దివ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

- జర్నలిస్టు సంక్షేమానికి కృషి చేస్తా
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, జనవరి 31(మనంప్రతినిధి)ః సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రూపొందించిన 2026 డైరీని శనివారం సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి గత ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం నూతన జీఓని తీసుకొచ్చి జర్నలిస్టులకు కలరాస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాసాల బుచ్చిరెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు సాయినాథ్, ఉపాధ్యక్షులు ఎర్ర వీరేందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, సునీల్, కోశాధికారి నాగభూషణం, పుండరీకం, లక్ష్మణ్, నర్సింలు, కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని,జనవరి31(మనంన్యూస్) మంథని డివిజన్ పరిధిలోని రామగిరి మండలం సింగిరెడ్డి పల్లె గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ నానువాళ్ల సంపత్ తండ్రి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, మృతుని చిత్రపటానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పూలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు.కాగా అడిచెర్ల రాజమ్మ ఇటీవల మరణించగ మృతురాలి కుటుంబాన్ని,కనవేన కొమురయ్య చెయ్యి ప్యాక్చర్ కాగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సోదరుడు రఘునందన్ రెడ్డి మృతిచెందగా మృతునీ పార్థీవ దేహానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పూల మాల వేసి నివాళులు అర్పించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# గజ్వేల్ లో 125 నామినేషన్ చెల్లుబాటు

సిద్దిపేట ప్రతినిధి,జనవరి 31( మనం న్యూస్)ః గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లో 125 నామినేషన్లు చెల్లుబాటులో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ధ్రువీకరించారు. 20 వార్డుల్లో 125 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. బిజెపి 28 మంది, కాంగ్రెస్ 33 మంది, బిఆర్ఎస్ 37 మంది, స్వతంత్రులు 13 మంది, ఇతర పార్టీల వారు 12 మంది, బి ఎస్ పి ఒకరు, సిపిఎం ఒకరు పోటీలో ఉన్నారు. వార్డుల వారీగా 1 వ వార్డులో 11 మంది, 2 వ వార్డులో 6 మంది, 3 వ వార్డులో 6 మంది, 4 వ వార్డులో 5 మంది, 5 వ వార్డులో 4 మంది, 6 వ వార్డులు 7 మంది, 7 వ వార్డులో 7 మంది, 8 వ వార్డులో 4 మంది, 9 వ వార్డులో 6 మంది, 10 వ వార్డులు 9 మంది, 11 వ వార్డులు 12 మంది, 12 వార్డులు 6 మంది, 13 వ వార్డులో 5 మంది, 14 వ వార్డులో 4 మంది, 15 వార్డులో 6 మంది, 16 వ వార్డులో 5 మంది, 17 వార్డులు 4 మంది, 18 వ వార్డులో 8 మంది, 19 వ వార్డులు 4 మంది, 20వ వార్డులు 6 మంది పోటీలో మిగిలారు. సిపిఎం అభ్యర్థి 9వ వార్డులో, బిఎస్సి పి అభ్యర్థి 7 వార్డులో పోటీలో ఉన్నారు.

# తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం క్యాలెండర్ను ఆవిష్కరించిన డిఐఈఓ కల్పన



మంథని,జనవరి31 (మనంన్యూస్): డిఏఈఓ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం పెద్దపల్లి జిల్లా 2026- క్యాలెండర్ ను పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్నోడల్అధికారి,డిఐఈఓకల్పనఆవిష్కరించారు.ఈ సందర్భంగా డిఐఈఓ కల్పన మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన జూనియర్ లెక్చరర్లు కళాశాలల అభివృద్ధి కొరకు పనిచేయాలని, రాబోయే పరీక్షలలో 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు,జిల్లా అధ్యక్షుడు బైరి మార్కండేయ,ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ ఎం.రవీందర్ ట్రెజరర్ డాక్టర్ జి.అరవింద్ రాష్ట్ర కమిటీ సభ్యులు జె గౌతమ్ కార్యదర్శులు ఎస్ నవ్య,కే.రమేష్ కార్యవర్గ సభ్యులు కే. కృష్ణ ,యు మహేష్,జి రాకేష్,యు శ్రీనివాస్, బి మధుసూదన్ పి శశికళ,డాక్టర్ ఎల్ వినోద పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలీలకు ఇవ్వాలి

- పద్మశాలీ సేవా సంఘం జగిత్యాల పట్టణ అధ్యక్షుడు బోగ గంగాధర్



జగిత్యాల జనవరి 31 ( మనం ప్రతినిధి ): మున్సిపల్ ఎన్నికల్లో పద్మశాలీలకు ప్రాముఖ్యత ఇచ్చి జనాబా ప్రాతిపధికన వార్డు స్థానాలు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పద్మశాలీ సేవా సంఘం జగిత్యాల పట్టణ అధ్యక్షుడు బోగ గంగాధర్ (జిఆర్) శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జగిత్యాల పట్టణంలో 32 వార్డులు ఉన్నప్పుడు 6 వార్డులు, 38 వార్డులు ఉన్నప్పుడు 13 వార్డులు పద్మశాలీలకు కేటాయించారన్నారు. అదేవిధంగా జగిత్యాల పట్టణంలో ప్రస్తుతం 50 వార్డులు ఉన్నాయని, పట్టణంలో అత్యధిక జనాబా కలిగిన కులాల్లో రెండవ స్థానంలో ఉన్న పద్మశాలీలకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో 20 వార్డు స్థానాలు పద్మశాలీలకు కేటాయించేలా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి పద్మశాలీలకు న్యాయం చేయాలని కోరారు.

## 'త్రివేణి' విద్యార్థుల సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి సేకరణ



ఖమ్మం, జనవరి 31(మనం న్యూస్): దేశ రక్షణలో తమ ప్రాణాలను ఇచ్చిన అమర జవానుల యొక్క త్యాగాలను స్మరించుకుంటూ సైనిక సంక్షేమానికి తోడ్పాడుగా మన త్రివేణి విద్యాసంస్థలోని విద్యార్థులందరూ కలిసి, త్రివేణి లోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులందరి వద్దనుండి, వివిధ వర్గాల ద్వారా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి సేకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సైనికులు మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమం కోసం నిర్వహించే పతాక దినోత్సవ నిధి సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు విధిగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ సైనికులకి, జవానులకి, అలాగే రైతులకి సహాయం చేసే కార్యక్రమంలో త్రివేణి మేనేజ్మెంట్, త్రివేణి పిల్లలు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల అధిపతి యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఆపరేషన్ స్మైల్-12లో భాగంగా 58 మంది బాలకార్మికులకు విముక్తి

ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 31 (మనంప్రతినిధి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-12 లో భాగంగా 2026 జనవరి 01 నుండి 31వరకు జిల్లా వ్యాప్తంగా 05 ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాలలో దాడులు నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదు బృందాలను ఈ దాడులను నిర్వహించడానికి ఏర్పాటు చేయడం జరిగిందని, నెల రోజుల పాటు జరిగిన ఈ దాడులలో భాగంగా మొత్తం 58 మంది బాలకార్మికులను పట్టుకొని వారికి విముక్తి కలిగించడం జరిగిందని తెలిపారు. ఇందులో 09 మంది బాలికలు ఉండగా 49 మంది బాలురు ఉన్నారు.ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందిన 04 బాలికలు, 27 మంది బాలురలను గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 36 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ స్మైల్-12 బృందం పట్టుకున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడం జరిగిందని తెలియజేసారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనబడితే వెంటనే డయల్ 100 నకు గానీ 1098కి గానీ ఫోన్ చేసి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ స్మైల్-12 నకు డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి నోడల్ అధికారిగా వ్యవహరించారు. ఆపరేషన్ స్మైల్ బృందంలో పనిచేసి బాలకార్మికులకు విముక్తి కలిగేలా బాధ్యతలు నిర్వర్తించిన షీటీం ఇన్స్పెక్టర్ రాము, ఆర్ఎస్ఐ రమాదేవి, ఎస్ఐలు విజయ, సతీష్, శ్రావణ్, రాఘవయ్య, సమ్మిరెడ్డి, లక్ష్మణ్, ఏఎస్ఐ నాగయ్య, పీసీలు మల్లికాంబ, రాంబాబులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

# ప్రత్యర్థులవి 'సొల్లు కబుర్లు'..

# మావి చేతల పనులు

### పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం

### కమిషన్ల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం ఏమైందో చూడండి

### ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు



ఖమ్మం, జనవరి 31(మనం బ్యూరో): 'ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి 'సొల్లు కబుర్లు' చెబుతారు.. మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. పదేళ్ళు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?' అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై నిప్పులు చెరిగారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు. ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?' అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు.

**చేతల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం**

తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. 'మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం' అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, 500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**ఏదులాపురానికి కొత్త హంగులు**

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. 'వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం. ఎఫ్.సి.ఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం. మీ కష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా' అని హామీ ఇచ్చారు.

విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## కష్ట పడితే దేనినైనా సాధించవచ్చు

- ఆర్జేసి జూనియర్ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ
- వేడుకగా ఫేర్‌వెల్ డే
- ఆట,పాటలతో అలరించిన విద్యార్థులు









ఖమ్మం, జనవరి 31(మనం న్యూస్): జీవితంలో విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక ప్రకారం కష్టపడితే దేనినైనా సాధించవచ్చునని ఆర్జేసి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. స్థానిక ట్రంక్ రోడ్ ప్రాంతంలోని ఆర్జేసి జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే కార్యక్రమం విద్యార్థుల ఆట, పాట లతో వారి కేరింతల నడుమ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రదర్శించిన డ్యాన్సులతో పాటు సోలో, బ్రేక్, క్లాసికల్ డ్యాన్సులు చూపరులను ఆకట్టుకున్నాయి. తొలుత ఈ కార్యక్రమానికి అతిధిగా హాజరైన కృష్ణ కళాశాల అధ్యాపకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గత 23 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఆర్జేసి జూనియర్ కళాశాల తన ప్రస్థానంలో అనేక విజయాలు సాధించిందని తెలిపారు. తమ కళాశాల కు చెందిన అనేక మంది విద్యార్థులు సైంటిస్టు, విద్యా, కళా,క్రీడా,వ్యాపార,రాజకీయ,ప్రభుత్వ ఉద్యోగ రంగాలలో స్థిర పడి ఉన్నారని తెలిపారు. దీనితో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన ఘనత ఆర్జేసిదేనన్నారు. డిగ్రీ స్థాయిలో బహుళ జాతి కంపెనీల్లో ప్లేస్మెంట్ లు సాధించిన ఘనత కూడా తమ కళాశాలకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు కళాశాల విద్యార్థులు సాగించిన విజయ పరంపరను ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా కొనసాగించాలని సూచించారు.దీనికి విద్యార్థులు నిరంతరం కళాశాలకు హాజరవుతూ ఉపాధ్యాయులు చెప్పినదాన్ని అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం కష్టపడితే సాధించ వచ్చన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని,ఆదిశ లోనే ఇప్పటి వరకు తమ విద్యార్థులు నడుచుకున్నారని, ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా ఆవిధంగా ముందుకు సాగుతూ తల్లిదండ్రుల కలల ను నెరవేర్చాలని,తద్వారా మీకు పాఠాలు చెప్పిన అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఈ విద్యా సంవత్సరం పలు విభాగాలలో, పరీక్షలలో గెలుపొందిన పలువురు విద్యార్థులకు, తెలుగు అధ్యాపకులు నరేష్ ఆధ్వర్యం లో తెలుగులో మంచి మార్కులు సాధించిన విద్యార్దులకు బహుమతులు అందజేశారు.
చివరగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, వెస్టన్, బ్రేక్, గ్రూప్, సోలో తదితర డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. చివరగా కార్యక్రమానికి అతిధి గా విచ్చేసిన కృష్ణను కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ.టి.కళాశాల డైరెక్టర్ గుండాల ప్రవీణ్ కుమార్, ఆర్జేసి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. లక్ష్మీపతి, ఇంచార్జ్ టి.ఉపేందర్ ,డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య లతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పచ్చని టేకు చెట్లపై గొడ్డలి వేటు

- గేటు కారేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో టేకు చెట్ల నరికివేత
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్ తీరు పై పలు అనుమానాలు



కారేపల్లి, జనవరి 31(మనం న్యూస్): పచ్చదనానికి కేరాఫ్ అడ్రస్ గా చెప్పుకునే గేటుకారేపల్లి ఆశ్రమ బాలికల ఆశ్రమ పాఠశాలలో టేకు చెట్లపై గొడ్డలి వేటు పడింది. ఏజెన్సీ ఏరియా పరిధిలో ఉన్న ఈ చెట్లకు అటవీశాఖ అనుమతులు, గిరిజన సంక్షేమ శాఖ అనుమతులు తమకు చెల్లవు అనే రీతిలో టేకు చెట్లను కొట్టేసి,విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుని, సంబంధిత అధికారుల కండ్లు కప్పేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని గేటు కారేపల్లి(మేకల తండా) బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చూపరులను కట్టిపడేసేలా టేకు, జామాయిల్ చెట్లు ఏపుగా పెరిగి కంటికి ఇంపుగా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడి ఉంది. వేసవి కూడా తెలియని రీతిలో హాస్టల్ క్యాంపస్ చల్లదనానికి అనువుగా ఉంటుంది. కాగా ఇదే ఆశ్రమ పాఠశాలలో రోజురోజుకు టేకు చెట్లు మాయమవుతూ అహ్లాదకరమైన వాతావరణం స్థానంలో ఆందోళనకరమైన వాతావరణం ఏర్పడే ప్రమాదం పొంచి ఉన్నది. అనుమతులు లేకుండా, అకారణంగా, ఇష్టానుసారంగా, యథేచ్ఛగా చెట్లను కొట్టేస్తున్నారు. కొట్టేసిన టేకు దుంగలను హాస్టల్ లోని ఓ గదిలో ఉంచి ఒక్కొక్కటిని బయటకు పంపిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. నరికి వేసిన చెట్ల మొదళ్లకు నిప్పు పెట్టి ఆనవాళ్లు కనిపించకుండా చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఈ ఆశ్రమ పాఠశాలకు సంరక్షకురాలిగా, బాధ్యతతో నిలవాల్సిన హెడ్మాస్టర్ వెంకటరమణ తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చెట్ల నరికివేత ఘటనపై హెడ్ మాస్టర్ టి వెంకటరమణ వివరణ కోరగా కప్పిపుచ్చుకునే రీతిలో అలాంటిదేమీ లేదంటూ వివరణ ఇవ్వడం గమనార్హం. ఈ చెట్ల నరికివేత ఘటనపై సంబంధిత అధికారులు, ఐటిడిఏ పిఓ విచారించి తగు చర్యలు తీసుకోవాలని,పచ్చని చెట్లను కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## యస్.బి.ఐ.టి. ని సందర్శించిన బహుళజాతి ఐ.టి. సంస్థ వర్చుసా



ఖమ్మం, జనవరి 31(మనం న్యూస్): ప్రముఖ అంతర్జాతీయ ఐ.టి. రంగ సంస్థ వర్చుసా హెచ్.ఆర్. తమ కళాశాలను సందర్శించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలోని చివరి సంవత్సరం విద్యార్థులకు 'క్యాంపస్ టు కార్పోరేట్'' కార్యక్రమంలో భాగంగా వర్చుసా సీనియర్ హెచ్.ఆర్ అభిషేక్ ద్వారా గెస్ట్ లెక్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పోరేట్ రంగానికి అవసరమైన మెళకువలు, విద్యార్థులకు అవసరమైన ఏ.ఐ. నైపుణ్యాలు, వ్యక్తిగత క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అమెరికా కేంద్రంగా ఐటి సేవలు అందిస్తున్న వర్చునా కంపెనీ తమ కళాశాలను ఎంపిక చేసి తమ విద్యార్థులతో ముచ్చటించడం, భవిష్యత్ కార్యచరణపై ఒక అవగాహనకు రావటం హర్షించదగ్గ విషయమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డ్యా జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులు తాము చేసిన ప్రాజెక్టుపై పూర్తి అవగాహనా కలిగి ఉండాలని, కోడింగ్ కాంటెస్టు అయిన హ్యాకథాన్, ఐడియాథాన్ వంటి పోటీలలో చురుకుగా పాల్గొనాలని టెక్నికల్ స్కిల్స్ పై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేసినట్లు కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. సదస్సులో భాగంగా విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలు, అనుమానాలను హెచ్.ఆర్. అభిషేక్ నివృత్తి చేసినట్లు తెలిపారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అడోబ్, సేల్స్ ఫోర్స్, పెగా వంటి అంతర్జాతీయ సంస్థలు క్లైంట్స్ గా కలిగి ఉన్న వర్చుసా సంస్థలో రాసున్న రోజులలో ఇంటర్షిప్స్, వర్కుషాప్స్, ప్లేస్మెంట్స్ తదితర అంశాలపై అవగాహన కలిగిందని కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్ కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో తమ కళాశాల తమదైన ముద్రను కలిగిఉండేలా ప్రణాళికలను సిద్ధంచేసినట్లు, భవిష్యత్తులో మరిన్ని బహుళజాతి సంస్థలను తమ కళాశాలకు ఆహ్వానించడంతో పాటు తమ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ధీమా వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ హెచ్.ఆర్. అభిషేక్ ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్చుసా సీనియర్ హెచ్. ఆర్. డి. అభిషేక్, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, ఇన్నోవేషన్ భాధ్యులు డ్యా యమ్. మురళీ మోహన్, వివిధ విభాగాల హెచ్. ఒడీలు, టి.పి.ఐ. యస్. సవిత, కోఆర్డినేటర్ డ్యాబి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్న వసంత్ వ్యాలీ విద్యార్థులు



కరీంనగర్ స్పోరట్స్ జనవరి 31 (మనం న్యూస్): రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా గత నెలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కరీంనగర్ హనుమాన్ నగర్ లోని వసంత్ వ్యాలీ విద్యార్థులు, హరి చందన, కృతిక, జ్ఞానేశ్వర్ పాల్గొని శనివారం తిమ్మాపూర్ ఆర్టీవో ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేల సత్పతి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు, ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ బుచ్చిరెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు.

## కాపర్ వైర్ దొంగలను చాకచక్యంగా పట్టుకున్న దమ్మపేట పోలీసులు



దమ్మపేట, జనవరి 31(మనం న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనం కేసును దమ్మపేట పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, దొంగిలించిన (90) కిలోల కాపర్ వైర్, దొంగతనానికి ఉపయోగించిన వైరు కట్టర్-1, రెంచులు -5, గడ్డపలుగు-1, నిందితుల వద్ద నుండి మొబైల్ ఫోన్స్-3, రవాణా కి ఉపయోగించిన మారుతి సుజుకి కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలు ఏ 1: పల్లా లోవరాజు తండ్రి: అప్పారావు, వయసు 33 సంవత్సరాలు, కులము యాదవ, నివాసం: చిన్న చంకలపూడి గ్రామము, పత్తిపాడు మండలం, కాకినాడ జిల్లా, ఏ 2- రేఖ సుదీర్, తండ్రి : బాబురావు,19 సంవత్సరాలు, కులం: యాదవ, వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం పారుపాక గ్రామం, రౌతులపూడి మండలం, కాకినాడ జిల్లా, ఏ-3: సారిక సురేష్, తండ్రి : సూర్యనారాయణ, వయస్సు : 28 సంవత్సరాలు, కులం :తూర్పు కాపు, నివాసం: వేములూరు గ్రామం, కొవ్వూరు మండలంగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ముగ్గురు నేరస్తులు దమ్మపేట మండలంలో దొంగలించిన ట్రాన్స్ఫార్మర్స్ 90 కిలోల కాపర్ వైర్ ని దమ్మపేట గ్రామంలో చెట్ల పొదలలో పెట్టి వెళ్ళిపోయారని, డబ్బులు అవసరమై శనివారం ఉదయం సమయంలో దమ్మపేట కు కారులో వచ్చి, కారు డిక్కీ లో పెట్టుకొని రాగి వైర్ ను రాజమండ్రిలో అమ్ముకుందామని వెళ్తున్నారు. అచ్యుతాపురం క్రాస్ రోడ్డు వద్ద ఉదయం 11:00 గంటలకు తమ సిబ్బంది లక్ష్మణ్, రామకృష్ణరెడ్డి, కాలేశవలీ, రమేష్ , నాగ ముత్యం తదితరులు వాహన తనికి చేస్తుండగా ప ట్టుబడ్డారని తెలిపారు. ప్రజా ఆస్తిని ధ్వంసం చేయడం లేదా దొంగతనానికి పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పైన తెలిపిన ముగ్గురు నిందితులపై సెక్షన్ 111(2)(బి) బి. ఎన్.ఎస్ ప్రకారం ఆర్గనైజేడ్ క్రైమ్ కింద వారికీ జీవిత ఖైదు పడే విధముగా కేసు ఫైల్ చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎవరైనా అనుమానాస్పద కార్యకలాపాలను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగలను పట్టుకున్నందుకు దమ్మపేట సబ్ ఇన్స్పెక్టర్ సాయి కిషోర్ రెడ్డి ని, పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, రామకృష్ణ రెడ్డి లను ఎస్పి రోహిత్ రాజ్, డిఎస్పీ సతీష్ కుమార్, సి.ఐ నాగరాజు అభినందించారు. .

## స్పోర్ట్స్ మీట్ తో విద్యార్థుల్లో నూతనోత్తేజం

- మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,
- మాజీ ఐయంఏ చైర్మన్ ,ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు







ఖమ్మం, జనవరి 31(మనం న్యూస్): స్పోర్ట్స్ మీట్ లతో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం పెంపొందుతుందని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఐయంఎ ప్రెసిడెంట్ ,ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు తెలియజేశారు. స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించిన స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని పెంచుతున్నాయన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా క్రీడా పోటీల ద్వారా విద్యార్థుల్లో మరింత చురుకుదనం , ఏకాగ్రత, పోటీ తత్వం , క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని తెలిపారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులను క్రీడలతో పాటు అన్ని రంగాలలో నిత్యం ప్రోత్సహించి ఉన్నత స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడం అభినందనీయం అన్నారు. పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ గత రెండు రోజులుగా నిర్వహించిన స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్ లో విద్యార్థులు అన్ని రకాల క్రీడా పోటీలలో తమ సత్తా చాటి రాణించారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అంతకుముందు పాఠశాల లో సీనియర్ విద్యార్థులకు కబడ్డీ, కో కో, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగాయి. సభానంతరం 22 రకాల ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతి ప్రధానం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అవిశ్వాస తీర్మానం నెగ్గిన మాండ్ర



**జూపాడుబంగ్లా, జనవరి 31 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించిన అవిశ్వాస తీర్మాన ఎన్నికలలో మండల అధ్యక్షురాలు సువర్ణమ్మ, పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తి మద్దతు తెలపడంతో సువర్ణమ్మ, తన పదవిని కోల్పోయారు. ఈ సందర్భంగా ఏడు మంది ఎంపీటీసీ లను ఎన్నికల అనంతరం నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, వారిని పూలమాలలతో అభినందించడం జరిగినది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో సక్రమంగా పనులు జరగనివ్వక సరైనటువంటి సహకారం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రహించి ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకురావడం జరిగిందని. ఎంపిటిసిలు అందరూ కూడా మండల అభివృద్ధిని ఆకాంక్షించి మన గ్రామాలు బాగుండాలని. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇస్తున్నటువంటి నిధులు కానివ్వండి. వస్తున్నటువంటి అభివృద్ధి పనులు కానివ్వండి ప్రజలు క్షేమంగా సంతోషకరంగా ఉండే విధంగా మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, చూస్తున్నారు అని. అన్నీ కూడా మంచిగా జరిగేందుకే ఈరోజు మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ లను మన టిడిపి కైవసం చేసుకోవడం జరిగిందని. మాండ్ర శివానందరెడ్డి సారథ్యంలో అన్ని మండలాలు బాగుండాలి అన్ని గ్రామాలు బాగుండాలి అనే అంశంతో వచ్చినటు వంటి ఫండ్స్ ఏదైతే ఉందో గ్రామాలు అభివృద్ధి చెందే దిశగా ఈరోజు అందరు కూడా కృషి చేయాలనే దిశగా మా వైపు రావడం జరిగిందని. కచ్చితంగా ఈ అవిశ్వాస తీర్మానాన్ని అభివృద్ధిని పొందుపరిచేందుకే ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని. ఈరోజు ఈ మండలంలో జరిగేటువంటి ఎన్ ఆర్ జి ఎస్ పనులు కాని మండలానికి ఏ పనులు వచ్చినా సరే అడ్డుపడినారని చెప్పేసి ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి నెగ్గడం జరిగిందని. దీనికి సహకరించిన ప్రతి ఒక్క ఎంపీటీసీ లకు మండల టిడిపి నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి,రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, గిరీశ్వర్ రెడ్డి,80 బన్నూరు సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, కె సి కెనాల్ చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రవి కుమార్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలియజేశారు.

## కూటమి అపచారానికి పరిహారంగా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు



**మంత్రాలయం , జనవరి 31,మనం న్యూస్ :** కూటమి ప్రభుత్వం అపచారానికి పరిహారంగా మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన తిరుపతి లడ్డు వ్యవహారంలో కూటమి ప్రభుత్వం అసత్యాలు ప్రచారం చేసి కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో ఆడుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఆ భగవంతుడే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు భీంరెడ్డి , మండల ఇన్చార్జ్ విశ్వనాథ్ రెడ్డి , పెద్దకడబూర్ మండల నాయకులు పురుషోత్తం రెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై అవగాహన కార్యక్రమం



- భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోండి
- ఎస్సై యు వేణుగోపాల్ రాజు

**సి.బెళగల్ జనవరి 31 మనం న్యూస్:** సి.బెళగల్ మండలం బురాండొడ్డి గ్రామంలో శనివారం నాడుసి. బెలగల్ పోలీస్ స్టేషన్కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్ శ్రీ వేను గోపాల్ రాజు ఆధ్వర్యంలో ప్రజా అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాల నివారణ, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన, భూ వివాదాల విషయంలో చట్టపరమైన పరిష్కార మార్గాలు అనే అంశాలపై గ్రామ ప్రజలకు వివరంగా అవగాహన కల్పించబడింది. ఈ సందర్భంగా వేను గోపాల్ రాజు మాట్లాడుతూ, మహిళలపై నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బాధితులకు పోలీస్ శాఖ నుంచి పూర్తిస్థాయి సహాయం అందించబడుతుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్, సీట్బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. భూ వివాదాల విషయంలో గ్రామస్థులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా రెవెన్యూ శాఖ మరియు పోలీస్ శాఖను సంప్రదించి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆర్యవైశ్యుల్లో 95 శాతం కూటమికి ఓటు వేశారు

- రాష్ట్ర మంత్రి టీజీ భరత్




**కర్నూలు జనవరి 31మనం న్యూస్:** గడిచిన ఎన్నికల్లో 95 శాతం మంది ఆర్యవైశ్యులు కూటమికి ఓటు వేశారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి, అనంతపురం జిల్లా ఇన్చార్జి మంత్రి టీజీ భరత్ అన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ మండపం ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యే జె.సి అస్మిత్ రెడ్డితో కలిసి ఆయన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ మండపాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జే.సి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కూటమికి అండగా నిలిచారన్నారు. అందుకు తగ్గట్టుగానే సీఎం నారా చంద్రబాబు నాయుడు వైశ్యులకు ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. పక్క రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో వైశ్యులకు మంత్రి పదవి ఇచ్చారన్నారు. అంతేకాకుండా పెనుగొండను వాసవి పెనుగొండగా పేరు మార్పుచేశారన్నారు. ఇక అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం అమరావతిలో ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం 6 ఎకరాల స్థలం కేటాయించిందని, అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం పెడుతున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్తో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. 9 నెలల్లో దేశంలోవచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని ఇటీవల ఓ నివేదిక వెల్లడించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇక స్థానికంగా జే.సి కుటుంబం వైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వారి సహకారం వల్లే ఇలాంటి గొప్ప కార్యక్రమం జరుపుకుంటున్నామన్నారు. మంచిచేసే నాయకులకు ఎప్పటికీ అండగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ భూమా నాగ రాగిణి, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, వాసవి సత్ర సముదాయాల ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ డి.వి.ఆర్ జగదీష్ గుప్త, ఆర్యవైశ్య సంఘం తాడిప్రతి ఛైర్మన్ సురేంద్రనాథ్, కాశీ అన్నపూర్ణ సత్రాల ప్రెసిడెంట్ భవనాశి వాసు, పొలిటికల్ ఛైర్మన్ సత్యనారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్, అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 36 రోజులకు 37 లక్షల ఆదాయం



**మహానంది, జనవరి31,మనంన్యూస్:** శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 36 రోజులకు 37 లక్షల 47వేళా126 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సమీపిస్తుండటంతో ఉభయ ఆలయాలలోని హుండీలను శనివారం భక్తులు,సేవకుల ద్వారా లెక్కింపు చేశారు. యుఎస్ ఏ1రూపాయ డాలర్ 1,5రూపాయల డాలర్ లు 2,భూటాన్ 20, వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో డిఈఓ మోహన్,ఏఈఓ మధు, సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి,నీలకంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, సేవాసమితి సభ్యులు, భక్తులు,పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పథకాలతో ప్రజలకు లబ్ధి

- ఒక రోజు ముందుగా పెన్షన్ల పంపిణి
- పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్



**కర్నూలు , జనవరి 31(మనం న్యూస్ బ్యూరో):** కూటమి ప్రభుత్వం కు ప్రజలు ముఖ్యమని ప్రభుత్వ పథకాలను అమలు చేసి ప్రజలకు లబ్ధి చేస్తుందని, వాణిజ్యం , పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సందర్భంగా పేర్కొన్నారు. శనివారం ఉదయం మంత్రి 52వ వార్డు కొండారెడ్డి బురుజు దగ్గర నుండి సాయిబాబా గుడి వరకు ఉన్న 15 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు విచారించి మాల శ్రీనివాసులు , చిన్న ఖాసీం లకు వికలాంగుల పెన్షన్ ను.. మీనాక్షి , నాగమని లకు వితంతు మరియు ఇతరులకు వృద్ధాప్య - ఒంటరి మహిళల పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగా పని చేస్తున్నది అన్న విషయాలు మంత్రి వారిని ప్రశ్నించగా వారు మేము ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నామన్న విషయం తెలియజేశారు. ప్రతినెలా టంచునుగా పెన్షన్ వస్తుందా అని మరియు మొత్తం పెన్షన్ ఇస్తున్నారు కదా అని కూడా అడిగారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... ఈ కుటమి ప్రభుత్వం ఒకటో తారీకు సెలవు దినమైనప్పుడు పెన్షన్ ను ఒక రోజు ముందుగానే అందజేస్తుందని , అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెయ్యి రూపాయల మొత్తాన్ని ఒకటేసారి పెంచి 4000 ఇస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ 6,000 లు , మంచానికే పరిమితమైన వారికి 15 వేల వరకు పెన్షన్ అందజేస్తున్నామని భారతదేశంలో అత్యధిక సంఖ్యలో పెన్షన్ ఇస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం మాత్రమే అని , ప్రజలకు పథకాలు అన్నిటిని అమలు చేసి మంచి ప్రభుత్వం అన్న ప్రశంశ తెచ్చుకునిందని తెలిపారు.దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని మంత్రి టి.జి. భరత్ ప్రజలకు తెలియజేశారు. దావోస్ వరల్ ఎకనామిక్ ఫోరం లో జరిగిన వివరాలు తెలుపుతూ భారతదేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల కంటే ఉత్తమంగా ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు ఆహ్వానించే కమిట్మెంట్ ను అక్కడ వ్యాపారస్తులకు తెలపడం జరిగిందని మంత్రి తెలియజేశారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి కర్నూలు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లక్ష్యంగా ఎన్టీఆర్ భరోసా



- లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్నా టీడీపీ గ్రామ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్

**పత్తికొండ జనవరి 31(మనం న్యూస్ ):** పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం నిజమైన ప్రజాసంక్షేమానికి నిదర్శనమని నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షులు బత్తిన రాజశేఖర్ అన్నారు.శనివారం ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ కుమార్,టీడీపీ తెలుగు రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్ నాథ్ ఆదేశాలు మేరకు నలకదొడ్డి గ్రామంలో సచివాలయం సిబ్బందితో కలిసి అయన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా బత్తిన రాజశేఖర్ మాట్లాడుతూ అవ్వాతాతల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషమే మా కూటమి ప్రభుత్వానికి అసలైన విజయమని అయన పేర్కొన్నారు.అడుగడుగునా ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అందించిన ఆశీస్సులు మరువలేనివి అని అయన అన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒకరోజు ముందే అందించడంతో ప్రతి ఒక్కరి కళ్లలో ఆనందం కనిపిస్తోంది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ భార్గవి,రోజా,రాణి, టిడిపి నాయకులు రఘు శేఖర్, దశరథ్, మల్లికార్జున, రామలింగప్ప, నరసప్ప, రామన్న పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతపై మంత్రాలయం టీడీపీ ఇంచార్జి దృష్టి



**కౌతాళం, జనవరి 31 మనం న్యూస్:** సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కౌతాళం మండలం తోవి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి,జనసేన ఇంచార్జి లక్ష్మన్న,బిజెపి ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు గడపగడపకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, వృద్ధులు,వికలాంగులు, వితంతువులు ఎవరికి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా వారి ఇంటి వద్దకే చేరాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అదేవిధంగా,10లక్షల ఇఛి రోడ్డు డ్రైనేజీ పనులకు భూమి పూజను పూర్తి చేశారు.అలాగే, 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు ఏరిగేరి వెళ్లే రహదారి సమస్యను కూడా త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజల కష్టసుఖాల్లో నేరుగా పాల్గొంటూ, సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణ సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ నాయుడు సతీష్ నాయుడు,టీబీ ఎల్ ఎల్ సి చైర్మన్ టిప్పు సుల్తాన్,సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్,మండల ఉపాధ్యక్షులు కురువ వీరేష్, టౌన్ అధ్యక్షులు రాజానందన్,గ్రామ అధ్యక్షులు శంకర్, సొసైటీ డైరెక్టర్ సోమనాథ్, గ్రామయువ నాయకుడు విజయ్ మరియు కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన అవిశ్వాస తీర్మానం



**జూపాడుబంగ్లా, జనవరి 31 (మనం న్యూస్):** నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలంలో మండల అధ్యక్షురాలి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఎన్నికల అధికారి ఆర్డీఓ నాగజ్యోతి, ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తీర్మానం ఎన్నికలు నిర్వహించడం జరిగినది, ఈ అవిశ్వాస తీర్మానం ఎన్నికలకు ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు వైయస్సార్సీపి నుండి నీయమ్మతులైన మండల ఎంపీపీ సువర్ణమ్మ, తన పదవిని కోల్పోయేందుకు ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తడంతో సువర్ణమ్మ, తన పదవిని కోల్పోయారు. ఈ సందర్భంగా మండల ఎన్నికల అధికారి ఆర్డీఓ నాగజ్యోతి, మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలు ఉండగా అందులో ఒకరు మరణించగా ఇంకొకరు రాజీనామా చేయడం జరిగిందని, మిగతావారు ఈ అవిశ్వాస తీర్మానానికి ఎంపీడీవో కార్యాలయం నందు హాజరు కావడం జరిగిందని. అవిశ్వాస తీర్మానానికి ఏడు మంది హాజరై 7 మంది చేతులు ఎంపీపీ సువర్ణమ్మ, పై అవిశ్వాసం తెలియపరచడం జరిగిందని. మండల అధ్యక్షురాలి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని. ఈ ఓటింగ్ ప్రక్రియను కమిషనర్ వారికి పంపియడం జరుగుతుందని. తర్వాత మండల అధ్యక్షురాలిగా ఎంపికపై పంచాయతీరాజ్ కమిషనర్ వారు తెలియపరచడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.ఈ అవిశ్వాస తీర్మానానికి సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై మల్లికార్జున, వారి పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా శాంతియుతంగా అవిశ్వాస తీర్మాన ఎన్నికలు నిర్వహించడం జరిగింది, ఈ అవిశ్వాస తీర్మానంలో టిడిపి ఘన విజయం సాధించిందని స్థానికులు తెలియజేశారు.

## అట్టహాసంగా పింఛన్లు పంపిణీ




**సి.బెళగల్ జనవరి 31 మనం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వము ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ మంగళవారం నాడు సి.బెలగల్ మండలం బూరం దొడ్డి గ్రామంలో మండల కన్వీనర్ బి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఈరోజు ఇంటింటికి వెళ్లి అవ్వదాతలకు వితంతువులకు పింఛను పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వితంతువులకు4000 దివ్యాంగులకు రూపాయలు6000 కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తల సేమియా కాలేయము వ్యాధిగ్రస్తులకు 10 వేల రూపాయల పెన్షన్ మరియు మంచానికి పరిమితమైన వారికి 15 వేల రూపాయల పింఛను ప్రతి నెల ప్రభుత్వము ప్రతి ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు లోకేష్ గారు ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి ఇవ్వాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో పోలకల్ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బి చిన్న తిమ్మప్ప బి చంద్రశేఖర్ అమర్ సి.బెళగల్ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పి భీమన్న ధనుంజయ చికెన్ ఈరన్న ఈరన్న గౌడ్ మరియు మారం దొడ్డి గ్రామానికి చెందిన జిక్రియ భాష రుక్మాన్ పెద్ద సోమప్ప అలాగే పలుకు దొడ్డి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు బి రాజు గిడ్డయ్య బూరందొడ్డి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామ్మోహన్ రెడ్డి సర్పంచ్ రామకృష్ణ ఎస్ నాగరాజు సి.బెళగల్ మండలంలోని పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కర్నూలు బిడ్డకు అరుదైన గౌరవం

- ముద్దనూరు సీఐ సందెపోగు నాగేష్ బాబుకు 'పోలీసు సేవా పతకం'





**కర్నూలు, జనవరి 31మనంన్యూస్:** కర్నూలు జిల్లా గర్వించదగ్గ పోలీస్ అధికారి, ప్రస్తుతం కడప జిల్లా ముద్దనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న సందెపోగు నాగేష్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. పోలీస్ శాఖలో ఆయన అందిస్తున్న అసమాన సేవలకు గుర్తింపుగా 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పోలీసు సేవా పతకాన్ని' ప్రకటించింది.

**23 ఏళ్ల నిరంతర కృషికి లభించిన ఫలితం**

గత 23 ఏళ్లుగా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించిన నాగేష్ బాబు, నిబద్ధత గల అధికారిగా పేరు తెచ్చుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా, వృత్తి పట్ల ఆయన చూపిస్తున్న అంకితభావాన్ని గుర్తించిన ప్రభుత్వం ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. క్లిష్ట సమయాల్లోనూ సమయస్ఫూర్తితో వ్యవహరించి కేసులను ఛేదించడంలో ఆయన చూపిన చొరవను ఈ సందర్భంగా ఉన్నతాధికారులు కొనియాడారు.

**కర్తవ్య నిర్వహణలో కఠినం.. బాధితుల పట్ల కరుణ**

నాగేష్ బాబుకు ఈ పతకం దక్కడంపై ఆయన మిత్రులు, సన్నిహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఎంతో నిక్కచ్చిగా, క్రమశిక్షణతో వ్యవహరించే ఆయనకు, సమాజ సేవ పట్ల ప్రత్యేక మక్కువ ఉందని వారు గుర్తు చేశారు. బాధితుల పట్ల కరుణతో మెలుగుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గొప్ప సేవా గుణం ఆయన సొంతమని హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన అధికారిగా రాష్ట్ర స్థాయిలో ఇటువంటి గుర్తింపు పొందడం జిల్లాకే గర్వకారణమని ఆత్మీయులు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

# 5555 ఇ-సైకిళ్ల పంపిణీ చేపట్టి గిన్నిస్ రికార్డు సాధించిన చిత్తూరు జిల్లా

## సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు పత్రాన్ని అందుకున్న చిత్తూరు జిల్లా కలెక్టర్

## కుప్పాన్ని కాలుష్య రహితంగా చేసేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగా 5555 ఇ-సైకిళ్ల పంపిణి



**కుప్పం, జనవరి 31 మనం న్యూస్ :** కుప్పంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మహిళలకు ఈ-సైకిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'కుప్పంలో 5555 సూపర్ ఇ-సైకిళ్లను మహిళలకు అందచేశాం.గతంలో ఒకేసారి పెద్దమొత్తంలో సైకిళ్లను డెలివరీ చేసిన రికార్డును తుడిచి పెట్టి కుప్పంలో చరిత్ర సృష్టించాం. ఇ-సైకిళ్ల వల్ల రాబోయే కాలంలో ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇ-సైకిళ్లకు సూపర్ సైకిల్ అనే పేరు పెట్టాం. 60 కిలో మీటర్ల వరకు ఈజీగా సైకిల్ మీద వెళ్లి పని చేసుకోవచ్చు. సైకిల్ ఎక్కడికైనా దూసుకెళ్తుంది అదే ఈ సూపర్ సైకిల్. మొన్నటి ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేశారు. ఇప్పుడు ఆ సైకిల్ ద్వారా మీ ఆరోగ్యం బాగుండేలా చూస్తున్నాం. కాలుష్యం తగ్గించేలా కృషి చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణ, మహిళల సాధికారతే లక్ష్యంగా 5,500 ఈ-సైకిళ్లు పంపిణీ చేశాం. 24 గంటల్లో 5555 ఈ-సైకిళ్లు లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉంది. ఇది కేవలం రికార్డ్ కాదు - కుప్పం అభివృద్ధిలో సరికొత్త ప్రయాణం. లబ్ధిదారుల్లో చాలా మందికి ఈ-సైకిళ్లు ఎంతో సహాయకారిగా ఉంటాయి. విద్యార్థులు తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణానికి వీలు కలిగింది. నెలకు ఒక్కో కుటుంబానికి దీని ద్వారా రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఆదా అవుతుంది. మహిళకు సమయం కలిసి రావడంతో పాటు, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భావిస్తున్నాను. అన్నింటికన్నా ముఖ్యంగా పర్యావరణానికి మేలు చేస్తుంది. కాలుష్య రహితంగా కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం./ఎప్పుడూ కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది, ఫలితాలు అందరికీ దక్కుతాయి' అని అన్నారు.

## రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్లో ద్విశతకం 200 సాధించిన సీ.ఆర్. జ్ఞానేశ్వర్

- రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ చైర్మన్ సీఆర్ రాజన్

**తిరుచానూరు, జనవరి 31(మనం న్యూస్):** నాగలాండ్తో జరిగిన చివరి రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్లో ఆంధ్ర జట్టును నాకౌట్ దశకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ సీఆర్ జ్ఞానేశ్వర్కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అజేయ ద్విశతకం 248 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసిన జ్ఞానేశ్వర్, ఒత్తిడిలోనూ ఆంధ్ర జట్టుకు విజయదిశ చూపించారు. మాజీ చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర వన్నియ కుల క్షత్రియ చైర్మన్ సీఆర్ రాజన్ చిన్న కుమారుడైన జ్ఞానేశ్వర్ ఈ ఇన్నింగ్స్తో తెలుగు రాష్ట్రాల్లో క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించారు.ఆయన ప్రదర్శనతో ఆంధ్ర జట్టు నాకౌట్ స్టేజ్కు అర్హత సాధించగా, రాజకీయ, సామాజిక, క్రీడా వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. తిరుచానూరు గ్రామ ప్రజలు జ్ఞానేశ్వర్ కు అభినందనలు తెలిపారు.



## అవ్వాతాతలకు ముఖాల్లో ఆనందమే కూటమి లక్ష్యం

- 'మారెళ్ల సొసైటీ చైర్మన్ వై.వి ప్రభాకర్ రెడ్డి
- 'టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు

**తుగ్గలి, జనవరి 31(మనం న్యూస్)ః** ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న ఈ చిరునవ్వే మా కూటమి ప్రభుత్వ అసలైన విజయమని మారెళ్ల సొసైటీ చైర్మన్ వై.వి ప్రభాకర్ రెడ్డి ,టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు. రాంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ కుమార్ ఆదేశాలు మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించి,వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం, అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మ లకు పెంచిన పింఛన్ మొత్తాన్ని వారి చేతుల్లో పెట్టడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడమే మా లక్ష్యమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో వెల్ఫేర్ అసిస్టెంట్ పులిరాజు, స్థానిక టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



- తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

**తిరుపతి, జనవరి 31 మనం న్యూస్ః** శేషాచలం ప్రాంతంలో అరుదైన జాతి సంపదగా గుర్తింపబడిన ఎర్రచందనం దుంగలను ఇక్కడి నుండి అక్రమ మార్గాలలో రాష్ట్రాలు దాటించి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారని, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో త్రిముఖ చర్యలతో స్మగ్లర్లను పూర్తిస్థాయిలో నిలువరించడానికి పక్కా ప్రణాళికను అమలు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బరాయుడు స్పష్టం చేశారు. శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం దుంగలు అక్రమ మార్గంలో తెప్పించుకుని నకిలీ ప్రభుత్వ అనుమతి పత్రాలను సృష్టించి ఎక్కువ ధరలకు చైనా దేశానికి ఎగుమతి చేస్తున్న అంతర్జాతీయ స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ ను ప్రత్యేక వ్యూహంతో బలగాలను బృందాలుగా ఏర్పాటు చేసి అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో టాస్క్ ఫోర్స్ అధికారులతో అంతర్జాతీయ స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ అరెస్టు వివరాలను వెల్లడించారు.

సదరు మొహమ్మద్ ముజామిల్ లైసెన్సు పేరుతో ఎర్రచందనం దుంగలను చైనా దేశానికి ఇగుమతి చేస్తూ భారీగా అక్రమార్జన పొందాడని, శేషాచల అడవులలో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి ముద్దాయిగా ఉంటూ పరారీలో ఉన్నాడన్నారు. ఇతనిపై గత ఏడాది 60/2025 క్రైమ్ నెంబర్ టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యిందన్నారు. పక్కా ప్రణాళికను రచించి అంతర్జాతీయ స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్ ను చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారి తనపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన మొహమ్మద్ ముజామిల్ కు ఎర్రచందనం స్మగ్లర్ అయిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ సెట్టు, సేటు భాయ్, వాజీబ్ మరికొందరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలించడమే కాకుండా తక్కువ ధరలకు కొనుగోలు చేసి బెంగళూరుకు చెందిన రవి అనే వ్యక్తి ద్వారా రైతుల నుండి ఎర్రచందనం కొనుగోలు చేసినట్లుగా ప్రభుత్వ అనుమతులు పొంది చైనా దేశానికి అక్రమ రవాణా చేస్తూ అధిక లాభాలను పొందుతున్నారన్నారు.

చైనాకు చెందిన జో జో ఎర్రచందనం అక్రమ రవాణాలో మొహమ్మద్ ముజామిల్ కు సహకరిస్తున్న చైనా దేశానికి చెందిన జో జో అనే మహిళ గ్జియామెన్ ట్యాంగాంగ్ఫంగ్ ట్రేడ్ కో లిమిటెడ్ అను కంపెనీ తరఫున భారతదేశంలో ఎర్రచందనం అక్రమ రవాణా చేసే ప్రతినిధిగా ఉన్న మైఖేల్ పాత్రలపై లోతైన దర్యాప్తు చేపట్టి తదుపరి చర్యలను తీసుకోవడం జరుగుతుందని సుబ్బరాయుడు స్పష్టం చేశారు. శేషాచలం అడవుల నుండి పూర్తిస్థాయిలో ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా నిలువరించడానికి టాస్క్ ఫోర్స్ త్రిముఖ చర్యలను అవలు చేస్తోందని తెలిపారు.

ఇందులో భాగంగా అక్రమ రవాణా కేసులకు సంబంధించి కోర్టు ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేయడం, సాక్షులను న్యాయస్థానం ముందు హాజరపరిచి అక్రమ రవాణాలో నేరస్తులుగా ఉన్నవారికి శిక్షపడేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీని ఫలితంగా గత ఏడాది జనవరి నుండి ట్రైల్ జరిగిన 31 కేసులలో 27 కేసులలో శిక్ష పడి తద్వారా 87 శాతం ముద్దాయిలకు నేర నిరూపితమై న్యాయమూర్తి ద్వారా శిక్షలు విధింపబడ్డాయన్నారు.

### ఖబర్దార్ వైసీపీ నాయకులారా

# నోరు జాగ్రత్త

### అంబటి వ్యాఖ్యలపై కర్నూలు టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఫైర్



**ఆదోని, జనవరి 31(మనం న్యూస్)ః** మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిపై చేసిన అనుచిత, బాధ్యతారహిత వ్యాఖ్యలను కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ, వ్యక్తిగత దూషణలకే పరిమితమవడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల రాజకీయ దిగజారుడుకు నిదర్శనమని ఆమె మండిపడ్డారు. ప్రజల కోసం దశాబ్దాలుగా పారదర్శక పాలన, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడిపై అసభ్య పదజాలంతో దాడి చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించలేని వారు వ్యక్తిగత విమర్శలతో చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె విమర్శించారు. విమర్శలకు ప్రజాస్వామ్యంలో స్థానం ఉన్నప్పటికీ, అవి విధానాలపై ఉండాలి గానీ వ్యక్తిత్వ హననం చేసేలా ఉండకూడదని స్పష్టం చేశారు.గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుండటం ప్రతిపక్షానికి సహించని విషయం అయిందని ఆమె వ్యాఖ్యానించారు. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం ముందడుగు వేస్తుండటంతో రాజకీయంగా నిలదొక్కుకోలేని ప్రతిపక్ష నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని తెలిపారు. ఇకపై ఇలాంటి అసభ్య వ్యాఖ్యలను మానుకుని ప్రజల సమస్యలపై సానుకూల చర్చకు రావాలని వైసీపీ నాయకులకు గుడిసె ఆది కృష్ణమ్మ సూచించారు. లేకపోతే ప్రజలే తగిన సమయంలో సరైన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. రాష్ట్ర రాజకీయాల్లో సంస్కారం, విలువలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపై ఉందని ఆమె గుర్తు చేశారు.

## శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి రూ. 90 లక్షల విలువైన వైద్య పరికరాల విరాళం



**తిరుమల, జనవరి 31,మనం న్యూస్ః** శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి ముంబైకు చెందిన అల్కెమ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి మధురిమ సింగ్ రూ. 90 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను విరాళంగా అందించారు. శనివారం ఉదయం ఈ పరికరాలను టిటిడి జేఈవో (ఆరోగ్యం విద్య) డా. ఎ. శరత్ కు అందజేశారు. దాత అందించిన పరికరాలలో హై ఎండ్ వెంటిలేటర్లు -4, పేషెంట్ మానిటర్లు - 4, హ్యూమిడిఫయర్లు - 4, హెచ్ఎఫ్ఎన్సీ (హై ఫ్లో నాసల్ కేన్యులా పరికరాలు) - 4 ఉన్నాయి. ఈ సందర్భంగా జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, చిన్నపిల్లల హృదయ చికిత్సలకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన చిల్డ్రన్స్ ఆసుపత్రికి అవసరమైన పరికరాలను విరాళంగా అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అల్కెమ్ ఫౌండేషన్ మరింత అభివృద్ధి సాధించాలని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహం లభించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మధురిమ సింగ్ ను శాలువాతో సత్కరించి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ భరత్, అల్కెమ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి కేసును సిట్ మరింత లోతుగా దర్యాప్తు చేయాలి

- ఈడీ ఈ కేసులో విచారణ జరపాలి
- పాలు లేకుండా నెయ్యి ఎలా వచ్చింది
- కింది స్థాయి వాళ్ళను పట్టుకువచ్చి, దోషులుగా చూపిస్తే సరిపోదు




**తిరుపతి, జనవరి 31 మనం న్యూస్ః** తిరుమల తిరుపతి దేవస్థానాల్లో (టీటీడీ) చోటుచేసుకున్న కల్తీ నెయ్యి వ్యవహారంపై శాప్ చైర్మన్ రవినాయుడు తిరుపతిలోనీ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్ మీట్లో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశం కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్నదని పేర్కొంటూ, ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును మరింత లోతుగా, నిష్పక్షపాతంగా విచారించాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకమండలి హయాంలో జరిగిన 371 సవరణ ఎవరి కోసం, ఏ ఉద్దేశంతో తీసుకొచ్చారనే అంశంపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కల్తీ నెయ్యి కేసు విచారణను కేవలం పీఏ స్థాయి కే పరిమితం చేయడం సరికాదని, అసలు నిర్ణయాలు తీసుకున్న వారి వరకు విచారణ జరగాలని డిమాండ్ చేశారు. వై వి సుబ్బారెడ్డి పిఏ దోషి అంటే సరిపోతుందా..? పీఏ కి ఏ అధికారం ఉందని దోషిగా చూపించారు..? బోర్డులో నిర్ణయం తీసుకునే అధికారం ఎవరికి ఉంది..?వారి వెనుక ఉన్న పెద్దలు ఎవరు? వారిపై కూడా విచారణ జరపాల్సిందేనని రవినాయుడు స్పష్టం చేశారు. ఖిఐఖీ చార్జీట్లోని అంశాలను వైసీపీ నాయకులు ముందే ఎలా నిర్ధారిస్తున్నారు? అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు.

రాష్ట్రంలో ఏ గుడికి ఎంత నెయ్యి సరఫరా చేశారన్న అంశంపై పూర్తి వివరాలు వెలుగులోకి రావాలని, ఈ దారుణం కేవలం 250 కోట్ల రూపాయలకే పరిమితం కాలేదని తెలిపారు. పాలు లేకుండానే నెయ్యి ఎలా వచ్చిందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వైసిపి నేతలకు ఉందని కింది స్థాయి ఉద్యోగులను మాత్రమే బాధ్యులుగా చూపించి అసలు నిందితులను తప్పించేందుకు ప్రయత్నిస్తే అది ప్రజలను మోసం చేసినట్లేనని విమర్శించారు. టీటీడీలోని కొందరు అధికారులు, అప్పటి బోర్డులోని కొందరు సభ్యులు పరస్పరం కుమ్మక్కై ఈ తప్పిదానికి పాల్పడ్డారన్న అనుమానం బలంగా ఉందన్నారు. ఈ కేసులో ఈడీ (ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్) కూడా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు చేసిన తప్పును ఒప్పుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన బదులు, దొంగ నాటకాలు ఆడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

చివరిగా ఈ మొత్తం కల్తీ నెయ్యి వ్యవహారంపై ప్రజల్లో ఉన్న అనుమానాలకు స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కరుణాకర రెడ్డి లేదా ఆయన బంధువు సుబ్బారెడ్డి, అలాగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైనే ఉందని రవినాయుడు స్పష్టం చేశారు. అదేవిధంగా, భక్తుల విశ్వాసానికి భంగం కలిగించిన ఈ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత, లోతైన విచారణ జరిపి, అసలు దోషులను శిక్షించాల్సిందేనని శాప్ చైర్మన్ రవినాయుడు గారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్,తోట వాసుదేవ,శ్రీధర్,కొట్టే హేమంత్ రాయల్,రంజిత్ నాయుడు, ప్రకాష్, మధు, హర్ష, దిలీప్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# చెవిరెడ్డికి అపూర్వ స్వాగతం పలికిన పార్టీ నేతలు, కార్యకర్తలు

- ఏర్పేడు టోల్ ప్లాజా నుంచి 150 కార్లుతో భారీ ర్యాలీ
- అడుగడుగునా హారతులతో 3గంటల పాటు సాగిన ర్యాలీ
- తనపల్లి సర్కిల్ వద్ద స్వాగతం పలికిన భూమన

**చంద్రగిరి, జనవరి 31 మనం న్యూస్ః** చంద్రగిరి ప్రజలు ఆరాధ్య నాయకుడు.. పిలిస్తే పలికే అభిమాన నాయకుడు చెవిరెడ్డి కి చంద్రగిరి ప్రజలు జేజేలు పలికారు.. చంద్రగిరి నియోజక వర్గం ప్రారంభమయ్యే చోటు వద్ద వేలాది మంది జనం నిలబడి గజ మాలలు, గుమ్మడి కాయలతో దిష్టి తీసి సాదరంగా స్వాగతం పలికారు.. జాతీయ రహదారిపై వందలాది వాహనాలు నడుమ చెవిరెడ్డి కాన్వాయ్ ముందుకు కేందలగా ప్రధాన కూడళ్లలో ఆయనకు సాదర స్వాగతం పలికారు.. చంద్రగిరి నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. గత ఏడాది జూన్ 18వ తేదీన అక్రమ కేసులో అరెస్టు చేసి విజయవాడ జిల్లా జైలులో 226 రోజులుగా నిర్బంధించారు. అనంతరం హైకోర్టు ఇచ్చిన బెయిల్ మీద బయటకు వచ్చిన చెవిరెడ్డి సుదీర్ఘ విరామం తరువాత చంద్రగిరి నియోజక వర్గంలో అడుగుపెట్టారు. చెవిరెడ్డి నుంచి చూసేందుకు జనం స్వచ్ఛందంగా తరలి రాగా నిర్దేశించిన ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చి సాదరంగా చెవిరెడ్డికి



స్వాగతం పలికారు.

**చెవిరెడ్డికి జన నీరాజనం.**

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పై విడుదలై వస్తున్నారని తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. జాతీయ రహదారికి ఆనుకుని వున్న పల్లెల్లోని జనం హారతులతో నీరాజనం పలికారు. చేరుకుని చెవిరెడ్డి కీ నీరాజనం పలికారు. చెవిరెడ్డికి జై కొడుతూ పలువురు మహిళలు మా అన్న వచ్చాడు మాకు భయం లేదంటూ ఆనందంతో చిందులు వేయడం విశేషం.

**టోల్ ప్లాజా నుంచి 150 కార్లుతో ర్యాలీ**

ఏర్పేడు టోల్ ప్లాజా నుంచి 150 కార్లు ర్యాలీగా రాగా దామినేడు నుంచి 250బైక్ లతో యువత ర్యాలీ చేశారు. చంద్రగిరి ప్రజలకు పదేళ్ల పాటు అన్నీ తానై చూసిన చెవిరెడ్డి నుంచి అక్రమంగా ఎనిమిది నెలల పాటు జైలులో నిర్బంధించడం తట్టుకోలేని జనం రోడ్లపై బారులు తీరి ఆయనకు స్వాగతం పలికారు.

**తణపల్లి క్రాస్ లో భూమన స్వాగతం..**

జాతీయ రహదారిపై భారీ ర్యాలీగా వస్తున్న చెవిరెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి తణపల్లి క్రాస్ వద్ద సాదర స్వాగతం పలికారు. తన రాజకీయ గురువు భూమనను చూడగానే చెవిరెడ్డి దిగివచ్చి నడిరోడ్డుపై పాద నమస్కారం చేశారు. అనంతరం చెవిరెడ్డిని హత్తుకున్న భూమన ఆత్మీయ పలకరింపుతో తన పోరాట పటిమకు అభినందనలు తెలిపారు.

**ప్రత్యేక ఆకర్షణగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి**

తన తండ్రి చెవిరెడ్డి వెనుక దండంపెట్టి అందరికీ అభివాదం చేస్తూ చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రజలు అందరికీ చెవిరెడ్డితో పాటు దండం పెడుతుండగా పార్టీ కార్యకర్తలు, నాయకులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినదించారు.

# అగమ్య గోచరం... ఆ నేత..!

## నామినేషన్లు విత్ డ్రా చేసుకోవాలంటూ ఒత్తిడి

నివ్వరబోయిన బీసీ వర్గానికి చెందిన ఓ..జంట

ముందు మాట ఇచ్చి ఆ తర్వాత ఇది ఏంటి..! అంటూ వాపోతున్న వైనం

బరిలో నుంచి నిష్క్రమించేది లేదంటూ బల్ల గుద్ది చెబుతున్న ఆ జంట భగ్గు మంటున్న బీసీ వర్గాలు

పేట మున్సిపాలిటీ పరిధి రాజకీయాలు రసవత్తరం



**సూర్యాపేట, జనవరి 31 (మనం ప్రతినిధి):** జిల్లా కేంద్రంగా బాసిల్లుతున్న సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో 'పుర' ఎన్నికల రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి... 'పెద్దదిక్కు' లేకపోవటంతో ఇరు వర్గాల చెందిన కిందిస్థాయి నాయకులు ఈ అవకాశాన్ని ఆయుధంగా మార్చుకుని అధికరాన్ని తమ చేతిలోకి తీసుకొని....' ఆడిందే ఆట పాడిందే పాట' అన్న చదంగా కౌన్సిలర్ల ఎంపిక విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు నాయకులు ఒక అడుగు ముందుకేసి పార్టీకి చెందిన కౌన్సిలర్ స్థానాలను బహిరంగంగా అమ్ముకుంటున్నారనే ప్రచారం సైతం రాజకీయ పక్షాల నుంచి బాటంగానే వినిపిస్తుంది. విషయంలోకి వెళితే.... ఒక పార్టీ ని నమ్ముకున్న 'ఒక జంట' మున్సిపాలిటీ పరిధిలోని రెండు వేరు వేరు వార్డుల నుంచి తమ తమ నామినేషన్లను ఇటీవల దాఖలు చేసింది.ఆ పార్టీలో ఇక్కడ పరోక్షంగా రెండు వర్గాలు కొనసాగుతున్నాయి... అందులో ఒక నేత మాట విని నామినేషన్ను దాఖలు చేసిన... ఆ జంట కు పెద్ద తలనొప్పి వచ్చి పడింది... మరో వర్గం నాయకులు నామినేషన్లు వేసిన జంటను విరమించుకొని... లేకుంటే వేరే మరొక వార్డు నుండి పోటీ చేయాలని.. ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది... అనుకోని ఈ చేదు అనుభవం ఎక్కడ తమ కొంప ముంచుతుందోనని ఆ జంట హైరానా పడుతుంది . తాము 'బిసి వర్గానికి' చెందిన వారం కావటమే తాము చేసిన తప్పు!... అంటూ ఆ జంట తమ సన్నిహితుల వద్దతమ ఆవేదనను చెప్పుకొని వాపోతున్నట్లు సమాచారం.... ఏది ఏమైనాప్పటికీ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నది లేదని ఆ జంట బాహటంగానే సన్నిహితుల వద్ద బల్లగుద్ది చెప్పున్నట్లు సమాచారం ఇదిలా ఉండగా ఆ పార్టీకి 'పెద్దదిక్కు' లేకపోవడంతో ఆ పార్టీలో ఉన్న ఇరువర్గాలు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కౌన్సిలర్ల సంఖ్య మొత్తంలో కొంత అటు ఇటుగా పంచుకొని తమకు తమకు అనుకూలమైన వ్యక్తులనే కౌన్సిలర్ గా పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు సమాచారం... పార్టీతో సంబంధం లేని వారిని కూడా మున్సిపల్ ఎన్నికల బరిలోకి దించి మీరే కాబోయే చైర్మన్లు అంటూ ముందస్తుగా తెలపటానికి వెనుక పరిణామం ఏంటో...

ఆ పార్టీ క్యాడర్ సైతం అంతు పట్టని ప్రశ్నగా మారింది.. దీనిపై కార్యకర్తలు నుండి విమర్శలు లేకపోలేదు.. తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేకున్నా స్థానికంగా బలంగా ఉన్న ఒక వర్గానికి చెందిన కుటుంబానికి సంబంధించిన వ్యక్తిని 'మీరే కాబోయే చైర్మన్' అంటూ కూడా ఎన్నికల బరిలోకి దింపినట్లు తెలుస్తుంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీలో కొనసాగుతున్న రాజకీయ తాజా పరిణామాలను చూసి పరిశీలకులు సైతం... ఇదేంటి అంటూ కంగు తింటున్నారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు... ఏది ఏమైనప్పటికీ మున్సిపాలిటీ రాజకీయాలు రోజుకో రకంగా రసవత్రాంగా సూర్యాపేటలో మారుతున్నాయి అనడంలో సందేహం లేదు.. దీనికి నిదర్శనమే తాజా రాజకీయ పరిణామాలు అద్దం పడుతున్నాయని చెప్పవచ్చు... నామినేషన్ల ఉపసంహరణ సమయం ముగిసే నాటికి.. ఇంకా ఎలాంటి పరిణామాలు రాజకీయ పక్షాలలోచోటు చేసుకుంటాయో..... ఎంతమంది తమ తమ నామినేషన్లను ఉపసంహరిం చుకుంటారో వేచి చూడాల్సిందే.

### భగ్గు మంటున్న బీసీ వర్గాలు...

ఇటీవల కాలంలో బీసీ నినాదం బలంగా వినిపిస్తున్న తరుణంలో సూర్యాపేట పుర ఎన్నికల్లో రెండు వేరువేరు వార్డుల నుండి నామినేషన్ దాఖలు చేసిన బీసీ వర్గానికి చెందిన... ఓ జంటకు దాఖలు చేసిన నామినేషన్ ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ లో ఒక వర్గం నుండి తీవ్ర ఒత్తిడి చేయడం పట్ల స్థానిక బీసీ వర్గాలు ఆగ్రఆవేశాలను వెళ్లకకుతున్నాయి.

### చైర్మన్ గిరిపై జోరుగా చర్చ...

అగ్రవర్ణానికి చెందిన ఒకరిని.. ఆ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా ప్రచారం చేస్తుండటంతో విస్కు పోవడం పార్టీ శ్రేణుల వంత్తెంది కనీసం పార్టీలో సభ్యత్వం అలాగే ఎన్నడూ జెండా పట్టుకోన దాఖలాలు కనిపించని కుటుంబానికి చైర్మన్ గిరి అంటగట్టే పరిస్థితి దాపరించిందంటూ.. ఆ పార్టీలోనే ఇరు వర్గాల నాయకులో కార్యకర్తలనుండి తీవ్ర చర్చకు దారితీస్తుంది.. పార్టీ ముక్కు మొఖం తెలియని వ్యక్తులకు పెద్దపీట వేసేందుకు జరుగుతున్న లోపాయికార పరిణామాలు ఏంటో అంటూ ఆ పార్టీ శ్రేణుల నుండే అనేక చర్చలు తెరమీదికి వస్తున్నాయి... ఏది ఏమైనా సూర్యాపేట మున్సిపల్ ఎన్నికలు ముగిసి చైర్మన్ పీఠం కైవసం చేసుకునే అంతవరకు రసవత్త పరిణామాలు ముందు ముందు చోటు చేసుకుంటాయి అనడంలో ఎలాంటి అతిశయోక్తి కాదు.

# సమాచార హక్కు చట్టం పౌరులకు బ్రహ్మాస్త్రం




- **సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ యం.ఏ. సలీం.**

**కామారెడ్డి, జనవరి 31 ( మనం న్యూస్ ):** కామారెడ్డి నియోజకవర్గంలోని లింగాయపల్లి గ్రామంలో కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ రెండవ యూనిట్ శీతాకాల ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ మూడవ రోజు కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ యం.ఏ. సలీం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రోగ్రాం అధికారి డా. జి. చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో వాలంటీర్లు గ్రామపంచాయతీ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, రోడ్లు ఊడ్చి పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యం.ఏ.సలీం మాట్లాడుతూ ., అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ఈ చట్టం బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందని అన్నారు. జవాబుదారీతనం, బాధ్యతాయుత పాలనకు ఇది మార్గదర్శకమని వివరించారు. అనంతరం మొక్క నాటిన వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అంది ంచారు. సలహాదారు భోనగిరి సద్గుణ రాజేశ్వర్ మాట్లాడుతూ., సమాచార హక్కు చట్టం లేకపోతే పౌర హక్కులు ప్రమాదంలో పడేవని, చట్టాన్ని సక్రమంగా వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా. యం.డి. తాహెర్ హుస్సేన్, డా. వి. అశోక్, భాగ్యలక్ష్మి, జామున, విజయలక్ష్మి, పవిత్ర, వాలంటీర్లు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

**సూర్యాపేట, జనవరి 31 (మనం ప్రతినిధి):** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జిఎస్ పాండా దాస్ అన్నారు.శనివారం కలెక్టరేట్ వి సి హాల్ నందు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రీకౌంటింగ్ అవసరమైనప్పుడు ఏ విధంగా అనుసరించాలో రిటర్నింగ్ అధికారులకు తెలియజేయాలని చెల్లని ఓట్లను ఏ విధంగా తొలగించాలి, చెల్లని ఓట్లను గణనీయంగా తగ్గించేందుకు, ఓటర్లను చైతన్య పరుచుటకు గాను ఓటు ఏ విధంగా వేయాలో అవగాహన వీడియోలు తయారుచేసి లోకల్



కేబుల్ ఛానల్ లో ప్రసారం చేయాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలింగ్ రోజున ఓటింగ్ కంపార్ట్మెంటుల లో వెలుతురు, లైటింగ్ స్పష్టంగా ఉండాలని అబ్జర్వర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే సీతారామారావు,సూపరింటెండెంట్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్లు హనుమంత్ రెడ్డి, రమాదేవి, డి శ్రీనివాస్, సిహెచ్ నాగరాజు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ 16 జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కి కోదాడ వాసి



**కోదాడ, జనవరి 31(మనం న్యూస్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అండర్-16 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనే ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు కోదాడకు చెందిన యువ క్రీడాకారుడు షేక్ అర్హన్ ఎంపిక కావడం గర్వకారణం.హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక పోటీల కోసం ఉమ్మడి నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికైన షేక్ అర్హన్, కోదాడ క్రికెట్ అకాడమీలో షేక్ అబూ బకర్ సిద్ధిఖ్ కోచ్ (9494160554) సారాద్యంలో శిక్షణ పొందుతూ తన ప్రతిభతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు.అతని క్రమశిక్షణ, కఠిన సాధన, ఆటలో ప్రతిభ కారణంగా ఈ అవకాశం దక్కింది. తల్లిదండ్రులు అతనిని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర స్థాయిలో కూడా కోదాడ క్రీడాకారులు రాణించడం గర్వకారణమని వారు తెలిపారు. ఈ సందర్భంగా కోదాడ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి సురేష్, మండల విద్యాశాఖ అధికారి మొహమ్మద్ సలీం షరీఫ్, కోదాడ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఖాజా మియా, తుమ్మల సురేష్, మీరా, డాక్టర్స్ క్రికెట్ జట్టు, కోదాడ రాయల్స్ క్రీడాకారులు, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ దిలీప్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ వినయ్, డాక్టర్ విజయ్, డాక్టర్ కలాం, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సాంబ, డాక్టర్ వెంకటేష్, అసోసియేషన్ సభ్యులు బడుగుల సైదులు, నాయిని నాగేశ్వరరావు, జబ్బార్, శ్రీకాంత్, బాలరాజు తదితరులు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.

# ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ

**రెంజల్, జనవరి 31 ( మనం న్యూస్ ):** రెంజల్ మండల కేంద్రంలో శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన పథకం కింద రెంజల్ గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అట్టడుగు వర్గాల మహిళలకు వంట ఇంధన సౌకర్యం అందించబడింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు పార్టీ కార్యకర్తలు కలిసి ప్రధానమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ భారతీయ జనతా పార్టీ నాయకులు, ఉపసర్పంచ్ చీలం మానసా రాకేష్ రెడ్డి, వార్డు సభ్యులు శ్రీకాంత్, కృష్ణవేణి, రమ్య,



శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, భవిష్యత్తులో మరిన్ని అర్హులైన కుటుంబాలకు కూడా ఈ పథకం ప్రయోజనం చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న డిఎస్పి



**మేళ్లచెరువు జనవరి 31 మనం న్యూస్:** మండల కేంద్రంలోని శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామివారిని శనివారం కోదాడ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. ఆయనతో పాటుగా హుజూర్నగర్ సిఐ చరమందరాజు, మేళ్లచెరువు ఎస్సై పరమేశ్వర్ కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేళ్ళ శంబిరెడ్డి, ఆలయ ధర్మకర్త వరగాని నాగరాజు వారికి శాలువాలు కప్పి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఈనెల 15 నుండి జరగనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై డిఎస్పి శ్రీనివాసరెడ్డి కార్యనిర్వాహనాధికారి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని డి ఎస్ పి అన్నారు.

# దంతాల నాగయ్యను పరామర్శించిన ఎర్నేని బాబు



**కోదాడ, జనవరి 31(మనం న్యూస్):** కోదాడలోని 17 వార్డులో నివాసముంటున్న దంతాల నాగయ్య ( కరెంటు నాగయ్య) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎర్నేని వెంకటరత్నం బాబు తన నివాసంలో ఆయనను పరామర్శించి ఆరోగ్యం గురించి వాకబు చేసి యోగక్షేమాలు తెలుసుకున్నాడు.

# శ్రీరాముడి జన్మ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు



**నేరేడుచర్ల, జనవరి 31 మనం న్యూస్:** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో గల శ్రీ కోదండ రామాలయంలో శ్రీరాముడి జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రంసందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు అభిషేకాలు శనివారం నిర్వహించారు. ఆలయ పూజారి బృందావనం శ్రీరామ నరసింహ తేజ ఆధ్వర్యంలో విశ్వేక్సన పూజ, పుణ్యాహవాచనం, స్వామివారికి అర్చన ఆవు పాలు, ఆవు నెయ్యి, ఆవు పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు పంచదార, పండ్ల రసాలతో వేద మంత్రాలతో విశేష అభిషేకాలు చేశారు అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందజేశారు,ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, ఆలయ ధర్మకర్త రాచకొండ నాగ మాధవరావు, పులిజాల వెంకటరమణారావు, ఉప్పల కృపాకర్, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, యడవల్లి వెంకటరెడ్డి, రాగిరెడ్డి గోపాల్ రెడ్డి, మా శెట్టి సైదయ్య, సుధాకర్ రెడ్డి, ఉమ్మడి సైదిరెడ్డి, తాటికొండ నర్సిరెడ్డి, గుండ్రెడ్డి కర్ణాకర్, వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనలో గ్రామ స్థాయి సిబ్బందే కీలకం

- **కళాభారతిలో మహిళలు - పిల్లల రక్షణపై భారీ అవగాహన సదస్సు**
- **బాల్య వివాహాలను అడ్డుకోవడంలో ప్రతి పౌరుడు బాధ్యత వహించాలి**
- **ముఖ్య అతిథిగా జస్టిస్ పి.సామ్ కోషీ**
- **గౌరవ అతిథిగా జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ**

**కామారెడ్డి, జనవరి 31 ( మనంప్రతినిధి ):** జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (హైదరాబాద్), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణపై శనివారం భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ ప్రజలతో నిత్యం మమేకమై పనిచేసే పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడీ



టీచర్లు, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు బాల్య వివాహాల నివారణ, చిన్నారులకు పోషకాహారం అందించడం, మహిళలు - పిల్లల హక్కులపై అవగాహన కల్పించడంలో ముందుండాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ పి. సామ్ కోషీ పిలుపునిచ్చారు.

### మహిళలు, పిల్లల రక్షణ - సామాజిక బాధ్యత

శనివారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (హైదరాబాద్), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల రక్షణ - సామాజిక బాధ్యత అనే అంశంపై గ్రామ సెక్రటరీలు, కమ్యూనిటీ పెద్దలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ పి. సామ్ కోషీ హాజరయ్యారు. కామారెడ్డి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఎం. సుష్మ అతిథులను వేదికపైకి ఆహ్వానించగా, అనంతరం దీప ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి డా. చి.వి.ఆర్.ఆర్. వరప్రసాద్ స్వాగత ఉపన్యాసం అందించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, అదనపు జిల్లా కలెక్టర్ వి. విక్టర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేష్, జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల తదితరులు తమ ప్రసంగాల్లో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణలో సమాజం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ మాట్లాడుతూ. , బాల్య వివాహాల నివారణ, మహిళలపై వేధింపుల నిరోధానికి చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. రానున్న సమావేశంలో జిల్లాను 'జీరో కేసుల' జిల్లాగా చేయాలి.

### ముఖ్య అతిథి జస్టిస్ పి. సామ్ కోషీ మాట్లాడుతూ .,

బాల్య వివాహాలు సమాజానికి శాపంగా మారాయని, ఇవి చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్ తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండని బాలికకు, 21 సంవత్సరాలు నిండని బాలుడికి వివాహం చేయడం చట్ట విరుద్ధమని, ఇందుకు పాల్పడిన తల్లిదండ్రులు, పెద్దలు, మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో ప్రతి పౌరుడు బాధ్యత వహించాలని, ఇలాంటి ఘటనలు గమనించిన వెంటనే చైల్ లైన్ 1098 లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పి ఓ ఎస్ హెచ్ చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టాల అమలులో ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజల సహకారం అత్యవసరమని పేర్కొన్నారు. మహిళలు, పిల్లల హక్కుల పరిరక్షణలో న్యాయ సేవల సంస్థలు అందిస్తున్న సేవలను వివరించారు. వచ్చే ఏడాది నాటికి కామారెడ్డి జిల్లాలో ఇలాంటి కేసులు లేకుండా ఆదర్శ జిల్లాగా నిలపాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పి ఓ ఎస్ హెచ్ చట్టం, బాల్య వివాహాల నిషేధంపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కుంజా కుసుమ



ములుగు,జనవరి 31మనం ప్రతినిధి : మండలంలోని జగ్గన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని పులిగుండం గ్రామానికి చెందిన తాటి బాబురావు రావు ప్రమాదవశాత్తు చనిపోగా శనివారం రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకన్న, కిసాన్ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి నూనెటి శ్యామ్,ఉప సర్పంచ్ మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి బిసి సెల్ అధ్యక్షుడు తిరుపతి భూషణ్ సుమన్ వంక పగడాయా నారాయణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా, సంప్రదాయబద్ధంగా..వన జాతర

- పోరాటం, త్యాగం,నమ్మకాల సమ్మిలితామే మేడారం జాతర
- వనంలోకి వన దేవతలు



ములుగు,జనవరి 31, మనం ప్రతినిధిః ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర 2026 భక్తిప్రపత్తుల మధ్య ఘనంగా ముగిసింది. వన దేవతలు సమ్మక్క, సారలమ్మ లు గద్దెలను శనివారం 7.గంటల 55నిమిషాలకు వీడి వన ప్రవేశం చేయడంతో ఈ జాతర పరిసమాప్తమైంది. వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య, ఉద్విగ్న వాతావరణంలో అమ్మవార్లు చిలకలగుట్టకు, కన్నెపల్లికి, పయనమయ్యారు. భక్తులు అమ్మవార్లకు 'వన దేవతలు వనం లోకి' అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. 2026 జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. మేడారం జాతరకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా....మధ్యప్రదేశ్, చ త్తి స్ ఘడ్, ఒడిశా ఇలా దేశ నలుమూలల నుండి జాతర కి విచ్చేసి...అమ్మలకు మొక్కులు చెల్లించుకుని.... నిలువెత్తు బంగారం సమర్పించుకున్నారు.

## మేడారం జాతర సక్సెస్‌లో మంత్రి సీతక్క కీలక పాత్ర

- ధన్యవాదాలు తెలిపిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్

ములుగు,జనవరి 31మనం ప్రతినిధి : ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతర తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం నందు ఆదివాసీ సాంప్రాదాయలతో భక్తి శ్రద్ధలతో జనవరి 28 నుండి 31 వరకు జరిగిన సమ్మక్క సారళమ్మల జాతరలలో ఎటువంటి అవాంచనియా సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులచే సమన్వయము చేస్తూ దగ్గర ఉండి పర్యవేక్షణ చేస్తూ మునుపేన్నడు లేని విధంగా మేడారంను అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాతర ను విజయవంతం చేసిన మన ఆడబిడ్డ సమ్మక్క సారలమ్మల ప్రతిరూపం రాష్ట్ర



మంత్రి ధనసరీ అనసూయ సీతక్క కు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమైన భక్తులు



మేడారం, జనవరి -31: ములుగు ప్రతినిధిః ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరు గావించిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర కు దేశం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తి వచ్చారు. నాలుగు రోజులుగా మేడారం పరిసర ప్రాంతాలు అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు భక్తుల తో కిట కిట లాడాయి..మేడారం జాతర లో చివరి రోజు నేడు సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లు వనప్రవేశం జరుగుతున్న నేపథ్యంలో అమ్మవార్లను దర్శించుకునీ భక్తులు తిరిగి వారి వారి స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. భక్తుల తిరుగు ప్రయాణం సందర్భంగా ఆర్.టి.సి బస్టాండ్ ప్రాంతం లోని క్యూ లైన్లు నిండిపోయాయి.ఇప్పటి వరకు దాదాపు 12వేల ట్రిప్పుల బస్సులు నడిచినట్లు అధికారులు తెలిపారు.భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గుడారాలు,టెంట్లు కాళీగా దర్శనమిస్తున్నాయి. భక్తులు తమ సామగ్రినీ, పిల్లలను చేతిలో పట్టుకొని తిరుగు ప్రయాణం సాగిస్తున్నారు.

## మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం

నందవరం జనవరి మనం న్యూస్ః నందవరం మండల పరిధిలోని మిట్టసోమాపురం గ్రామంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు మిట్టసోమాపురం గ్రామంలో నందవరం మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా నందవరం మండల అధ్యక్షులు కాసీంవలి మాట్లాడుతూ గ్రామ టిడిపి నాయకులు వీరేష్ లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ఒకరోజు ముందుగానే పెన్షన్స్ లు పంపిణీ చేస్తున్న మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు ఆంధ్రప్రదేశ్లో జూలై 2024 నుండి అమలులోకి వచ్చిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద, సామాజిక భద్రతా పెన్షన్లు నెలకు రూ. 4,000 నుండి రూ. 15,000 వరకు వర్తిస్తాయి. వృద్ధులు, వితంతువులు, గీత/నేత కార్మికులకు రూ. 4,000, వికలాంగులకు రూ. 6,000, మరియు తీవ్రమైన వైకల్యం లేదా దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి రూ. 10,000 - రూ. 15,000 వరకు పెన్షన్ అందుతుంది. ఎన్నికల



ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గారు నిలిచారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ మద్దతుగా ఉండాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కొనసాగింపు అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో మిట్టసోమాపురం నాయకులు మరియు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## బలిజ అభ్యుదయ సేవా సమితి రజతోత్సవ వేడుకలు



- జే బీ శ్రీనివాస్, తిరుపతి రూరల్ జనసేన అధ్యక్షులు వెంకట్ రాయల్

తిరుచానూరు, జనవరి 31 మనం న్యూస్ః తిరుపతి కేంద్రంగా గత 25 ఏళ్లగా లాగా బలిజ కులస్తుల ఐక్యత మరియు అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న బలిజ అభ్యుదయ సేవా సమితి తన ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. సంస్థ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, సిల్వర్ జూబ్లీ (రజతోత్సవ) వేడుకలను పురస్కరించుకుని 'మహా బలిజ ఆత్మీయ సమావేశం' ఘనంగా నేడు తిరుచానూరు శిల్పారామం నందు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు, ఉమ్మడి చిత్తూరు జిల్లా బలిజ సోదరులు కుటుంబసమేతంగా పాల్గొని కార్యక్రమం ఘనవిజయం చెయ్యమని అసోసియేషన్ ప్రెసిడెంట్ సురేష్ బాబు , జనరల్ సెక్రటరీ ఊక విజయ్ కుమార్ కోరడం జరిగింది.

## తెలుగు ప్రజల ఆరాధ్య దైవం అన్న ఎన్టీఆర్

- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్



భీమవరం, జనవరి 31 (మనం న్యూస్)ః తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి బడుగు బలహీన, అట్టడుగు వర్గాలకు రాజకీయ పదవులు, సంక్షేమ ఫలాలు లభించేలా పరిపాలన చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల ఆరాధ్య దైవమని రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు గోలగాని రమేష్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్, పిఏసి చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తెలుగుప్రజల ఆరాధ్యదైవం అన్న ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన గొలగాని రమేష్ ను అభినందించారు. పిఎసి చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీని స్థాపించిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలో తీసుకువచ్చిన మొట్టమొదటి రాజకీయ నాయకుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. జిల్లా టిడిపి అధ్యక్షుడు మంతెన రామరాజు మాట్లాడుతూ తెలుగురాష్ట్రాలతో పాటు భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలను ఏకంచేస్తూ నేషనల్ ఫ్రంట్ నెలకొల్పి కాంగ్రెస్ పార్టీని గద్దె దింపిన అన్న ఎన్టీఆర్ అడుగుజాడలలో మనమంతా నడుచుకోవాలన్నారు. ముఖ్య అతిథులను గొలగాని రమేష్ గజమాల సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమం అనంతరం స్థానిక 6 వార్డు బొక్కవారిపాలెం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, ఏఎంసి చైర్మన్ కలిదిండి సుజాతరామచంద్రరాజు, ఇందుకూరి రామలింగరాజు వీరవల్లి దుర్గభవాని చంద్రశేఖర్, మేరగాని నారాయణమ్మ, గంటా త్రిమూర్తులు ఉప్పులూరి చంద్ర శేఖర్, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో సామాజిక భద్రత



- జిల్లాలో 2,27,933 మంది లబ్ధిదారులకు రూ. 98.42 కోట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ

విజయవాడ సెంట్రల్, జనవరి 31 (మనం న్యూస్)ః ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ద్వారా అర్హులైన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తదితరులకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతను కల్పిస్తోందని, పథకాన్ని జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంత అమలుచేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం 64వ డివిజన్ కండ్రికలో జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి పాల్గొన్నారు. పింఛనుదారులకు ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పింఛనుమొత్తాన్ని అందిస్తున్న తీరును పరిశీలించారు. లబ్ధిదారులైన వయోవృద్ధులను ఆత్మీయంగా పలకరించి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పేదలకు వరమని.సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకు ఈ సహాయం ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 2,27,933 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 98.42 కోట్ల మేర పంపిణీ చేయడం జరుగుతోందని.ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంటోందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు కార్యక్రమంలో 64 డివిజన్ అధ్యక్షులు కే రవికుమార్ పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలతో రైతులకు మేలు



- పశువైద్యాధికారి డాక్టర్.బాలకృష్ణ

తుగ్గలి, జనవరి 31(మనం న్యూస్ )ః పశు వైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు కలగనుందని పశువైద్యాధికారి డాక్టర్.బాలకృష్ణ అన్నారు. శనివారం రాంపురం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.పశువులకు గాలికుంటు వ్యాధి, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందులు, టీకాలు ఉచితంగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండటం వల్ల పాల దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండి పశువులను రక్షించుకోవాలని అయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్లలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ఆనందం



- ఎం.ఏ షరీఫ్, పొత్తూరి రామరాజు

నరసాపురం, జనవరి 31 (మనం న్యూస్)ః పేదలు, వృద్ధులు, దివ్యాంగులు వితంతువులు, డయాల సిస్ పేషెట్లకు, అర్హులైన ఇతర లబదారులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ద్వారా లక్షల కుటుంబాలలో వెలుగులు నింపుతుందని శాసనమండలి మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పేర్కొన్నారు. పట్టణంలోని15 వ వార్డులో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఏ షరీఫ్, పొత్తూరి రామరాజు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సంక్షేమ పాలనకు తమ ప్రభుత్వం సజీవ సాక్ష్యం అని నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం ఎందరో జీవితాలలో వెలుగు నింపుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 1వ తేదీ సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్ పంపిణీని చేపట్టామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కౌన్సిలర్ బొమ్మిడి సూర్య కుమారి కృష్ణమూర్తి, నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, భూపతి నరేష్, పొన్నాల నాగబాబు, పెండ్ర శ్రీనివాసు, బొమ్మిడి వెంకట్రావు, వీరాస్వామి, కొప్పాడ సత్యనారాయణ నాట్ర నరేష్, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నాయకుడు రమేష్ దారుణ హత్య



- ఆందోళనలో ప్రజా సంఘాలు

కర్నూలు జనవరి 31.(మనంబ్యూరో)ః కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దారుణంగా హతమార్చారు. శనివారం ఉదయం బొందిమడుగుల గ్రామంలోని రమేష్ బొంతిరాల రోడ్డులో వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్తో ఢీకొని, కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్ ను కుటుంబ సభ్యులు గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగా మృతి చెందినట్లు వైద్యుల ప్రకటించారు. దీంతో ఎమ్మార్పీఎస్ తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో వంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రమేష్ పై దాడి చేసి హతమార్చిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం కర్నూల్ లో కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఈ మార్గం లో వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది .ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ మార్గంలో వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండాబందోబస్తు ఏర్పాటు చేశారు .అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్ హత్యని నిరసిస్తూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. తుగ్గలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడల్లో స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ విద్యార్థి ప్రతిభ

నరసాపురం, జనవరి 31 (మనం న్యూస్)ః నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో డీఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి లంకె రాజేష్ జనవరి 28, 30 వ తేదీలలో తిరుపతిలో నిర్వహించిన ఐపిజిఎస్ ఎం -25 రాష్ట్రస్థాయి క్రీడలలో విశేష ప్రతిభ కనబరిచి లాంగ్ జంప్ విభాగంలో మొదటి స్థానం సాధించినట్లు సంపాదించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్ కిరణ్మయి, కళాశాల పీడి కెవివిఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె వి సత్యనారాయణ (కేవిఎస్), కోశాధికారి కె.వి. స్వామి, డైరక్టర్ అడ్డాల శ్రీహరి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. గోపీచంద్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది లాంగ్ జంపులో ప్రథమ స్థానం సాధించిన లంకె రాజేష్ కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాజేష్ మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

- ఏపీ మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే నాయకర్ వినతి



భీమవరం, జనవరి 31 (మనం న్యూస్)ః ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నరసాపురం నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పశ్చిమగోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను కోరారు. శనివారం జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన భీమవరంలోని కలెక్టరేట్ లో నిర్వహించిన పశ్చిమ గోదావరి జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజుతో పాటు జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# ఫుల్ స్వింగ్‌లో రవితేజ ‘ఇరుముడి’ షూట్!?

మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం భర్త మహాశయులకు సంక్రాంతి కానుకగా వచ్చి అలరించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఈ సినిమా తర్వాత తన నుంచి అనౌన్స్ అయ్యిన సినిమానే ఇరుముడి. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ తోనే మంచి పాజిటివ్ వైబ్స్ ని సొంతం చేసుకుంది.

ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్ లో నడుస్తున్నట్టు తెలుస్తోంది. డైలాగ్ కింగ్ సాయి కుమార్ తదితర ముఖ్య తారాగణంతో ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది అని తెలుస్తోంది. రవితేజ సినిమాలు ఎంత ఫాస్ట్ గా కంప్లీట్ అవుతాయో తెలిసిందే. అలానే ఇది కూడా కంప్లీట్ అవుతుంది. ఇక ఈ సినిమాకు జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు అలాగే మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్నారు.

## ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల విజేతగా రిబకినా



ఆస్ట్రేలియా ఓపెన్-2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్తాన్ స్టార్ ఎలెనా రిబకినా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్ పోరులో ప్రపంచ నంబర్ 1 ఆర్యనా సబలెంకాపై 6-4, 4-6, 6-4 తేడాతో విజయం సాధించిన రిబకినా.. తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ ను కైవసం చేసుకుంది. ఈ ఫైనల్ మ్యాచ్ ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగింది. తొలి సెట్ లో నిలకడైన ఆటతో 6-4 తేడాతో రిబకినా గెలచుకుంది. అనంతరం సబలెంకా తన మార్కు పవర్ హిట్టింగ్ తో పుంజుకుంది. ఈ సెట్ లో రిబకినాను 6-4 తేడాతో ఓడించిన సబలెంక.. మ్యాచ్ ను నిర్ణయాత్మక మూడో సెట్ కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక సెట్ లో కూడా సబలెంకా సత్తా చాటింది. వరుస గేమ్ లు గెలుస్తూ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లి టైటిల్ దిశగా సాగింది. అయితే ఆదే సమయంలో ఎలెనా రిబకినా అద్భుతమైన పోరాట పటిమ కనబరిచింది. సబలెంకా సర్వీస్ ను వరుసగా రెండుసార్లు బ్రేక్ చేసిన రిబకినా, 6-4 తేడాతో సెట్ ను సొంతం చేసుకుంది. తద్వారా తొలి ఆసీస్ ఓపెన్ టైటిల్ ఆమె ఖాతాలో చేరింది.

# తండ్రికి తగ్గ తనయుడు..

## యాభై వికెట్ల క్లబ్‌లో ఆ యువ క్రికెటర్..

భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ తనయుడు, ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ అర్జున్ తెందుల్కర్ కొత్త రికార్డు అందుకున్నాడు. అతడు ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో 50 వికెట్ల క్లబ్ లో చేరాడు. రంజీట్రోఫీలో భాగంగా గోవా




తరఫున అతడు మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్ లో ఈ ఘనతను సొంతం చేసుకున్నాడు. 2022- 2023 సీజన్ లో అర్జున్ తెందుల్కర్ గోవా తరఫున తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడాడు. అతడు ఆ మ్యాచ్ లోనే రాజస్థాన్ పై సెంచరీ బాదాడు. అలాగే ఆ తర్వాత గోవా తరఫున బౌలింగ్ లో అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

అతడి ఖాతాలోని 50 వికెట్లలో 13 వికెట్లను ఈ రంజీ ట్రోఫీ సీజన్ లోనే సాధించడం విశేషం. అర్జున్.. ఫస్ట్ క్లాస్ కెరీర్ లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నప్పటికీ.. తన తండ్రి సచిన్ కన్నా 21 వికెట్ల వెనకంజలో ఉన్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో సచిన్ 71 వికెట్లు సాధించాడు. దేశవాళీల్లో మొదట ముంబయి తరఫున ఆడిన అర్జున్ తెందూల్కర్ తర్వాత గోవాకు మారాడు. అప్పటి నుంచి అతడు ఆల్ రౌండర్ గా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. ఐపీఎల్ లో ఇంతకు ముందు ముంబయి ఇండియన్స్కు ప్రాతినిధ్యం వహించిన అతడు.. 2026 సీజన్ లో లఖ్ నవూ సూపర్ జెయింట్స్కు ట్రేడ్ ద్వారా వెళ్లిన విషయం తెలిసిందే.

సచిన్ తెందుల్కర్ బ్యాట్ తోనే కాకుండా, బంతితోనూ క్రికెట్లో తన ముద్ర వేశాడు. అంతర్జాతీయ స్థాయిలో సుదీర్ఘ ఫార్మాట్లో 46, వన్డేల్లో 154 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఒక్క టీ20 మ్యాచ్ ఆడిన సచిన్.. పొట్టి ఫార్మాట్ లోనూ ఒక వికెట్ ను తీసుకున్నాడు.

# సచిన్‌తో ముచ్చటించిన ఇండియా అండర్-19 క్రికెట్ జట్టు



భారత అండర్-19 క్రికెట్ జట్టు.. టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ తో వర్చువల్ గా సమావేశమైంది. ఆదివారం భారత్, పాకిస్థాన్ తో సూపర్ సిక్స్ లో భాగంగా తలపడనుంది. సచిన్ తో జట్టు సమావేశమైన ఫొటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పంచుకుంది. ‘తర్వాతి తరానికి ఇదో అమూల్యమైన అనుభవం. విజయం పొందేందుకు, క్రీడలో దీర్ఘకాలం కొనసాగేందుకు అవసరమైన ముఖ్యమైన అంశాలపై అవగాహన పొందారు’ అని బీసీసీఐ ఆ పోస్టులో పేర్కొంది.

‘సాంకేతిక నైపుణ్యాలు, ఫిట్ గా ఉండటానికి మాత్రమే పరిమితం కాకుండా.. దృష్టి కేంద్రీకరించడం, క్రమశిక్షణ, వినయం, విజయంలో పాతుకుపోవడానికి ఉన్న ప్రాముఖ్యాన్ని కూడా ఇది వివరిస్తుంది’ అని జోడించింది. సచిన్ తెందుల్కర్ తన కెరీర్ లో ఆరు వరల్డ్ కప్ టోర్నమెంట్లలో పాల్గొన్నాడు. అత్యధిక వరల్డ్ కప్లు ఆడిన బ్యాటర్ గా రికార్డ్ సృష్టించాడు. అతడు 45 వరల్ కప్ మ్యాచుల్లో 2,278 పరుగులు సాధించాడు. అలాగే 2011 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. సచిన్ 2012లో వన్డేల నుంచి, 2013లో తన కెరీర్ లో 200వ టెస్ట్ మ్యాచ్ అనంతరం ముంబయి వాంఖడే స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ కు తన రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# ముందే ఊహించా.. ‘జన నాయగన్’ వివాదంపై స్పందించిన విజయ్



విజయ్ హీరోగా నటించిన ‘జన నాయగన్’ చిత్రం వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దర్శక నిర్మాతలు దీనిపై స్పందించగా.. తాజాగా విజయ్ ఈ విషయంపై మాట్లాడారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ‘జన నాయగన్’కు ఇలా జరగడం చాలా బాధగా ఉందన్నారు.

‘‘నా నిర్మాతల గురించి నాకు బాధగా ఉంది. నేను రాజకీయాల్లోకి రావడం వల్లే నా సినిమాకు ఇలా చేస్తున్నారు. నా కారణంగా నిర్మాతలు ఇబ్బంది పడుతున్నారు. రాజకీయరంగంలోకి రాకముందే వీటన్నిటికీ సిద్ధమయ్యాను. నా సినిమాపై ఈ ప్రభావం పడుతుందని ముందే ఊహించాను’’ అని తెలిపారు. ఈ సినిమా నిర్మాత వెంకట్ కె.నారాయణ కూడా దీని విడుదల ఆలస్యం కావడంపై ఇటీవల బాధపడ్డారు. దశాబ్దాల పాటు అభిమానులను అలరించిన విజయ్ కు సినిమాల నుంచి మంచి వీడ్కోలు దక్కాలని ఆయన ఆకాంక్షించినట్లు చెప్పారు. కానీ, పరిస్థితి తమ చేయి దాటిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

సెన్సార్ సమస్య వల్ల ఈనెల 9న విడుదల కావాల్సిన ‘జన నాయగన్’ వాయిదా పడింది. ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు అదే తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఎఫ్సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించింది. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై న్యాయస్థానం తాత్కాలిక స్టే విధించగా.. నిర్మాణసంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సినిమా విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్నే ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. ఈనెల 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి దీనిపై విచారణ జరపాలని ఆదేశించింది.

# మారుతితో ప్రభాస్ మరో సినిమా..

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా వచ్చిన చిత్రం ‘ది రాజాసాబ్’. ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఫలితాన్ని అందుకోకపోవడంతో ప్రభాస్ ఆయన దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్ చేయనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. భారీ స్థాయిలో హోంబలే ఫిలమ్స్ దీన్ని నిర్మించనున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అవి రూమర్స్ మాత్రమేనని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ప్రభాస్ రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. సందీప్ వంగా దర్శకత్వంలో ‘స్పిరిట్’లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా మంచి ఆదరణ సొంతం చేసుకుంది. 2027 మార్చి 5న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా ‘స్పిరిట్’లో సందీప్ చూపించబోతున్నారట. ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఇందుకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు థ్రిల్ పంచుతాయని తెలుస్తోంది. దీనితో పాటు హను రాఘవపూడి దర్శకత్వంలో ‘ఫౌజీ’లో ప్రభాస్ నటిస్తున్నారు.



# అలా పిలిస్తే నాకేం ఇబ్బంది లేదు!



దక్షిణాది ప్రేక్షకులు తనపై చూపించిన ప్రేమ వెలకట్టలేనిదని అంటోంది నటి శ్రియా శరణ్. ‘సంతోషం’, ‘నువ్వే నువ్వే’, ‘ఎలా చెప్పను’ లాంటి ఎన్నో ప్రేమకథా చిత్రాలతో అభిమానుల్ని ఆకట్టుకున్న కథానాయికీమె. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా కథల్ని ఎంచుకుంటోన్న ఈమె.. ఇటీవలే ‘స్పేస్ జెన్: చంద్రయాన్’ అనే సిరీస్ తో ఓటీటీ వేదికగా సందడి చేసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియ తన కెరీర్ ప్రారంభం రోజుల్ని గుర్తుచేసుకుంది.

‘‘బాల్యమంతా హరిద్వార్ లోనే గడిచింది. ఆ తర్వాత కథక్ నేర్చుకోవడం కోసం దిల్లీకి వెళ్లి.. 17ఏళ్ల వయసులోనే నటించడం మొదలు పెట్టాను. అదే నా జీవితంలో మొదటి పెద్ద మలుపు. ఎందుకంటే మా నాన్న ఇంజనీర్, అమ్మ టీచర్. అలాంటి కుటుంబం నుంచి వచ్చి నేను నటిని అవుతానంటే అందరూ ఆశ్చర్యపోయారు. తర్వాత సినిమా సెట్ లకు వెళ్లడం, కొత్త భాషలు నేర్చుకోవడం ఇవన్నీ నన్ను భవిష్యత్ జీవితానికి సిద్ధం చేశాయ’’ని అంది. ‘సౌత్ స్టార్’ అని తనని అభిమానులు పిలవడం గురించి మాట్లాడుతూ ‘‘నన్ను అలా పిలవడం వల్ల నాకెప్పుడూ ఇబ్బందిగా అనిపించలేదు. దక్షిణాది అభిమానుల ప్రేమకు కృతజ్ఞతలు’’ అని చెప్పుకొచ్చింది శ్రియ.



# అమ్మనయ్యాక పూర్తిగా మారిపోయా ఆలియా

అమ్మ అన్న పిలుపుతో ఆడదాని లోకమే మారిపోతుందంటారు. హీరోయిన్ ఆలియా భట్ కూడా అందుకు అతీతురాలు కాదు. తల్లయ్యాక తన ప్రపంచమే మారిపోయిందంటోంది ఆలియా. మాతృత్వం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. గర్భిణీగా ఉన్న తొమ్మిది నెలల్లో చాలా మార్పులొస్తాయి. శరీరమే కాదు మన ఆలోచన విధానాలు కూడా మారుతుంటాయి.

**డిలీట్ చేయాలన్న ఆలోచన**

ఎప్పుడైతే కడుపులో ప్రాణం పోసుకున్న బిడ్డను కళ్లారా చూస్తామో అప్పుడు పూర్తిగా మనల్ని మనమే మర్చిపోతాం. తనే ప్రపంచంగా మనకే తెలియనంతగా మారిపోతాం. మళ్లీ ఒకప్పటిలా ఉండాలనుకున్నా అది అసాధ్యం. చాలాసార్లు సోషల్ మీడియా డిలీట్ చేయాలనిపించేది. కానీ నా కెరీర్ ప్రారంభం నుంచి నన్ను సపోర్ట్ చేసినవారితో బంధాన్ని తెంచుకోవడం ఇష్టం లేక ఆ ఆలోచన విరమించుకున్నాను. కొన్నిసార్లు నా వ్యక్తిగత విషయాల్ని అందరితో పంచుకోవాలనిపించడం లేదు.

**నేను కూడా ట్రై చేయాలి**

అది నా పర్సనల్ అని నా అభిప్రాయం. నా ఫోన్ లో మొత్తం రాహా ఫోటోలే ఉన్నాయి. నేను కూడా అప్పుడప్పుడు ఫోటోలు దిగడానికి ప్రయత్నించాలి అని చెప్పుకొచ్చింది. ఆలియా భట్- రణ్ బీర్ కపూర్ 2022లో పెళ్లి చేసుకున్నారు. అదే ఏడాది వీరికి కూతురు రాహా జన్మించింది. ప్రస్తుతం ఆలియా, రణ్ బీర్.. లవ్ అండ్ వార్ సినిమా చేస్తున్నారు. నిర్మాతగా డోంట్ బీ షై సినిమా చేస్తోంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.